తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.APTEL / 2013 /50370
శనివారం 18.05.2024 | సంపుటి : 10 సంచిక : 309 | పేజీలు : 12 వెల: రూ. 4/-
Follow :
తెలంగాణ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 9848328698

సామాన్యుని స్వరం జనం గోసల గొంతుక జనంసాక్షి ఇది ప్రజల ఛానల్ JANAMSAKSHI TV

# నేడు మంత్రివర్గ సమావేశం



## పంట కొనుగోళ్లు, రుణమాఫీపై కీలకనిర్ణయాలు తీసుకునే అవకాశం

### సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటి • పలు సమస్యలపైనా చర్చ

హైదరాబాద్(జనంసాక్షి): కొద్ది రోజుల విరామం తరవాత తెలంగాణ మంత్రి వర్గం శనివారం సమావేశం అవుతోంది. పార్లమెంట్ ఎన్నికలనేపథ్యంలో ప్రభుత్వ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కోడ్ కారణంగా ఏ పనీ చేయలేక పోయారు. ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు సిఎం రేవంత్, మంత్రులు సచివాలయం నుంచి తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో శనివారం రాష్ట్ర కేబినెట్ సమావేశం జరుగనుంది.ఇందులో ప్రధానంగా రైతుల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నారు. . ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్.. ఇప్పటికే అధికారులను ఆదేశించారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్. క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని కోసం రూ. 34 వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని అంచనా. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్

మిగతా 2లో..

# రాజ్యాంగానికి ప్రమాదం పొంచివుంది

## కాంగ్రెస్‌ను గెలిపించండి • రాయ్‌బరేలితో అనుబంధం విడదీయలేనిది

ఇందిర నుంచి మమ్ములను ఆదరించారు • నాలాగే ఇప్పుడు రాహుల్‌నూ ఆశీర్వదించండి

మీ ప్రేమకు సదా రుణపడి ఉంటాం • రాయ్‌బరేలీ సభలో సోనియా గాంధీ

అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు • నాకు ఈ ప్రాంతంతో విడదీయరాని అనుబంధం

అమేథీతోనే ఉన్నాను..ఉంటాను కూడా • ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఉద్వేగం

రాయబరేలి(జనంసాక్షి): తనను గతంలో ఆదరించినట్లుగానే తన తనయుడు రాహుల్‌ను కూడా రాయబరేలి ప్రజలు ఆదరించాలని, అతను మీ వెన్నంటి ఉంటాడని రాయబరేలి ప్రజలకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకీలక అభ్యర్థన చేశారు. నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించినట్టే తన కుమారుడు రాహుల్ గాంధీని కూడా అక్కున చేర్చుకోవాలని కోరారు. ప్రజల ఆశలను రాహుల్ ఏమాత్రం వమ్ము చేయరని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచా రంలో భాగంగా తొలిసారి సోనియాగాంధీ రాయబ రేలిలో శుక్రవారంనాడు ప్రసంగించారు. సోనియా గాంధీతో పాటు ఆయన కుమారుడు, రాయబరేలి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకగాంధీ కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు.చాలా కాలం తర్వాత మీ మధ్యకు రాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎంపీగా

మిగతా 2లో..





# అకాల వర్షానికి భారీ పంటనష్టం

## వర్షంతో అన్నదాతలు ఆగమాగం

### రాష్ట్రవ్యాప్తంగా కల్లాల్లో తడిసి ముద్దైన ధాన్యం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలకు రైతులు లబోదిబో మంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో కొనేవారు రాక ఆందోళన చెందుతున్నారు. పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, కంటిమీద కునుకు లేకుండా కష్టపడుతున్న రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటున్నారు. కల్లాల్లో ఆర బోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని

మిగతా 2లో..

# అంతులేని నియంతృత్వం

## దేశంలో ఎన్నడూ చూడని అవినీతి పాలన ఇది • భాజపాపై కేజ్రీవాల్ ఆగ్రహం



దిల్లీ(జనంసాక్షి): ప్రత్యర్థి పార్టీ నేతలందరినీ జైల్లో పెట్టారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భాజపాపై ఆరోపణలు గుప్పిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.దేశంలో కొనసాగుతున్న నియంతృత్వపాలన ఆమోదయోగ్యం కాదన్నారు. గత 75 ఏళ్లలో దేశంలో ఎన్నడూ చూడని ని యంతృత్వ పాలన కొనసాగుతోందని కమలద ళంపై ధ్వజమెత్తారు. అమృత్‌సర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన భాజపా పాలనపై మండిపడ్డారు.అమృత్‌సర్‌లో పంజాబ్ ఆప్ కార్యకర్తలు, ఎమ్మెల్యేలతో సహా పార్టీ నాయకులను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. పంజాబ్‌లోని మొత్తం 13లోక్‌సభ స్థానాల్లో ఆప్ విజయం సాధించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ప్రత్యర్థులను ఇలా జైల్లో పెడుతుండటం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. భారత్ పరిస్థితిని రష్యాతో పోలుస్తూ మాట్లాడారు. "రష్యాలో పుతిన్ తన ప్రత్యర్థి

మిగతా 2లో..

## మద్యం కేసు నిందితుల జాబితాలో 'ఆప్' పేరు

### ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈడీ
### కేజ్రీవాల్ అరెస్టు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

దిల్లీ(జనంసాక్షి): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం మరో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆమ్‌ఆద్మీ పార్టీని నిందితులుగా పేర్కొంది. మద్యం కుంభకోణంపై

మిగతా 2లో..

# బీజేపీతోనే అభివృద్ధి

## ఒడిశా ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



రౌర్కెలా(జనంసాక్షి): ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో బిజూ జనతాదళ్‌ను ఓడించేందుకు భాజపా తీవ్రంగా శ్రమిస్తోంది.ఇందులోభాగంగా సీఎం నవీన్ పట్నాయక్‌పై విమర్శల బాణాలు సంధిస్తోంది. తాజాగా భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒడిశాలోని రౌర్కెలాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశంలో జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భాజపా 270 సీట్లు ఖాయం చేసుకొని 400 దిశగా దూసుకెళ్తోందని వ్యాఖ్యానించారు. ఈసారి ఒడిశాలోనూ కమలం వికసిస్తుందన్న ఆయన.. ఇక్కడ 75 అసెంబ్లీ, 15 లోక్‌సభ సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు."కొన్నాళ్లుగా కోట్లాదిమంది పూరీ జగన్నాథ్ స్వామి భక్తులు రత్నభాండాగారం గురించే ఆలోచిస్తున్నారు. ఈ భాండాగారం

మిగతా 2లో..

## భాజపా మళ్లీ అధికారంలోకి రాకపోతే

# బుల్డోజర్లతో రామమందిరాన్ని కూలుస్తారేమో?

### ప్రధాని మోదీకి అనుమానాలు



లక్నో(జనంసాక్షి):విపక్ష ఇండియా కూటమిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఆ కూటమి ఎన్నికల బరిలో ఉందని మండిపడ్డారు.ఈ సందర్భంగా అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరం అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ సమాజ్‌వాదీ పార్టీ పై ఘాటు విమర్శలు చేశారు. వారు అధికారంలోకి వస్తే రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని బారా బంకీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "శ్రీరామనవమి రోజున రామమందిరంపై ఎస్పీకి చెందిన ఓ సీనియర్ నేత అనుచిత వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అయోధ్యపై సుప్రీం తీర్పును మార్చాలని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ రెండు పార్టీలకు కుటుంబం, అధికారమే ప్రథమ ప్రాధాన్యం. ఒకవేళ ఎస్పీ-కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారు రామమందిరంపైకి బుల్డోజర్లను పంపి రామ్‌లల్లాను మళ్లీ టెంట్‌లోకి తీసుకొస్తారు" అని మోదీ దుయ్యబట్టారు."ఓ వైపు భాజపా-ఎన్డీయే కూటమి జాతి ప్రయోజనాలకు జీవితాలను అంకితం చేస్తే.. ఇండియా కూటమి మాత్రం దేశంలో అస్థిర పరిస్థితులను సృష్టించేందుకు పోటీపడుతోంది. ఈ ఎన్నికల తర్వాత వారి కూటమి పేకమేడలా కూలిపోతుంది. జూన్ 4 ఎంతో దూరంలో లేదు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కారు హ్యాట్రిక్ కొట్టబోతోందని ప్రపంచమంతా తెలుసు" అని విజయంపై ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అమేఠీలో ఆయన పోటీ చేసే సాహసం చేయరని తాను ముందే ఊహించానని, ఇప్పుడు అదే నిజమైందని ఎద్దేవా చేశారు.రాయబరేలి ప్రజలు ప్రధానిని ఎన్నుకుంటారంటూ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం 'హ్యాట్రిక్' సాధించి తీరుతుందని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని అన్నారు. 'ఇండియా' కూటమి నేతలు ఒక్కొక్కరే జారుకుంటున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ రాజకుమారుడు అఖిలేష్ యాదవ్ ఒక కొత్త ఆంటీ

మిగతా 2లో..



## త్వరలో గ్రూప్-4 ఉద్యోగాల సర్టిఫికెట్

# వెరిఫికేషన్

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలవనున్నారు. కమ్యూనిటీ, నాన్‌క్రిమి లేయర్ (బీసీలకు), పీడబ్ల్యూడీ సర్టిఫికెట్స్, స్టడీ లేదా రెసిడె న్స్ సర్టింకెట్స్(క్లాస్ 1 నుంచి ఏడు వరకు),

మిగతా 9లో..

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

# హాల్‌టిక్కెట్ల విడుదల



హైదరాబాద్(జనంసాక్షి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్నాహ్నం

మిగతా 9లో..

# స్థిరాస్తి రంగానికి పెద్దపీట

## ప్రతి పౌరుడు లబ్ధి పొందేలా తమ ప్రభుత్వ విధానాలు • దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్తున్నాం:మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్(జనంసాక్షి):ప్రతి పౌరుడు లబ్ధి పొందేలా తమ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఉంటాయని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళుతున్నామని చెప్పారు.నిర్మాణ రంగంలో హరిత భవనాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నగరంలోని హైటెక్స్‌లో గ్రీన్ బిల్డింగ్ ప్రాపర్టీ షోను మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు."40 శాతం విద్యుత్‌ను నిర్మాణ రంగం వినియోగిస్తోంది. కర్బన ఉద్గారాలు సైతం వెలువడుతున్నాయి. హరిత భవనాల గురించి కొనుగోలుదారులకు నిర్మాణ సంస్థలు అవగాహన కల్పించాలి. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి నిర్మాణం ప్రారంభమైంది. ప్లాస్టిక్ వినియోగంపై కేంద్రంలోని అప్పటి మన్మోహన్‌సింగ్ సర్కారు కఠిన చట్టాలను తీసుకొచ్చింది. గతంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశాను. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.మా ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఐటీ రంగంలో రూ.వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎన్నో అవకాశాలు లభిస్తాయి. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పెట్టుబడిదారులు,

మిగతా 2లో..

# నిబంధనల ఉల్లంఘన వల్లే..

## ఆసియా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు: కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్



దిల్లీ(జనంసాక్షి):చట్టబద్ధ పాలనను విస్మరించడం, పరస్పరం కుదుర్చుకున్న ఒప్పందాలకు తూట్లు పొడవడం వంటి చర్యలతో ఆసియా భూభాగం, సముద్ర జలాల్లో సరికొత్త ఉద్రిక్తతలు తలెత్తాయని భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. తూర్పు లద్ధాఖ్‌తోపాటు దక్షిణ చైనా సముద్రంలో చైనా దుందుడుకు ధోరణి నేపథ్యంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో

మిగతా 2లో..

## భారాస ఎమ్మెల్సీ దండె విఠల్‌కు

# సుప్రీంలో ఊరట

### హైకోర్టు తీర్పుపై స్టే



2లో

# నేడు మంత్రి వర్గ సమావేశం

ఏర్పాటు చేసి రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న దానిపై రేవంత్‌కు క్లారిటీ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినెట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. అలాగే కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపైనా చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఈ విషయంలో అస్సలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన అనంతరం ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను హడావుడిగా అమలు చేశారు. ఆ పథకాల అమలు తీరుపైనా కేబినెట్ లో చర్చించే అవకాశాలు ఉన్నాయి. లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు చర్చించనున్నారు. అలాగే నెరవేర్చాల్సిన హామీలు.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపైనా మంత్రులతో .. కేబినెట్ భేటీ అనంతరం రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

# అంతులేని నియంతృత్వం

నాయకులందరినీ జైలుకు పంపడమో లేదా వారిని చంపడమో చేశారు. ఆపై ఎన్నికలు నిర్వహించి 87 శాతం ఓట్లు సాధించారు. ప్రతిపక్షమే లేనప్పుడు మీకు మాత్రమే ఓట్లు వస్తాయి" అని భాజపాపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు."నన్ను జైల్లో పెట్టారు, మనీష్ సిసోదియా (దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం)ను జైలుకు పంపారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతా అటాచ్ చేశారు. టీఎంసీను ఇబ్బందిపెడుతున్నారు. తమిళనాడులో స్టాలిన్ మంత్రులను జైలుకు పంపారు. అందరినీ జైల్లో పెట్టండి. అప్పుడు ఒకే పార్టీ, ఒకే నాయకుడు మిగిలిపోతారు. కానీ ప్రజాస్వామ్యం మనుగడే ఉండదు. ఇలా జరగనివ్వకూడదు" అని కేజ్రీవాల్ అన్నారు. ఇదిలాఉండగా.. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు కేజ్రీవాల్. ఈ క్రమంలోనే పంజాబ్‌లో ఆప్ అమృత్‌సర్ అభ్యర్థి కుల్దీప్ సింగ్ ధాలివాల్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు.

## ఏపీ ఎన్నికల హింసపై దర్యాప్తుకు 'సిట్'

– నేడు నివేదిక సమర్పించనున్న ఈసి

**అమరావతి,మే17(జనంసాక్షి):**ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలలో పోలింగ్ రోజు, ఆ తర్వాత కూడా చెలరేగిన హింసపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటైంది. ఏడీజీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ నియామకం అయ్యింది. ఇప్పటికే ప్రాథమిక విచారణ కూడా మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. శనివారంలోగా ఈసీకి సిట్ నివేదిక అందివ్వనున్నట్టు సమాచారం. పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలలోని జరిగిన ఘటనలపై నివేదించనున్న తెలుస్తోంది. సిట్ నివేదిక ఆధారంగా ఈసీ తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసీ ఆదేశాలతో హింసాత్మక ఘటనలకు కారకులైన నేతల అరెస్టులు జరిగే అవకాశం ఉంటుంది. కొందరు అభ్యర్థులతో అంటకాగిన పోలీసులపైనా ఈసీ చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కాగా హింసాత్మక ఘటనలు జరిగిన నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను గృహ నిర్బంధం విధించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్ల వద్ద సాయుధ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. అదనంగా 25 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించాలని దేశించిగా.. ఇప్పటికే రాష్ట్రానికి 20 కంపెనీల పారామిలిటరీ బలగాలు చేరుకున్నాయి. కౌంటింగ్, స్టాం÷-రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. స్టాం÷-రగ్ రూమ్‌ల వద్ద భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లను సీఈవో పరిశీలించనున్నారు.

## పీజీఈసెట్ పరీక్షలు వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ వ్యాప్తంగా ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మ్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది. గ్రూప్‌-1 ఎగ్జామ్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల నేపథ్యంలో పీజీఈసెట్ పరీక్ష తేదీల్లో స్వల్పమార్పులు చేసినట్లు కన్వీనర్ డాక్టర్ ఏ అరుణ కుమారి ప్రకటించారు. ఈ క్రమంలోనే జూన్ 6 నుంచి 9 వరకు జరగాల్సిన పీజీఈసెట్‌ను జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరింత సమాచారం కోసం ఉన్నత విద్యామండలి వెబ్?సైట్‌ను సందర్శించాలని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పీజీఈసెట్ పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది.

# మోదీపై రిటైర్మెంట్ వ్యాఖ్యలు అర్థం లేనివి

కేజ్రీవాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్



**లఖ్‌నవూ(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీపై వ్యాఖ్యలు చేసిన దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. మోదీ పదవీ విరమణ చేయనున్నారని, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పదవి నుంచి తొలగిస్తారని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు అర్థం లేనివని అసహనం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాజాజీపురంలో ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. భాజపా పార్టీ నిబంధనల ప్రకారం 2025లో 75 ఏళ్లు నిండిన అనంతరం ప్రధాని మోదీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతారని కేజ్రీవాల్ గురువారం పునరుద్ఘాటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదుపరి ప్రధాని కావడం ఖాయమని, ఆయన కోసమే మోదీ ఓట్లు అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. కేంద్రంలో భాజపా తిరిగి అధికారంలోకి వస్తే రెండు నెలల్లో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి పార్టీ తొలగిస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ మాట్లాడుతూ "2024 ఎన్నికల అనంతరం మోదీ ప్రధాని పదవిలో ఉండరని కేజ్రీవాల్ అంటున్నారు. ఆయన మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. ఆయన ఇప్పుడే బెయిల్‌పై బయటకు వచ్చారు. జూన్ 1 తర్వాత తిరిగి జైలుకు వెళ్లాలి. భారత ప్రధాని గురించి ఇలాంటి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు. 2024లోనే కాదు. 2029లోనూ మోదీ ప్రధాని కావాలని దేశం మొత్తం కోరుకుంటోంది. యూపీ సీఎంపై కూడా కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేశారు. బలమైన, సమర్థవంతమైన నాయకత్వం గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. అబద్ధాలతో రాజకీయాలు చేయలేమని నేను ఆయనకు చెప్పాలనుకుంటున్నాను"అని రాజ్‌నాథ్ తెలిపారు. భాజపా తిరిగి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం చిక్కుల్లో పడుతుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను రాజ్‌నాథ్ కొట్టి పడేశారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఎదురైంది ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలోనే అని ఆయన పేర్కొన్నారు.

# రాజ్యాంగానికి ప్రమాదం పొంచివుంది




ఉన్న ప్రేమానుబంధానికి తానే సాక్షినని చెప్పారు. తాను కూడా ఇదే తరహా రాజకీయాలను పాటిస్తున్నానని తెలిపారు. తాను రాయబరేలి నుంచి పోటీ చేస్తున్నప్పటికీ అమేథీతో మొదట్నించీ తనకున్న అనుబంధం చెక్కుచెదరదని, ఎప్పటికీ అమేథీ ప్రజల వెన్నంటి ఉంటానని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని రాహుల్ తెలిపారు. ఒక రాజకీయ పార్టీ, ఆ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని తిరగరాస్తామని, రాజ్యాంగాన్ని బుట్టదాఖలా చేస్తామని తొలిసారి చాలా స్పష్టంగా చెబుతున్నారని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగాన్ని చెరిపేద్దామా? రాజ్యాంగాన్ని తుడిచిపెట్టే శక్తి ఈ ప్రపంచంలో ఎవరికైనా ఉందా? అని ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని ప్రజలే పరిరక్షించుకోవాలని, రాజ్యాంగమే ప్రజా వాణి, ప్రజా భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఈ దేశంలో పేద ప్రజలకు ఏది చేసినా, రైతులకు సహాయపడినా, హరిత విప్లవం తెచ్చినా రాజ్యాంగంతోనే సాధించామని చెప్పారు. రాజ్యాంగానికి చరమగీతం పాడాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని, రాజ్యాంగం కనుమరుగైతే ఇక ప్రభుత్వ రంగమనేదే ఉండదని, ఉద్యోగాలు ఉండవని, ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుందని, రిజర్వేషన్లకు స్వస్తి పలుకుతారని, ప్రజల హక్కులు ఒక్కొక్కటి ఊడలాక్కుంటారని రాహుల్ హెచ్చరించారు. కేవలం ఎంపిక చేసిన 22-25 మంది కుబేరుల కోసం రైతులు, కార్మికులు, యువత, తల్లులు, సోదరీమణుల హక్కులను హరిస్తారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 140 సీట్లు సాధించడం కూడా కష్టమేనని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. నాలుగు విడతల ఎన్నికలు పూర్తయ్యే సరికే బీజేపీ ఓటమిదశకు చేరుకుందన్నారు. వారి రథం మునకలేస్తోందని, 400 సీట్లు తమ లక్ష్యమని నినాదాలిచ్చినా ప్రజలు 140 సీట్లకే పరిమితం చేయనున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను మార్చాలనుకుంటున్న వారిని ప్రజలే మార్చాలనుకుంటున్నారని అన్నారు. అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీ కుటుంబం విధేయుడుగా పేరున్న కిషోరి లాల్ శర్మ పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, బీఎస్‌పీ అభ్యర్థిగా నాన్హె సింగ్ చౌహాన్ పోటీ పడుతున్నారు.

**అమేథీ, రాయబరేలీల్లో గెలుస్తున్నాం: కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్**

ఈ లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మేము రాయబరేలి, అమేథీ రెండు స్థానాల్లో గెలుస్తామని అన్నారు.

మీకు సేవలందించే అవకాశం నాకు కలిగించారు. నా జీవితంలో ఎప్పటికీ దీన్ని మరిచిపోలేను. గత వందేళ్లుగా ఈ గడ్డతో మా కుటుంబ అనుబంధం వేళ్లూనుకుని ఉంది. ఈ అనుబంధం గంగాజలంలా స్వచ్ఛమైనది. అవధ్, రాయబరేలిలో రైతుల ఆందోళనతో ఈ అనుబంధం మొదలైందని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాయబరేలి ప్రజలు, మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ ద్వారా తాను నేర్చుకున్న పాఠాలే తన పిల్లలైన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీకి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజలకు ఇందిరాగాంధీ హృదయంలో ప్రత్యేక స్థానం ఉండేదని, ఆమె పనితీరును తాను చాలా దగ్గర నుంచి పరిశీలించానని, ఇక్కడి ప్రజలంటే ఆమెకు ఎనలేని అభిమానం ఉండేదన్నారు. ఇందిరాంగాంధీ నుంచి నేర్చుకున్న పాఠాలనే తాను తన పిల్లలకు చెప్పానని తెలిపారు. అందరినీ గౌరవించడం, బలహీనులను పరిరక్షించడం, ప్రజల హక్కులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి పోరాడటం, ఎలాంటి భయాలకు తావీయకుండటం వంటి పాఠాలు వారికి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజల ప్రేమ కారణంగా తనకు ఒంటరిగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలగలేదని సోనియాగాంధీ అన్నారు. 'ఈరోజు నా కుమారుడిని మీ చేతుల్లో పెడుతున్నాను. అతన్ని ఆదరించండి. నన్ను ఎలా ఆదరించాలో నా కుమారుడిని కూడా గుండెల్లో పెట్టుకోండి. రాహుల్ మీ ఆశలను వమ్ము చేయడు' అంటూ సోనియాగాంధీ భావోద్వేగానికి గురయ్యారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం పోటీ చేస్తున్న రాయబరేలి నియోజకవర్గానికి సోనియాగాంధీ 2004 నుంచి వరుసగా నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలిలో పోలింగ్ జరుగనుంది.

**అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అమేథీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అమేథీ నుంచే తాను రాజకీయాలు నేర్చుకున్నానని, తాను వారితోనే ఉన్నానని, ఉంటానని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థి కేఎల్ శర్మ తరఫున శుక్రవారంనాడు ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్‌తో పాటు అఖిలేష్ కూడా ప్రచారానికి హాజరయ్యారు. ఐదో విడత పోలింగ్‌లో భాగంగా మే 20న అమేథీలో పోలింగ్ జరుగనుంది. రాహుల్ తన ప్రసంగంలో 42 ఏళ్ల క్రితం తన తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి అమేథీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాల గురించి తాను ఏది నేర్చుకున్నా అది ఇక్కడి (అమేథీ) నుంచే నేర్చుకున్నానని, ప్రజలే తనకు నేర్పారని చెప్పారు. తాను తొలిసారి అమేథికి వచ్చిన సమయంలో అప్పుడు రోడ్లు కానీ, అభివృద్ధి కానీ లేదన్నారు. తన తండ్రికి, అమేథీ ప్రజలకు మధ్య

# మద్యం కేసులో నిందితుల జాబితాలో ఆప్ పేరు

ఈడీ దాఖలు చేసిన ఎనిమిదో ఛార్జ్‌షీట్ ఇది. అయితే, ఈ కేసులో కేజ్రీవాల్‌పై దర్యాప్తు సంస్థ అభియోగాలు మోపడం ఇదే తొలిసారి. మార్చి 21న ఆయనను అరెస్టు చేయగా.. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై బయటే ఉన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 18 మందిని ఈడీ అరెస్టు చేసింది. మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రధాన సూత్రధారి, కింగ్‌పిన్ కేజ్రీవాల్ అని ఈడీ ఆరోపించిన సంగతి తెలిసిందే. "నూతన మద్యం విధానం రూపకల్పనలో సీఎం కీలక పాత్ర పోషించారు. ఈ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ. 100 కోట్ల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించింది. ఆ సమయంలో కేజ్రీవాల్ బస చేసిన ఓ ఏడు నక్షత్రాల హోటల్ బిల్లులను ఈ కేసుకు సంబంధించిన నిందితుడు చెల్లించినట్లు మా వద్ద సాక్ష్యాలున్నాయి" అని ఈడీ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్, ఆప్‌పై ఈడీ తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. త్వరలోనే పార్టీకి చెందిన కొన్ని ఆస్తులను అటాచ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇదిలాఉండగా.. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు లో తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వు చేసింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు బెంచ్ ముందు వాదనలు వినిపించారు. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వు చేశాం. అప్పీల్‌దారు చట్టానికి అనుగుణంగా బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు 50 రోజుల పాటు తిహాడ్ జైలులో ఉన్న దిల్లీ సీఎంకు ఎన్నికల ప్రచారం నేపథ్యంలో మే 10న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి జూన్ 2న జైలులో లొంగిపోవాల్సి ఉంటుందని సూచించింది. ఎన్నికల ప్రచారం కోసమే బెయిల్ మంజూరుచేస్తున్నందున కేజ్రీవాల్ ఈ 21 రోజులు ముఖ్యమంత్రి కార్యాలయం/సచివాలయానికి వెళ్లరాదని, అధికారిక దస్త్రాలపై సంతకాలు చేయరాదని ధర్మాసనం షరతు విధించింది.

## స్థిరాస్తి రంగానికి పెద్దపీట

నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి రంగానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారాస ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సుప్రీంలో ఊరట

– హైకోర్టు తీర్పుపై స్టే

దిల్లీ(జనంసాక్షి):భారాస ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. పిటిషన్‌పై విచారణను జులైకి వాయిదా వేసింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి భారాస ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. అయితే, తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని కాంగ్రెస్ నేత పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. విఠల్ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని కోర్టును కోరారు. ఫోర్జరీని తేల్చేందుకు పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపించాలని కోరారు. అనంతరం దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెల్లడించింది. తాజాగా సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో దండె విఠల్‌కు ఊరట లభించింది.

## బీజేపీతోనే అభివృద్ధి

తాళం చెవిల మిస్టరీని బయటపెట్టాలని కోరుకొంటున్నారు. నవీన్ పట్నాయక్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు, వారి నమ్మకాలు, విశ్వాసాలతో ఆడుకుంటున్నారు. నవీన్ బాబూ.. రత్న భాండాగారం అసలు తాళం చెవి ఎక్కడ ఉందో చెప్పండి? ఈ విషయాన్ని ఒడిశా ప్రజలు తెలుసుకోవాలనుకొంటున్నారు. నకిలీ తాళాలు ఎవరు తయారుచేశారు? దీనిపై ఏర్పాటుచేసిన విచారణ కమిషన్ నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు? భాజపా ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోనే ఆ కమిషన్ నివేదికను బహిర్గతం చేస్తాం" అని అమిత్ షా హామీ ఇచ్చారు."ఈ ఎన్నికలు నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు, భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దేందుకు, దేశంలో మూడు కోట్ల మంది అక్కాచెల్లెళ్లను లక్షాధికారులుగా మార్చేందుకు, దేశంలో మూడు కోట్ల మంది పేదలకు ఇళ్లు అందించేందుకు, ఒడిశాలో నవీన్‌పట్నాయక్ సర్కార్‌ను తొలగించి అభివృద్ధిలో నవశకానికి నాంది పలికేందుకు జరుగుతున్న ఎన్నికలు" అని అమిత్ షా అన్నారు.

## నిబంధనల ఉల్లంఘన వల్లే

ఆయన ప్రసంగిస్తూ.. ఉగ్రవాదాన్ని దీర్ఘకాలంగా పెంచి పోషించిన ఓ దేశం.. చివరకు దానికే బలవుతోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు."ప్రపంచం ప్రస్తుతం మూడు 'ఎఫ్'ల సంక్షోభం ఎదుర్కొంటోంది. అవే ఫ్యూయెల్ (ఇంధనం), ఫుడ్ (ఆహారం), ఫెర్టిలైజర్స్ (ఎరువులు). అదేవిధంగా ఒప్పందాలను నిర్లక్ష్యం చేయడం, చట్టపాలనను విస్మరించడంతో ఆసియాలో కొత్త ఉద్రిక్తతలు ఉద్భవించాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ దౌత్యనీతిలో ధనబలం, ఆంక్షల బెదిరింపులు అస్త్రాలుగా మారాయని చెబుతూ.. చాబహార్ పోర్టు విషయంలో ఇరాన్‌తో భారత్ కుదుర్చుకున్న ఒప్పందంపై అమెరికా 'ఆంక్షల' హెచ్చరికలను పరోక్షంగా ప్రస్తావించారు. "ప్రపంచాన్ని సాధ్యమైనంతవరకు స్థిరీకరించడంలో దోహదపడటమే భారత్ పని. 'భారత్ ఫస్ట్', 'వసుధైవ కుటుంబం'ల కలయికే 'విశ్వబంధు'గా దేశ గుర్తింపును నిర్వచిస్తుంది" అని జైశంకర్ అన్నారు.






# అకాల వర్షానికి భారీ పంటనష్టం

పాట్లు పడుతున్నారు రైతులు. దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోతుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది ..వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్షార్పణమైం ది.. ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.. చాలా ప్రాంతాల్లో కల్లాల్లో దాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది రైతులు రోడ్లపై దాన్యం ఆరబోసుకుని అమ్ముకోవడానికి కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వడగండ్ల వానల నుండి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోలులో కొంత అంతరాయం ఏర్పడింది. ఆ జాప్యం ఇప్పుడు రైతుల గుండె చేరువయ్యాలా చేస్తోంది. చేతికొచ్చిన పంట వర్షార్పరం అయిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అక్కడా.. ఇక్కడన్న తేడా లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దడంతో రైతులు తల్లడిపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. మరోవైపు మామిడి పంటకు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది ఈదురుగాలుల ప్రభావంతో మామిడిపాటంతా నేలరాలిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు.. మిర్చి పంట కూడా దాదాపుగా తుడిచి పెట్టుకుపోతుంది. కళ్ళాల్లో ఆరబోసిన మిర్చి పంటనీతా తడిసి ముద్దమవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకున్నారు. వడగండ్ల వాన ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చూసిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు వర్షాల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందుల నుండి ప్రజలను రక్షించడం కోసం వరంగల్ నగరంతో పాటు జిల్లా కేంద్రాలలో అధికారులు టోల్ ఫ్రీ నెంబర్లను ప్రకటించారు అధికారులు.

## భాజపా మళ్లీ అధికారంలోకి రాకపోతే బుల్డోజర్లతో రామమందిరాన్ని కూలుస్తారేమో?

(మమతా బెనర్జీ) గొడుగు కింద చేరారు. ఆ కొత్త ఆంటీ పశ్చిమబెంగాల్‌లో ఉంది. మీకు బయట నుంచి మద్దతు ఇస్తామని ఆ కొత్త ఆంటీ ఇండియా కూటమికి చెబుతోందని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని మెరుగుపరచేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఇండియా



కూటమి ఒకవైపు ఉందని, ఎన్నికలు నడుస్తున్న కొద్దీ ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరే కూటమి నుంచి జారిపోతున్నారని చెప్పారు. కేంద్రంలో రాబోయే కొత్త ప్రభుత్వంలో పేదలు, యువకులు, మహిళలు, రైతుల కోసం ఎన్నో పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోనున్నామని మోదీ చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అంకితమైందని చెప్పారు. ఇండియా కూటమి నేతలు ప్రధానులవుతామంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తాను 'హ్యాట్రిక్' కొట్టేందుకు, సమాజంలోని అన్నివర్గాల కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 500 ఏళ్ల తర్వాత రామాలయం కల సాకారమైందంటే దానికి ప్రజల ఓటు బలమే అందుకు కారణమని అన్నారు. రామమందిరంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిరాజనేందుకు, మందిరంపై బుల్‌డోజర్ నడిపేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్టు తమకు తెలిసిందని, న్యాయబద్ధంగా బుల్డోజర్ నడిపించడం ఎలాగో యోగి ఆదిత్యనాథ్ నుంచి కాంగ్రెస్ వాళ్లు తెలుసుకోవాలని సూచించారు. ఇండియా బ్లాక్‌కు ప్రజలు ఓటు వేసి అధికారం ఇస్తే, ఎస్సీ, ఎస్టీ, ఆదివాదీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని తమ ఓటర్లకు ఇవ్వడం ద్వారా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతుందని హెచ్చరించారు. ప్రధానమంత్రి యూపీలోని ఫతేపూర్, హమీర్‌పూర్‌లోనూ బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు.

# గెలిస్తే అర్జునుడిని.. ఓడితే అభిమన్యుడినవుతా..

- గెలిచినా, ఓడినా చరిత్రలో నిలిచిపోతా...
- నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందిలి
- ప్రతి పక్షాలు బాధ్యతతో వ్యవహరించాలి
- ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బీజేపీకి కుదువ పెట్టిండ్రు.
- విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి విమర్శ



**జగిత్యాలబ్యూరో, మే 17 (జనంసాక్షి):** నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నిక పద్మవ్యూహమని ,ఇక్కడ గట్టి పోటీ ఉంటుందని తెలిసి కూడా పోటీచేశానని, గెలిస్తే అర్జునుడిని అవుతా, ఓడితే అభిమన్యుడిని అవుతానని నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సి తాటిపర్తి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ నుండి ఓడినా, గెలిచినా చరిత్రలో నిలిచిపోతానని పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాల లో జీవన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీ బీజేపీదేనని తెలిసి రాజకీయంగా జన్మనిచ్చిన జగిత్యాల ప్రజలకు సేవచేయలనే తపనతో నిజామాబాద్ నుండి పోటీచేశానని, ఇక్కడ టఫ్ ఉన్నప్పటికీ అందరి ఆశీర్వాదంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక ప్రణాళికతో రైతులకిచ్చిన హామీని నిలబెట్టేందుకు రెండు లక్షలు మాఫీ చేసి తీరుతామని తెలిపారు. మద్దతు ధరకు అదనంగా రు.500 బోనస్ ఇస్తామని, ధాన్యం తూకంలో కోత లేకుండా సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రైతులను విస్మరించిన బీఆర్ఎస్ పార్టీ రైతు దీక్ష చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని జీవన్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నిలువరించేందుకే బీఆర్ఎస్ బిజెపికి అమ్ముడు పోయిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి అని, కేవలం సన్న రకాలే సాగు చేయాలని, ధాన్యం కొనుగోలు చేయమని చెప్పి ,చెరువుల్లో తూములు బందు చేసిరైతులను ఇబ్బందిపెట్టి,ఐదేళ్లు పూర్తి అయిన పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని, కెసిఆర్ సన్నరకాలు సాగుచేస్తే ఏవిధమైన ప్రోత్సాహం ఇవ్వలేదని, సన్నారకలకు? 500 బోనస్ ఇస్తామంటే బీ అర్ ఎస్ నాయకులు రైతు దీక్ష చేపట్టడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీపై ధ్వజమెత్తారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా క్వింటాల్ కు 3 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని చెబుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 3వేలు మద్దతు ధర ఇస్తామని స్పష్టం చేశారు.స్వామి నాథన్ సిఫార్సులు పరిగణలోకి తీసుకోవడం లేదని, ఆయనకు భారతరత్న ఇచ్చి, సూచనలు అమలుచేయకపోవడం హాస్యాస్పద మన్నారు. రైతులకు మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని రైతులకు అండగా నిలువాలని రు.500 బోనస్ ప్రకటిస్తే ఎట్లా ఇస్తారు అనడం సరికాదన్నారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా, రీ సైక్లింగ్ అరికట్టబడాలని అప్పుడే వినియోదారుడు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటారని జీవన్ రెడ్డి అన్నారు. సన్న రకాల సాగు ఖరీఫ్ లోనే చేస్తారన్న విషయం కెసిఆర్ కు తెలుసో తెలియదోనని, ఖరీఫ్ పంట నాటికి రెండు లక్షలు రుణ మాజీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డీ నిర్మాణాత్మకంగా కార్యాచరణ రూపొందించి, చర్యలు చేపడుతున్నమని రైతులకు అండగా నిల్చేందుకు రైతు భరోసా అమలు చేసినం, ప్రభుత్వం అప్పు తీసుకు వచ్చి అయినా రుణ మాఫీ చేస్తామన్నారు. గతంలో క్వింటాల్ కు 10 కిలోల ధాన్యం అదనపు తూకం వెసింద్రని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి కోత లేకుండా సేకరిస్తోందని, ఈ ఏడాది అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని చెప్పారు. డెడ్ స్టోరోజి నుండి కుండా నీరు విడుదల చేసి పంటలను కాపాడినమని పేర్కొన్నారు.బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్ , బోనస్ ఇస్తుందా,మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నద అని జీవన్ రెడ్డీ ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, దుర్గయ్య, జున్ను రాజేందర్, చిట్ల అంజన్న, జితేందర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవితపై కేసు

- ఎమ్మెల్సీ కవితతో ములాఖాత్ అనంతరం బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్



**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవితపై కేసు పెట్టారని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. న్యాయవాదికి నోటీసులు ఇవ్వకుండానే జైలులోఉన్న కవితను సీబీఐ అరెస్టు చేసిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రౌజ్ అవెన్యూ కోర్టులో బెయిల్ పై విచారణ జరుగుతుండగానే రాత్రికి రాత్రికి జడ్జిని మార్చారంటే ఏ విధంగా వేధించాలని ప్రయత్నిస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. శుక్రవారం ఢిల్లీలోని తిహార్ జైలులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ములాఖత్ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రమైన, దేశమైన ఆదాయాన్ని పెంచుకోవడానికి రకరకాల పాలసీలు చేస్తుంటాయని, ఆ క్రమంలో ఆదాయం పెంచుకోవడం కోసం ఢిల్లీ ప్రభుత్వం లిక్కర్ పాలసీ తీసుకొచ్చిందని, ఆ పాలసీల అమలులో పాల్గొన్న ప్రతి ఒక్కరు నేరస్తులవుతే కేంద్ర ప్రభుత్వం కూడా నేరం చేసినట్లు అవుతుంది కదా అని అడిగారు. "కేంద్రం రైతులకు సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చింది. ఆరు నెలల తర్వాత ఉపసంహరించుకున్నారు. మరి ప్రధాని నరేంద్ర మోదీ ఎవరి ప్రయోజనాల కోసం ఆ చట్టాలను తీసుకొచ్చారు ? మోదీని అరెస్టు చేయాలి కదా ?" అని ప్రశ్నించారు. నిర్దోషిగా నిందితులే నిరూపించుకోవాలని, అంత వరకు జైలులో పెట్టవచ్చన్న పీఎంఎల్ఏ చట్టంలో సెక్షన్ 50లో ఉన్న చిన్న నిబంధను అడ్డంపెట్టుకొని రాజకీయ ప్రత్యర్థులను గొంతు నొక్కే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ఈ కేసులో ఎక్కడా డబ్బు దొరకలేదని గుర్తు చేశారు. దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్న రూ. 100 కోట్లు ఎక్కడ అని అడిగారు. డబ్బు స్వాధీనం చేసుకోకుండా వ్యక్తిని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. అలాంటప్పుడు కేసుకు పీఎంఎల్ఏ ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. లంచం డిమాండ్ చేసినట్లు కూడా ఈ కేసులో లేనప్పుడు అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తింపజేశారని అడిగారు. సహనిందుల నుంచి, అప్రూవర్ల నుంచి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకొని కవితను నిందితులుగా చేశారని అన్నారు. అన్ని వ్యవస్థలను తన నియంత్రణలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. కేసులో ఇతరులను ఇరికివ్వడానికి వాళ్ల పేర్లను చెప్పాలని, వీళ్ల పేర్లను చెప్పాలని దర్యాప్తు సంస్థలు ఒత్తిడి చేసినట్లు కవిత తమకు చెప్పారని వెల్లడించారు. అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వాస్ శర్మ, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఛగన్ భుజబల్, ప్రఫుల్ పటేల్ వంటి వారిపై ఉన్న కేసులు ఎందుకు ముందుకు సాగలేదని ప్రశ్నించారు. బీజేపీలో చేరిన వారి కేసులు ముందుకు సాగబోవడం లేదని, బీజేపీ అడుగులకు మడుగులు ఒత్తని వారో వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం

- జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని సైబర్ నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని, ప్రజలు అనవసర లింక్‌లు క్లిక్ చేయొద్దని, ఓటీపీ, పాస్‌వార్డ్‌లు ఎవరికీ చెప్పొద్దని అప్రమత్తతోనే మోసాలకు చెక్ పెట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ-మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు, విద్యార్థులు, యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్ బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలని, ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దని ఎస్పీ సూచించారు. లాటరీలు, బ్యాంకుల రివార్డు పేరిట, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి మోసం చేస్తున్నారని, బ్యాంక్ నుంచి మట్టాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండని,, మీ ఏటీఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నారని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో, క్రెడిట్ కార్డులిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యహరించాలని, మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికీ చెప్పొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదని, అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలని, బహుమతులు, లాటరీలు గెల్చున్నారంటూ వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలు అప్‌లోడ్ చేయవద్దని వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేస్తే 24 గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సోషల్ మీడియా వారియర్స్





**పాలకుర్తి, మే 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాదులోని మాదాపూర్ హైటెక్ సిటీ లో నిర్వహించిన సోషల్ మీడియా రాష్ట్ర సమీక్ష సమావేశంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నీ టీపీసీసీ పాలకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కో-కోఆర్డినేటర్ కొండ.శ్రీను, మండల సోషల్ మీడియా నాయకులు గూడ రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి వివరించాల్సిన బాధ్యత సోషల్ మీడియా నాయకులపై ఉందని అన్నారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కీలకపాత్ర పోషించాలని కోరారు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో సోషల్ మీడియా నాయకుల పాత్ర చాలా చురుకైనదని ఆయన తెలిపారు, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఎన్నికలు నిర్వహించిన ప్రభుత్వ పరిపాలన వ్యవస్థను ప్రజలకు వివరించేందుకు సోషల్ మీడియా నాయకులు ముందంజలో నిలవాల ని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా నాయకులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

## మేధావులు ఆలోచన చేసి నాకు అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి గుగులోత్ సంతోష్ నాయక్



**ములుగు బ్యూరో,మే17(జనం సాక్షి) :** శుక్రవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులను కలిసి ఈనెల 27 వ తేదీనాడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పకుండా నా క్రమసంఖ్య 51వ నెంబర్ గూగుల్ సంతోష్ నాయక్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి సంతోష్ నాయక్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి చాలామంది పట్టబద్రులు చదివి ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగులను కూలీలుగా మారుస్తున్నారని ఈ పార్టీలకు స్వస్తి పలికి నాకు అవకాశం ఇస్తే తప్పకుండా మీ సమస్యలను నా సమస్యలుగా పరిగణలోకి తీసుకొని అసెంబ్లీలో మాట్లాడుతూ పట్టభద్రులందరికీ న్యాయం జరిగే విధంగా కార్యచరణ ప్రణాళిక ఉంటుందని పార్టీలు కాకుండా ఇండిపెండెంట్ గా మీకోసం నీ యొక్క భవిష్యత్తు కోసం వస్తున్నానని ఆ దిశగా లక్ష్యం,ఆలోచన ఉండాలని మాట్లాడారు. వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో ఉన్న పట్టభద్రులందరూ తప్పక తనకు అవకాశం కల్పిస్తే భవిష్యత్తులో మీకోసం పోరాటం చేయడానికి, అహర్నిశలు కష్టపడడానికి ముందుం టానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాటోత్ గణేష్,లావుడ్యి రమేష్,ఆజ్మీర బావ్ సింగ్, రాహుల్, చంటి పాడ్య, తులసిరాం, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కార్యదర్శిగా ముజీబ్ నియామకానికి ప్రతిపాదన




**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** టీఎన్‌జిఓస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.ఎమ్. హుస్సేని (ముజీబ్) అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సభులు (45) యూనిట్స్ అధ్యక్షులు, కార్యదర్శులతో గృహకల్ప కార్యాలయంలో కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా లోక్ సభ ఎన్నికుల సందర్భంగా విధులు నిర్వహిస్తూ చనిపోయిన ఉద్యోగుల ఆత్మ శాంతికి ఒక్క నిమిషం మౌనం పాటించి శ్రద్ధంజలి ఘూటించారు. ముఖ్యంగా 22న జరిగే కేంద్ర సంఘ కార్యవర్గ సమావేశంలో కార్యదర్శిగా డా.ముజీబ్‌ను నియమించాలని ప్రతిపదించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 2023 పీఆర్‌సీ, హెల్త్‌కార్డ్, పెండింగ్ మెడికల్ రెయింబర్స్మెంట్ బిల్స్, జీపీఎఫ్ బిల్స్, సరెండర్ లీవ్ బిల్స్ మరియు ఇతర ఉద్యగుల ముఖ్య అంశాల పై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు ఇస్తున్న అరు గ్యారంటి పథకాలు మాదిరిగా ఉద్యోగుల కొరకు ఒక్క గ్యారంటి పథకం ఇవ్వాలని డా.ముజిబ్ అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, హరిబాబు, వైదిక్ శాస్త్ర, బోలిగిద్ద శంకర్, గీత సింగ్, ముహమ్మద్ వహీద్, మాజీ సభ్యులు ప్రభాకర్, జానకి పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో రైతులు ఆగమాగం





- కళ్లాల్లో తడిసిముద్దయిన ధాన్యం
- నేలకొరిగిన వరిపంటలు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆగమాగం అవుతున్నారు. గురువారం రాత్రి పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. కురిసిన వర్షం నుండి తేరుకుంటున్న సమయంలోనే శుక్రవారం మరికొన్ని చోట్ల వర్షం కురిసింది. దీంతో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం నిల్వలు తడిసి ముద్దయ్యాయి. విద్యుత్ సరాఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ముంపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి భారీగా వరదనీరు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పొలాలు నేలవాలాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడులు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురిసి నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు వరుసగా కురుస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

**జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు..**

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 226.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సగటున 20.5 మి.మీ వర్షపాతం నమోదు అయింది. జిల్లాలోని మండలాల వారిగా చూసుకుంటే మహదేవ్‌పూర్ లో 20.6 సెంటీమీటర్లు, పలిమెలలో 8.2, మహాముత్తారంలో 12.4, కాటారంలో 19.4, మల్హర్ లో 14.2, చిట్యాలలో 14.2, టేకుమట్లలో 13.4, మొగుళ్లపల్లిలో 13.2, రేగొండలో 39.8, గణపురంలో 47.2, భూపాలపల్లిలో 23.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.


## పక్కా ప్లాన్‌తో అంగన్వాడీ టీచర్ హత్య

- అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారం
- తర్వాత గొంతుకు స్కార్ఫ్ చుట్టి హత్య
- ఇద్దరు నిందితుల అరెస్టు
- బంగారం నగలు, బైక్ స్వాధీనం
- హత్య కేసును ఛేదించిన పోలీసులు



**ములుగు బ్యూరో, మే17(జనం సాక్షి) :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్ అడవిలో జరిగిన అంగన్వాడి టీచర్ హత్య కేసును పోలీసులు చేదించారు. ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అంగన్వాడి టీచర్ పై అత్యాచారం జరిపి ఆమెను హత్య చేసినట్లు గుర్తించారు.నిందితులను ఇద్దరిని కూడా అరెస్టు చేసినట్లు ప్రకటించారు.అరెస్ట్ అయిన నిందితుల నుంచి ఒక మోటార్ సైకిల్,మూడు తులాల బంగారం గొలుసు, పుస్తెలు,వృద్ధురాలు హ్యాండ్ బాగ్,అందులో ఉన్న బ్యాంక్ పాస్ బుక్స్,ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటారం అడవిలో ఈనెల 14వ తేదీన అంగన్వాడీ టీచర్ హత్యకు గురైన విషయం తెలిసిందే.ఈ హత్యపై ములుగు డీఎస్పీ రవీందర్ శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామంలో పనిచేస్తున్నారు.ఈనెల 14న కాటాపూర్ గ్రామంలో విధులను ముగించుకున్న అంగన్వాడీ టీచర్ చిన్నబోయినపల్లి గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరారు. గ్రామంలో బస్సు మిస్ అవ్వడంతో అంతకుముందే పరిచయం ఉన్న ఆకుదారి రామయ్య తాను లిఫ్ట్ ఇస్తానని కాటాపూర్ గ్రామంలో ఆమెను బైకు ఎక్కించుకున్నాడు. అప్పటికే ఆకుదారి రామయ్య కాటాపూర్ సమీపంలోని అడవి వద్ద గల నీళ్ల ఒర్రె వద్ద పగిడి జంపయ్య అనే వ్యక్తిని బైక్ పై దించాడు. కాటాపూర్ నుంచి అంగన్వాడీ టీచర్ తో బైకు పై బయలుదేరిన ఆకుదారి రామయ్య అడవిలో నీళ్ల ఒర్రె వద్దకు ఆమెను తీసుకెళ్లాడు.అక్కడ ఆకుదారి రామయ్య,పగిడి జంపయ్య ఇద్దరు కలిసి అంగన్వాడీ టీచర్ ను అడవిలో కొద్ది దూరం తీసుకెళ్లారు.ఆమెపై అత్యాచారం జరిపారు. తర్వాత అంగన్వాడి టీచర్ మెడలో ఉన్న బంగారం గోపితాడును లాక్కునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించారు.ఆమె తలపై రాయితో కొట్టాడు.తర్వాత ఆ రాయిని నీళ్ల ఒర్రెలో పడేశాడు. ఆకుదారి రామయ్య ఆమె చాతిపై కూర్చుని గొంతు నొక్కాడు.తర్వాత ఇద్దరు కలిసి ఆమె స్కార్ఫ్ తో మెడ చుట్టూ ఇద్దరు కలిసి లాగి ఊపిరాడకుండా చేసి అంగన్వాడీ టీచర్ ను చంపారు.తర్వాత ఆమె మెడలోని మూడు తులాల బంగారం గొలుసు, పుస్తెలను తీసుకున్నారు.ఆమె మొబైల్ ఫోన్లని పక్కనే ఉన్న నీళ్ల ఒర్రెలో పడేశారు. ఆమె బ్యాగుని కూడా అడవిలో దూరంగా విసిరేశారు. తర్వాత ఆకుదారి రామయ్య, పగిడి జంపయ్యలు తమ స్వగ్రామమైన ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు వెళ్లారు.మృతురాలి కొడుకు రడం చరణ్ ఫిర్యాదు మేరకు తాడ్వాయి పోలీసులు విచారణ చేపట్టారు.పస్రా ఇన్‌స్పెక్టర్ వంగపల్లి శంకర్, తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు సీసీ ఫుటేజీల, నిందితుల కాల్ డేటా ఆధారంగా పూర్తి ఆధారాలు సేకరించారు.శుక్రవారం నిందితులను ఇద్దరిని పట్టుకున్నారు.వీరిని పట్టుకోవడం, బంగారం రికవరీ, నిందితులు వాడిన వాహనం, రాయి, మృతురాలి వస్తువులను సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్ఐ చింత నారాయణ,హెడ్ కానిస్టేబుల్ కిషన్,హనుమాన్ పోలీస్ కానిస్టేబుళ్లు పూజారి రమేష్, జాజ సాంబయ్య, అప్పాల రమేష్, గోపు రాజీవ్, కాసగోని రాజేష్ లను ములుగు డీఎస్పీ రవీందర్ అభినందించారు.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 18 మే 2024



# అనుమతి లేని హోర్డింగులతో అపార నష్టం

ఇటీవల ముంబైలో 'ఘట్ కోపర్'లో కూలిన హోర్డింగ్ ప్రమాదంలో సుమారు 14మంది అమాయక ప్రజలు మరణించారు. సుమారు 74 మంది గాయాల పాలయ్యారు. అంతేకాకుండా అనేక కారులు, పెట్రోల్ బంక్ ధ్వంసమయ్యాయి. దీనికి ప్రధాన కారణం అనుమతి లేని హోర్డింగులు అని తెలుస్తోంది. ముఖ్యంగా పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఇటువంటి అనుమతి లేని హోర్డింగులు మన రాష్ట్రంలో కూడా అనేక పట్టణాలు, నగరాల్లో వందల కొలది దర్శనమిస్తాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కూడా అనేక అనుమతి లేని హోర్డింగులు ఉన్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రమే పరిపాలన అధికారులు హడావుడి చేస్తారు తప్పా, ముందుగా గుర్తించి చర్యలు ఎందుకు తీసుకోరో... మిలియన్ల డాలర్ల ప్రశ్న...!? పరిపాలన అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రతీ రోజూ వారి వారి పట్టణాలు నగరాల్లో పట్టపగలే తిరుగుతూ ఉంటారు. కానీ వీరికి ఈ హోర్డింగులు ఎందుకు కనపడవో.... అర్థం కాని విషయం. ఇకనైనా అధికారులు వారి వారి పట్టణాలు నగరాల్లో కొత్తగా ఏఏ ప్రాంతాల్లో హోర్డింగులు వెలుస్తున్నాయో ప్రతీరోజూ సి.సి ఫూటేజ్లు పరిశీలన ద్వారా, ప్రత్యక్ష సందర్శన ద్వారా పరిశీలించాలి. ప్రతీ హోర్డింగుకు అనుమతి ఉందా...!? లేదా..!? గమనించాలి. అనుమతి లేని హోర్డింగులను వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. అలాగే హోర్డింగుల నియమనిబంధనలు పాటించేటట్లు చూడాలి.

లిలిలి అదే విధంగా, అనుమతి పొందిన హోర్డింగులను కూడా పరిశీలన చేయాలి. వాటి నాణ్యత , సమయాన్ని (పీరియడ్) పరిశీలించాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. శిథిలావస్థలో ఉన్న హోర్డింగులు వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గంట గంటకు వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. ఈదురు గాలులు, సుడి గాలులు భయంకరంగా వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శిథిలావస్థకు చేరిన, అనుమతి లేని హోర్డింగులు, శిథిలావస్థకు చేరుకున్న ఇళు„, అపార్ట్మెంట్లు, విద్యుత్ స్తంభాలు, వంటి వాటిపై స్థానిక సంస్థల అధికారులు, పరిపాలన అధికారులు దృష్టి కేంద్రీకృతం చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలి. వాహనాలు, భవనాలకు, వివిధ ఆస్తులకు నష్టం కలగకుండా చూడాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఏమిటి...!? ఈ నానుడిని దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలు సంభవించకుండా ముందుగా చర్యలు తీసుకుంటే మంచిది. అదే సమయంలో ప్రజలు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ జీవన విధానం కొనసాగించాలి.

**- ఐపీరావు, 6305682733**

# ఎన్ని రాష్ట్రాలను నెంబర్ వన్ చేస్తారు!

*పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పీఎం మోదీ ఒకవైపు, హెూమ్ మంత్రి అమిత్ షా మరో వైపు అబద్ధాల టూల్ కిట్ తో ఓటర్ల నెత్తిలో మాడను ఉల్టా, ఫల్టా చేసేస్తున్నారు. మొన్న తెలంగాణ కు వచ్చి అమిత్ షా పార్లమెంట్ కు పది ఎంపీ సీట్లు ఇస్తే తెలంగాణ ను నంబర్ వన్ చేస్తానంటారు. అటు ఒడిశా,అస్సాం, కర్ణాటకలో ఎక్కువ ఎంపీ సీట్లు ఇస్తే ఆ రాష్ట్రాలను నెంబర్ వన్ చేస్తానంటారు పీఎం నరేంద్ర మోదీ, ఎక్కడి వెళితే అక్కడ ఈ విషయం చెబుతారు.దేశంలో అందరిని సమానంగా చూడాల్సిన పీఎం మోదీ, ముస్లింల మీద ద్వజం ఎత్తుతారు,కాంగ్రెస్ గెలిస్తే మహిళల మంగళ సూత్రాలు ఎత్తుకెళ్లి, ముస్లింలకు ఇస్తారంటారు,మరోసారి హిందూ, ముస్లింలు ఒక్కటే అని, నేను చిన్నప్పుడు ముస్లింల ఇండ్లలో తిన్నానని అంటారు. ఆయన అబద్దాల, మీద అబద్దాలు జనాన్ని తీవ్ర కన్ఫ్యూషన్ లోనికి తీసుకెళు„తున్నాయి. పీఎం కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతున్నట్లు చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. అందుకే పీఎం ఉన్నది, లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఆగం, ఆగం అవుతున్నారు. అందుకే పీఎం మోదీ ఏం మాట్లాడుతున్నారో, ఎవరికీ కూడా అర్ధం కావడం లేదు.*




బీజేపీ కి అబద్దాల పార్టీ గా ఈ ఎన్నికల్లో పేరు వచ్చేసింది. కేవలం ఎన్నికల్లో గెలువడానికి ఒక సారి ఒక మాట, మరో సారి మరో మాట, ఇలాంటి వాటిలో విద్వేషం పాలు ను కాస్త ఎక్కువే జోడించడం, సహజం అయిపోయింది. బీజేపీ మూడో సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం లో మార్పులు చేస్తారు. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు.రాజ్యాంగం లో మార్పులు కేవలం, రిజర్వేషన్ లు తగ్గించడం కోసమే! ఆర్ఎస్ఎస్ పక్కా ఎజండానే ఈ విషయం లో రిజర్వేషన్ ల వ్యతిరేకం, ఈ విషయం చాలా సార్లు వెల్లడి కూడ అయ్యింది, కాబట్టి బీజేపీ ఈ విషయంలో ఎన్ని వివరణలు ఇచ్చినా నమ్మకం జనంలో కలిగించ లేకపోతున్నారు.

### ప్రభుత్వ రంగం నాశనం!

బీజేపీ పది ఏండ్ల పాలనలో ప్రభుత్వ రంగం నాశనం అయ్యింది! ప్రభుత్వం సపోర్ట్ గా నిలబడే బదులు, నిలబడ్డ వారిని జైల్లో పెట్టే పరిస్థితి వచ్చింది.దేశంలో ప్రభుత్వ రంగం విషయంలోనూ, పీఎం మోదీ మాట తప్పారు. రైల్వే, ఎయిర్ పోర్ట్, పోర్ట్, బొగ్గు బ్లాక్ లు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, స్టేడియం లు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ లు ఇలా అన్నీ ప్రైవేట్ పరం చేసేసారు. కార్పొరేట్ లకు అమ్మేసారు. లేదా లీజుకు ఇచ్చారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, ఇవ్వాల్సింది 10 ఏండ్ల బీజేపీ పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు కాగా, కేవలం 20 ఏండ్లలో ఇచ్చిన ఉద్యోగాలు 7 లక్షల 70 వేలు మాత్రమే, ఇక నల్ల ధనం వెలికి తీసి ప్రతీ ఒక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తాము అన్నారు మోదీ, ఇది కూడ అబద్దమే అయ్యింది. రైతుల ఆదాయం డబుల్ అన్నారు. అది కూడా జరుగలేదు. రైతుల రుణ మాఫీ జరుగలేదు, ఎమ్మెస్పి చట్టం రాలేదు. ఇలా ఏ హామీ కూడ అమలు కాలేదు. పీఎం అన్నీ అబద్దాలే చెబుతారని తేలిపోయింది. హిందూ, ముస్లిం రాజకీయం కూడ ఫెయిల్ అయిపోయింది.

### అబద్దాల మనుషులు!

దేశంలో పీఎం మోదీ అయినా, హెూమ్ మంత్రి అమిత్ షా అయినా అబద్దాల మనుషులు అని వెల్లడి అయిపోయింది. అందుకే ఇప్పుడు ఆగం ఆగం అవుతున్నారు. ఎక్కడి వెళ్లినా అక్కడి రాష్ట్రమును రానున్న ఐదు ఏండ్లలో మీరే నెంబర్ వన్, అంటూ, నెంబర్ వన్ చేసేస్తామని అంటున్నారు. ఇన్ని అబద్దాలు అయితే ఎలా? అందుకే అలోచించి ఆశాభంగం చేసుకోకండి! జాగ్రత్త పడండి!జూట్ సే బచ్కే రహెూ! సచ్ కా సాత్ దేనా! భాయ్!( అబద్దం నుంచి తప్పుకుని ఉండాలి! నిజం కు చేయుత నివ్వండి)



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

# తేలిపోతుంది జూన్ 4న!

ఔరా..! ఈ ఎన్నికల్లో
ఆంధ్రా ఓటర్లు పోటెత్తారు
వానలు దంచి కొడితే
వాగులు వంకలు పొంగిపొర్లి
వరదలొచ్చి గొడ్డూ గోదా
కొట్టుకు పోయినట్టు...
ఈ ఓట్ల వరదకు...
ఈ ఓట్ల సునామీకి...
కొట్టుకుపోయిందెవరో...?
గడ్డిపరకలాజి
తట్టుకొని నిలబడిందెవరో..?
తేలిపోతుంది జూన్ 4 న...!!
దేశం నలుమూలల నుండి
ఉప్పెనలా సముద్రపు
కెరటాల్లా ఎగిసిపడిన
ఈ ఓటర్ మాంత్రికులు
ఎవరి కొంప ముంచారో..?
ఎవరి దుంప తెంచారో...?
తేలిపోతుంది జూన్ 4 న...!!
రెండు వైపులా
పదునైన ఓట్లకత్తితో...
ఈ ఓటరు మాంత్రికులు
ఎవరిని కసిగా పొడిచేశారో..?
ఎవరిపై కరుణకురిపించి కాపాడారో..?
తేలిపోతుంది జూన్ 4 న...!!
జోరు వానలో
హెూరుగాలిలా
విరుచుకు పడిన
ఈ ఓటర్ మాంత్రికులు
ఎవరి నెత్తిన కిరీటం పెట్టారో..?
ఎవరిని వీధిలోచెత్తకుండీలోకి
ఎంగిలి విస్తరాకులా విసిరేశారో..!
ఎవరికి ఓట్ల అరిటాకులో
పంచభక్ష్య పరమాన్నం వడ్డించారో..?
తేలిపోతుంది జూన్ 4 న...!!
పోలింగ్ కేంద్రాల
వద్ద పోటెత్తిన
ఈ ఓటరు మాంత్రికులు
ఎవరి నడ్డి విరిచారో..?
ఎవరికి గడ్డి పెట్టారో..?
ఎవరి నుదుట వీర
విజయతిలకం దిద్దారో..?
ఎవరిని ఐదేళ్ల వనవాసానికి పంపారో..?
తేలిపోతుంది జూన్ 4 న...!!
ఈ భారీ పోలింగ్ దేనికి సంకేతం
దుష్టకూటమి ఓటమికా..?
అవినీతి అసమర్థ ప్రభుత్వపతనానికా..!
తేలిపోతుంది జూన్ 4 న...!!
భారీ పోలింగ్ జరిగిన ఈ ఎన్నికల్లో
ఈ ఓటరు మాంత్రికులు
ఎవరినెక్కించారో ఎవరెస్టు శిఖరం..?
ఎవరికి చూపారో అథఃపాతాళం..?
ఎవరికి అందించారో అధికార పీఠం..?
ఎవరికి నేర్పారో గుర్తుండే గుణపాఠం..?
తేలిపోతుంది జూన్ 4 న...!!

**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**
**9110784502**

# బ్లడ్ పెషర్ సైలెంట్ కిల్లర్



మే 17ను ప్రపంచ రక్తపోటు దినోత్సవంగా గుర్తించబడింది. 2006 నుండి ప్రపంచ రక్తపోటు దినంగా పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలను సూచిస్తున్నారు. హైపర్టెన్షన్ మరియు దాని పర్యవసానాల గురించి అవగాహన కల్పించడానికి ఇది ఎంతగానో దోహదపడుతోంది. రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, దానిని నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండన్న వైద్యుల సూచనలు పాటిస్తే మంచిది. ఆరోగ్యవంతుడైన మానవుని సాధారణ రక్తపీడనం (బిపి) 120/80 ఉండాలి. ఇది 140/90 కంటే ఎక్కువైతే అధిక రక్తపోటు లేదా అధిక రక్తపీడనం హై బిపి గాను, 90/60 కంటే తక్కువైతే అల్ప రక్తపోటు లేదా అల్ప రక్తపీడనం లో బిపి)గాను అంటారు. ఈ రెండు ప్రమాదకరమైనవే. దీనిలో 120 అనేది సిస్టోలిక్ పీడనాన్ని, 80 అనేది డయాస్టోలిక్ పీడనాన్ని తెలియజేస్తుంది.హృదయం సంకోచాన్ని సిస్టోల్ అంటారు. హృదయం సడలికను డయాస్టోల్ అంటారు. రక్తపోటు వ్యాధి లక్షణాలు ఎట్టిపరిస్థితుల్లోను బయటపడవు. కాబట్టి దీనిని నిశ్శబ్ద కిల్లర్ అని పిలుస్తారు. హైపర్టెన్షన్ లేదా హై బ్లడ్ ప్రెజర్ అనేది సైలెంట్ కిల్లర్. శరీరంలోని దాదాపు ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, హైపర్టెన్షన్ మూత్రపిండాలను ప్రభావితం చేస్తుంది, స్ట్రోక్లు, తదుపరి పక్షవాతం ఏర్పడవచ్చు, జఠరికల విస్తరణకు దారితీయవచ్చు. రెటీనాపై కూడా ప్రభావం చూపుతుంది. భారతదేశంలో, కార్డియోవాస్కులర్ డిసీజ్ మరణానికి ప్రధాన కారణం, అధిక రక్తపోటు కారణం. భారతీయ జనాభాలో హైపర్టెన్షన్తో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2005లో 20.6 శాతం భారతీయ పురుషులు మరియు 20.9శాతం భారతీయ స్త్రీలు బాధపడుతున్నారని అంచనా వేయబడింది. ఈ సంఖ్య 22.9 నాటికి భారతీయ పురుషులు, స్త్రీలలో 23.6 మరియు 2025కి పెరుగుతుందని అంచనా వేయబడింది. చికిత్స పొందిన రోగులలో 25.6శాతం మంది మాత్రమే వారి బిపి నియంత్రణలో ఉండటం ఆందోళనకు అత్యంత ముఖ్యమైన కారణం. అవగాహన లేకపోవడమే అత్యంత ముఖ్యమైన ప్రమాదం. వివిధ మందులను టైట్రేట్ చేయడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచడం నిరంతర పర్యవేక్షణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇది హైపర్టెన్షన్ హైపర్టెన్షన్ కారణంగా భవిష్యత్తులో సంభవించే ఏదైనా తీవ్రమైన వ్యాధులను ముందస్తుగా నిరోధిస్తుంది.


**(మే17 ప్రపంచ రక్తపోటు దినోత్సవం)**

# దేశసంస్కృతికి భాండాగారాలు మ్యూజియంలు

*నిర్దిష్ట కాల వ్యవధిలో దేశం సంస్కృతి, వారసత్వం అభివృద్ధికి మ్యూజియంలు రుజువులుగా ఉంటాయి. ఇవి ఒక దేశ సంస్కృతికి భాండాగారం లాంటివి. 24 ఆగస్టు 2022న హేగ్ నగరంలో ఉన్న అంతర్జాతీయ మ్యూజియం కౌన్సిల్ (ఐకాం - ఐసిఒయం) సాధారణ సభ 92.41శాతంతో కొత్త మ్యూజియం నిర్వచనాన్ని తెలిపింది. సమాజ సేవలో పరిశోధిస్తూ, సేకరిస్తూ, పరిరక్షిస్తూ, అర్థం చేసుకుంటూ ప్రత్యక్షమైన కనిపించని వారసత్వాన్ని ప్రదర్శించే లాభాపేక్ష లేని శాశ్వత సంస్థను మ్యూజియం అంటారు.*

1946లో స్థాపించబడిన ఐకాం తన అంతర్జాతీయ ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రపంచ మేధో సంపత్తి సంస్థ, ఇంటర్పోల్, ప్రపంచ కస్టమ్స్ సంస్థ వంటి సంస్థలతో సంబంధాలున్నాయి. ఇందులో సాంస్కృతిక వస్తువులు, అక్రమ రవాణాపై పోరాటం, సహజ లేదా మానవ నిర్మిత విపత్తుల సందర్భంలో ప్రపంచ సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడం, ప్రమాద నిర్వహణ అత్యవసర సంసిద్ధతను ప్రోత్సహించడం లాంటివి ఉన్నాయి. ఐకాం సాంస్కృతిక మార్పిడి, అభివృద్ధిలో మ్యూజియంల పాత్రను ప్రోత్సహించడానికి ప్రపంచ వేదికగా పనిచేస్తుంది. ఇది మ్యూజియంలకు అంకితం చేయబడిన ఒక ప్రభుత్వేతర సంస్థ. యునెస్కోతో అధికారిక సంబంధాలను కొనసాగిస్తుంది. యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్తో సంప్రదింపుల హెూదాను కలిగి ఉంది.

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం ఐకాం ద్వారా స్థాపించబడింది. ప్రతి సంవత్సరం మే 18న దీనిని జరుపుకుంటారు. సమాజంలో మ్యూజియంల పాత్రను ప్రోత్సహించడానికి ఐకాం 1977లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. మ్యూజియంలు సమాజానికి ఎలా దోహదపడతాయనే దానిపై అవగాహన కల్పించడం, సాంస్కృతిక మార్పిడి, వైవిధ్యం, సమగ్రతను ప్రోత్సహించడం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకోవడం యొక్క ఉద్దేశ్యం. విద్య, ఆనందం, జ్ఞాన భాగస్వామ్యం కోసం నైతికంగా, వృత్తిపరంగా విభిన్న అనుభవాలను అందిస్తూ సమాజం భాగస్వామ్యంతో పనిచేస్తాయి. "సంస్కృతి మార్పిడికి, సంస్కృతుల సుసంపన్నతకు, ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం, శాంతిని పెంపొందించడానికి మ్యూజియంలు



ఒక ముఖ్యమైన సాధనం" అనే వాస్తవంపై అవగాహన పెంచడమే అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం లక్ష్యం.

ఈ సంవత్సరం థీమ్ "మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ – విద్య, పరిశోధనల కోసం మ్యూజియంలు". అంతర్జాతీయంగా మ్యూజియంలు ఎదుర్కొంటున్న సంబంధిత థీమ్ లేదా సమస్యను ప్రతిబింబించేలా ప్రతి సంవత్సరం మారుతున్న నిర్దిష్ట థీమ్ను ఈవెంట్ హైలైట్ చేస్తుంది. ఈ రోజున మ్యూజియం నిపుణులు ప్రజలను కలుసుకోవడానికి, మ్యూజియంలు ఎదుర్కొనే సవాళ్ల గురించి వారిని అప్రమత్తం చేయడానికి, సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు పోషించే పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది. మన గతాన్ని మనం తెలుసుకునేలా చేయడం ద్వారా మన సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు గణనీయమైన పాత్ర పోషిస్తాయనేది అందరికి తెలిసిన విషయమే. భారతదేశం ఈ కోణంలో దాదాపు 5000 సంవత్సరాల చరిత్రలో దాదాపుగా విడదీయని సాంస్కృతిక సంప్రదాయాన్ని కలిగి ఉండటం అదృష్టం. కోల్కతాలోని ఇండియన్ మ్యూజియం భారతదేశంలోని పురాతన మరియు అతిపెద్ద మ్యూజియం. ఇది 1814లో స్థాపించబడింది. ఇది భారతదేశంలోని పశ్చిమ బెంగాల్లో ఉంది. ఇది శిలాజాలు, ఆభరణాలు, పురాతన వస్తువులు, కవచం మరియు పెయింటింగ్ల సేకరణను కలిగి ఉంది. ఇది ఆర్ట్, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ, జియాలజీ, జువాలజీ మరియు ఎకనామిక్ బోటనీ అనే ఆరు విభాగాలను కలిగి ఉంటుంది. ఏప్రిల్ 20, 2024 నాటికి భారతదేశంలో మొత్తం 14201 మ్యూజియంలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్లో 32, తెలంగాణలో 36 మ్యూజియంలున్నాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని మ్యూజియంలు, జిల్లా స్థాయి మ్యూజియంలు, విశ్వవిద్యాలయాల పరిధిలోని మ్యూజియంలు అలాగే అనేక ప్రైవేట్ మ్యూజియంలు ఉన్నాయి. భారతదేశంలోని పశ్చిమ బెంగాల్లోని సెంట్రల్ కోల్కతాలో ఒక భారీ మ్యూజియం. స్వాతంత్ర్యానికి ముందు ఇంపీరియల్ మ్యూజియం ఆఫ్ కలకత్తా అని పిలిచేవారు. ఇది ప్రపంచంలోని తొమ్మిదవ పురాతన మ్యూజియం. అంతేకాక సేకరణ పరిమాణం ప్రకారం భారతదేశం, ఆసియాలో పురాతన అతిపెద్ద మ్యూజియం. సంస్కృతి మంత్రిత్వ శాఖ యొక్క ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి దేశంలోని మ్యూజియంల అభివృద్ధి, అప్గ్రేడేషన్. దేశంలోని మ్యూజియంలను బలోపేతం చేయడం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఒక ముఖ్యమైన కార్యకలాపం. నేషనల్ మ్యూజియం, న్యూఢిల్లీ, ఇండియన్ మ్యూజియం, విక్టోరియా మెమోరియల్ హాల్, కోల్కతా, సాలార్ జంగ్ మ్యూజియం, హైదరాబాద్, అలహాబాద్ మ్యూజియం, ఇందిరా గాంధీ రాష్ట్రీయ మానవ్ సంగ్రహాలయ్ భోపాల్, 3 నేషనల్ గ్యాలరీస్ ఆఫ్ మోడరన్ వంటివి భారతదేశంలోని కొన్ని ముఖ్యమైన మ్యూజియంలు. న్యూఢిల్లీ, ముంబై మరియు బెంగళూరులోనివి వివిధ హెూదాల్లో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నియంత్రణలో పనిచేస్తాయి.ఇవే కాకుండా, పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా దేశంలోని 44 ప్రదేశాలలో సైట్ మ్యూజియంలను కలిగి ఉంది.

మ్యూజియం నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం, ఈ మ్యూజియంల సేకరణలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా వాటిని అందుబాటులో ఉంచడం అనే జంట ఉద్దేశ్యంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తన ఆధ్వర్యంలోని మ్యూజియంల సేకరణల డిజిటలైజేషన్ యొక్క ప్రతిష్టాత్మక ప్రాజెక్టను ప్రారంభించింది. ఇంటర్నెట్ ద్వారా ఆన్లైన్ వీక్షణకు "జతన్" అనే సాఫ్ట్వేర్ను తయారుచేసింది. ఇండియన్ మ్యూజియం కోల్కతా విక్టోరియా మెమోరియల్ హాల్ కోల్కతా, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ న్యూఢిల్లీ, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ ముంబై, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ బెంగళూరు, అలహాబాద్ మ్యూజియం అలహాబాద్, సాలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్, నాగార్జునకొండ మ్యూజియం, గోవా మ్యూజియంలు ఉన్నాయి. పౌరులు డిజిటల్ రిపోజిటరీ ద్వారా సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు. మ్యూజియం గురించి వివరణ కళాఖండాల కాలక్రమం విజువలైజేషన్ ప్రదర్శనల వర్చువల్ గ్యాలరీకి మ్యూజియమ్స్ ఆఫ్ ఇండియా మొబైల్ యాప్ ఉంది.

**(మే 18 అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా...)**



**డీజే మోహన్రావు**
**అధ్యాపకులు, శ్రీకాకుళం**
**8247045230**

# కల్తీ విత్తనాలపై రైతులు జాగ్రత్త పడాలి

*వ్యవసాయానికి అనుగుణంగా, మే నెలలోనే తొలకరి చినుకులు పడటం వల్ల రాష్ట్రం లో రైతులు ఖరీఫ్ సీజన్ కాలానికి ముందస్తుగానే దున్నకాలు మొదలు పెట్టారు, ఈసారి కాలం ఎలాగూ ఉంటుందో తెలియదు, అయిన కూడా రైతులు ముందస్తూ చర్యలు మొదలు పెట్టారు. మన రాష్ట్రం లో వివిధ రకాల పంటలు, పండించడం జరుగుతుంది, అందులో ఆహార పంటలు, వాణిజ్య పంటలు ఎక్కువగా ఉండటం మనం చూస్తాం, ఒక్కో ప్రాంతం లో ఒక విధంగా పంటలు పండించడం జరుగుతుంది, అయితే పెద్ద మొత్తం లో రైతులు వివిధ రకాల నకిలీ మందులు వాడుతూ మోసపోతున్నారు. అది తెలంగాణ లో మరో ఎక్కువగా జరుగుతుంది.*

నకిలిని గుర్తించడం లేదు: ప్రధాన పంట అయిన ప్రత్తి, సాధారణంగా వర్షాధార పంట అది, ప్రత్తిని పెద్ద మొత్తం లో రైతులు పండిస్తారు, ఎందుకంటే అది వర్షాధార పంట కాబట్టి, ఎలాంటి నెలలో అయిన పంట వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి, ఇటీవల కాలంలో నకిలీ విత్తనాలు ఎక్కువ అయ్యాయి, మార్కెట్ లోకి ఎన్ని రకాలుగా అందుబాటులో ఉన్నాయి, కొత్త కంపెనీలు పుట్టుకొస్తున్నాయి, రైతులు కొత్తగా వచ్చిన వాటినే వాడుతూ ఉన్నారు, అందులో మంచిది ఎంటి కల్తీ ఎంటి అని గుర్తించలేని స్థితిలో ఉన్నారు, తీరా పంట వేశాక రైతుకి తెలియడం జరుగుతుంది, అందులో రైతులు కూడా పెద్దగా చదువుకోని వారు ఉండరు, కాబట్టి అగ్రికల్చర్ ఆఫీసర్ లు ముందస్తుగానే మార్కెట్ లో ఉన్న వాటిపై నజర్ పెట్టీ కల్తీ విత్తనాలు ఎరువులు గుర్తించి రైతులను ఆదుకోవాలి, పుట్టగొడుల పుట్టుకొస్తున్న ఫెర్టిలైజరు షాప్లకు లైసెన్స్ లు ఇవ్వడం పై వెయ్యాలి, కనీసం బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీ ఉంటే నే, షాప్ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలి, లేకుంటే కనీస అవగహన రాహిత్యం వల్ల మందుల అమ్మకం వల్ల రైతులు నష్ట పోతున్నారు అని చెప్పుకోవచ్చు,

గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా క్రిమి సంహారక మందులు వినియోగం పెరగడం జరుగుతుంది, పంట లాభం సంగతి దేవుడరుగు కానీ విత్తనాలకు ఎరువులకు క్రిమి సంహారక మందులుకి మాత్రమే ఉన్న డబ్బు అంతా పోయి పంట నష్టం వాటిల్లితే రైతు పూర్తి స్థాయిలో మగ్గి పొత్తు, కొంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు,

అతి ఎరువులు తగ్గించాలి: రోజూ రోజూ కి సేంద్రియ వ్యవసాయం తగ్గి, ఉత్పత్తి కోసం అధిక ఎరువుల వాడకం, ఆరోగ్యానికి మంచిదికాదు అని తెలుస్తుంది, ఇప్పుడు ఏ పంట వేసినా పిచికారి లేని పంట లేదు, అంతా మందులు వాడినా పంటలే ఎక్కువగా ఉన్నాయి, ఎందుకంటే మార్కెట్ లో పెద్ద మొత్తం లో రైతులకు అందుబాటులో ఉండటమే దీనికి కారణం గా చెప్పవచ్చు, ఎందుకు ఇలా ఉంది, కార్పోరేట్ కంపెనీల వల్ల ఉత్పత్తి కోసం అధిక ఎరువుల, క్రిమి సంహారక మందుల వాడకం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు అని చెప్పుకోవచ్చు, ఎందుకు సేంద్రియ పద్దతి నీ మనం కోల్పోతున్నాము, అటు ప్రభుత్వాలు సైతం రైతుల విషయం లో సబ్సిడీ కూడా పెంచే విధంగా చేయాలి, సేంద్రియ వ్యవసాయం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలి, ఇలా అడ్వాన్స్ ఎరువుల వాడకం వల్ల భూమి లో ఉన్న సారం శాతం తగ్గి ఏటా పంట తగ్గి మరియు భూమి కూడా దిగుబడికి దెబ్బ తింటుంది, అని చెప్పవచ్చు.

కౌలు రైతులకు సహాయం: ఇప్పుడు ఉన్న పరిస్థితి లలో ఎక్కువ మొత్తంలో లో రాష్ట్రం లి వ్యవసాయం ఎక్కువగా చేసేది కౌలు రైతులు మాత్రమే, కొన్ని ఎండ్ల నుండి కౌలు రైతులకు కన్నీళ్ళే మిగిలాయి, రైతూ బంధు అందదు, రైతూ బీమా అందదు, రైతులకు ఉచిత ఎరువులు సబ్సిడీ ఉండదు, పంట నష్టపరిహారం రాదు, తీరా నష్టం వచ్చిన కౌలు రైతుకు కి ఉచ్చు బిగుస్తోంది, అటూ ప్రభుత్వాలు కౌలు రైతులకు మద్దతు ధర ఇచ్చే విధంగా చూడాలి, కౌలు రైతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ పెట్టాలి, వారికి కూడా సహాయం అందే విధంగా చేయాలి, కాబట్టి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలని కోరుకుందాం..! నకిలీ విత్తనాలు ఎరువులు క్రిమి సంహారక మందులు తక్కువ మొత్తం లో వాడే విధంగా చేయాలి, లేకుంటే భవిష్యత్తు లో ప్రజలు ప్రమాదం లో పడే అవకాశం ఉంటుంది. జై హింద్



**-బి కిరణ్ ఫిషర్ అడ్వకేట్**
**నేషనల్ ఫోరం ఫర్ పీపుల్స్ ఎంపవర్మెంట్ అండ్ సోషల్ జస్టిస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**సెల్: 9133661793**

# కాసాని జ్ఞానేశ్వర్ విజయం తథ్యం

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి, మే 17(జనం సాక్షి) :**
పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో అఖండ విజయం సాధించబోతున్నారని, ఇందులో ఎలాంటి సందేహం లేదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ భరోసాను వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన కార్యకర్తల అభినందన సభలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీతో ఘన విజయం సాధించాలని, ఆయన గెలుపును కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు అవిశ్రాంతంగా కృషి చేశాయని, తప్పకుండా వారి కష్టానికి తగిన ఫలితం లభించి కాసాని అఖండ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కొండాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను అభినందించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అనంతరం మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్న నియోజకవర్గ ఓటర్లతో పాటు బిఆర్ఎస్ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన స్వల్ప కాలంలోనే పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పటికీ తనకు అఖండ మెజార్టీ అందించటమే కాకుండా చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు తామే అభ్యర్థిలా భావించి అలుపెరగకుండా శ్రమించారని గాంధీ పేర్కొన్నారు. రాజకీయ పరంగా ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నా నిజమైన నిఖార్సయిన గులాబీ శ్రేణులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రజా క్షేత్రంలో నిలబడి నిర్విరామంగా కృషి చేసారన్నారు. పదేండ్ల కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లటంలో, ఓటర్లను చైతన్య పరచటంలో పార్టీ కృషి స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే వివరించారు. కార్యకర్తలే ఎప్పటికయినా పార్టీకి బలమని, బలగమని గులాబీ సైనికులు ఈ ఎన్నికల ద్వారా మరోసారి నిరూపించారని ఈ సందర్భంగా నియోజకవర్గ, డివిజన్, కాలనీ, బూత్ స్థాయి నేతలు, మహిళా కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు ఎన్నికలలోనూ ఇదే స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్ పటేల్, కరీం, సాంబయ్య, పూర్ణ, అమీనుద్దీన్, అహ్మద్, హర్షద్, జాఫర్, చారి, సాహిల్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

## కార్పొరేటర్ రంగా నరసింహ గుప్త

**ఎల్బీనగర్, మే17(జనం సాక్షి)**
ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రంగా నరసింహ గుప్త అన్నారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని మూసికి అనుకోని వున్న ప్రాంతం ల్లో కొందరు కబ్జా కోరులు జేసీబీల ద్వారా మెయిన్ పైప్ లైన్స్ తీసి వేసి వరద నీరు పోకుండా అడ్డు పడడంతో విషయం తెలుసుకొని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా హుటాహుటిన జిహెచ్ఎంసి అధికారులను వెంటబెట్టుకొని సంఘటన స్థలానికి వెళ్లి చర్యలు తీస్కోవలసినదిగా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చుడాలని కోరినారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈఈ శ్రీనివాస్, ఎఈ పార్వతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కిష్టయ్య, శానిటేషన్ ఆఫీసర్ రత్న సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



## ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు మే 17 (జనం సాక్షి)**
విద్యార్థులు ఉన్నత చదువుల్లో మరింత ప్రతిభ రాణించి జీవితంలో లక్ష్యాలను సాధించాలని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి పదవతరగతి మరియూ ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు స్థానిక ఆర్బిఓఎల్ సంస్థ తరపున సన్మాన కార్యక్రమం బుయ్యని సరళ,శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చదువులో ఉత్తమకనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియజక వర్గం లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను అభినందించారు .విద్యార్థులులను ప్రత్సహిత్సేనే చక్కటి ప్రతిబను కనబరుస్తారని తెలిపారు. నేటి సమాజంలో విద్యకు ఉన్నతవిలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమపిల్లపై శ్రద్దవహించి చదివించాలన్నారు. మొక్కయిన వంగనిది మానైన వంగునా అన్నారు.విద్యార్థులు ఉన్నత చదువుల్లో మరింత ప్రతిభ రాణించి జీవితంలో లక్ష్యాలను సాధించి స్థిరపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

# రానున్న రోజులలో శేరిలింగంపల్లి అభివృద్ధికై భాజపా పాత్ర కీలకం

## మాజీ ఎమ్మెల్యే ఎం బిక్షపతి యాదవ్



**శేరిలింగంపల్లి, మే 17 (జనం సాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ పాత్ర కీలకం కానుందని, ప్రజలంతా తప్పకుండా భాజపాను ఆదరించాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నేత మారబోయిన బిక్షపతి యాదవ్ అన్నారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ బిజెపి కంటెస్టెడ్ మెంబర్ రవి కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం దీప్తి శ్రీనగర్ షిరిడి సాయి వృద్ధాశ్రమంలో బిజెపి శ్రేణులు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేకును కట్ చేసిరవికుమార్ యాదవ్‌కు తినిపించారు. అనంతరం శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య మరోమారు రవికుమార్ యాదవ్ జన్మదిన కేకును కట్ చేయడం, కార్యకర్తలకు పంచి పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా ఆయనకు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ భాజపా ప్రభుత్వమే ఏర్పాటు కానుందని, చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి వారి మెజార్టీతో గెలవబోతున్నట్లు బిక్షపతి యాదవ్ ధీమాను వ్యక్తం చేశారు. అనంతరం రవికుమార్ యాదవ్ తో కలిసి మాట్లాడుతూ దేశభద్రత, సార్వభౌమత్వం, దేశాభ్యున్నతిని కాంక్షించేది భారతీయ జనతా పార్టీ ఒక్కటేనని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరగబోయే అభివృద్ధి మొత్తం భాజాపాతోనే సాధ్యపడుతుందని వారు పునరుద్ఘాటించారు. అవకాశవాద పార్టీలను, కుటుంబ పార్టీలలో ఆదరించడం ద్వారా కూర్చున్న కొమ్మను నరుక్కోవద్దని, ఏరి కోరి అభివృద్ధికి అడ్డం పడవద్దని బిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, ఎల్లేష్, రమేష్ రాజేష్ గౌడ్, అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్, శ్రీధర్ గౌడ్ బాబు, శివ, నరసింహ, విజయలక్ష్మి, జ్యోతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజ్గిరిలో ఎగిరేది బిజెపి జెండానే

**కాప్రా, మే 17 (జనం సాక్షి)**
భారతీయ జనతా పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్‌ను శుక్రవారం షామీర్పేటలోని ఆయన నివాసంలో ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నాదం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల సరళీనీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చర్లపల్లి డివిజన్ బిజెపి నాయకులు మాట్లాడుతూ.. మల్కాజ్గిరిలో ఎగిరేది బిజెపి జెండానే.. గెలిచేది ఈటెల రాజేందర్ అని అన్నారు. బిజెపి పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పదికి పైగా స్థానాలు గెలవబోతున్నామన్నారు. అదేవిధంగా కేంద్రంలో మూడవసారి నరేంద్ర మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెల్లా ప్రభాకర్, కాసుల సురేందర్ గౌడ్, కొమ్ము నర్సింగ్, లక్ష్మణ్ గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, సహదేవ్ గౌడ్, నవీన్, గణేష్ గౌడ్, నాగమణి, శ్రీకాంత్, అనిల్, భరత్, జనార్ధన్, రాజేష్ వంశరాజ్, రాము, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కుల మత రహిత సమాజమే వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశయం



## కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి

**మహేశ్వరం, మే 17 (జనం సాక్షి)**
కాలజ్ఞాన సృష్టికర్తగా తత్వవేత్తగా సంఘ సంస్కర్తగా కుల రహితసమాజం రానున్న కాలంలో వస్తుందని రచనలతో చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని మీర్పేట్ కార్పొరేటర్ విశ్వబ్రాహ్మణ నాయకులు పసునూరి బిక్షపతి చారి కొనియాడారు. శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాధన కార్యక్రమం రంగారెడ్డి జిల్లా బడంగ్పేట్ కార్పొరేషన్ శివనారాయణ కమిటీ హాల్లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు కలకొండ శ్రీనివాస చారి, నారాయణదాసు సతీష్ చారి, వారి బృందం ఆధ్వర్యంలో ఘనంగా ఆరాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిక్షపతి చారి ప్రసంగిస్తూ 17వ శతాబ్దం దక్షిణ భారతదేశంలో మూఢాచారాలపై అంద విశ్వాసాలపై వర్ణవ్యవస్థను కులమత వైశ్యామ్యాలపై అంటరానితనంపై బలహీన వర్గాలకు విద్య అవకాశాల అంశాలపై తన జీవిత కాలమంతా ప్రజలలో చైతన్యం రగిలించాడని సమాజంలోని మూఢ విశ్వాసాలను ఖండిస్తూ అజ్ఞానంలో మగ్గిపోతున్న మానవాళికి జ్ఞానోదయాన్ని కలిగించిన క్రాంతి దర్శి కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చైతన్య మూర్తి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అని అన్నారు. ఆయన రచనలు దేశవ్యాప్తంగా ఈనాటి సమాజానికి అందించాలని దేశవ్యాప్తంగా బ్రహ్మం విగ్రహాలను ఏర్పాటు చేయాలని బ్రహ్మం పేరుతో విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని బ్రహ్మంగారి ఆరాధన దినోత్సవం నాడు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్ చారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాసచారి, మీర్పేట్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి,రాష్ట్ర నాయకులు సుంకోజు రమేష్, రవీంద్ర చారి,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మచారి. కోశాధికారి లెంకలపల్లి యాదగిరి చారి. నా రోజు సత్యం చారి, కుమార్ చారి, నైనా చారి, ఆంజనేయులు చారి,శివకుమార్ చారి, పంతులు వెంకటా చారి, విశ్వబ్రాహ్మణ కుల బంధువులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బోడుప్పల్ నగర మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 17 (జనం సాక్షి)**
బోడుప్పల్ నగర మేయర్ డిప్యూటీ మేయర్ లపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పోరేటర్ పోగుల నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానంపై కార్పోరేటర్ల నోటీసు అందజేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో.. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొందరు కాంగ్రెస్ పార్టీ లో చేరికతో, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పోరేటర్ పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 21 మంది కార్పొరేటర్ల బృందం, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసులు అందజేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.



# మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, మే 17 (జనం సాక్షి)**
అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహేశ్వరం నియోజకవర్గము శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం తన మొక్కును తీర్చుకొని 21 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి దేవాలయం చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా ఇంద్రారెడ్డికి ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దేవాలయం పరిధిలోని అన్నప్రసాదశాలను, నిత్య అన్నదాన సత్రం ను కలియ తిరిగి పర్యవేక్షించారు. అనంతరం చంద్రశేఖర్ గుప్తా సబితా ఇంద్రారెడ్డికి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంథ్ గుప్త, ఆర్కే పురం డివిజన్ బి ఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

# అరుణమ్మ గెలుపు పక్కా

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
పాలమూరు పార్లమెంటు ఎన్నికలో బిజెపి అభ్యర్థి డి కే అరుణమ్మ గెలుపు పక్కా బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.అరుణ మ్మకు ఓట్లు వేసిన అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరు పార్లమెంటు పరిధిలో నారాయణపేట జిల్లాలో పార్టీలకతీతంగా యువకులు మహిళలు రైతులు వృద్ధులు ఏక మొత్తంగా మోడీ నినాదాలు అయినా అబ్ కీ బార్ చార్ సౌ పార్ ఔర్ ఏక్ బార్ మోడీ సర్కార్ లకూ మద్దతుగా నిలిచి ఓట్ల జాతరను నడిపించార చేశారని అన్నారు. అనూహ్యమైన మెజార్టీతో అరుణమ్మను గెలిపించబోతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి డీకే అరుణమ్మకు మద్దతుగా నిలిచిన నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మహర్దశ

## మండల విద్యాధికారి అంజయ్య



**సదాశివపేట మే 17 (జనం సాక్షి)**
సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఈరోజు శుక్రవారం నాడు సదాశివపేట మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సదాశివపేట, వెంకటాపూర్ ఉన్నత పాఠశాల, వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలను, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను, మనఊరు-మనబడి పనులు పరిశీలించారని మండల విద్యాధికారి డి.అంజయ్య తెలిపారు. సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2కోట్ల 15 లక్షల 41 వేలతో 12తరగతి గదులు, డైనింగ్ హాల్, బాలబాలికలకు మరుగుదొడ్లు సంవత్సరమైనది. విద్యుత్, పెయింటింగ్ లేకపోవడం వలన నిరుపయోగంగా ఉంది. ఈ విషయాన్ని మండల విద్యాధికారి డి.అంజయ్య జిల్లా విద్యాధికారులకు తెలిపి, జిల్లా కలెక్టర్ గారి రివ్యూ మీటింగ్ లో తెలపడం, కలెక్టర్ వెంటనే స్పందించి మిగిలిన పనులు పూర్తిచేసి పాఠశాలలు జూన్12 ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించడం జరిగింది. జిల్లా అడిషనల్ కలెక్టర్ పాఠశాలను పరిశీలించి రేపటి నుండి పనులు ప్రారంభించాలని జిల్లా అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ పాఠశాల పూర్తయితే ఆ పాఠశాలలో చదివే 400 మంది విద్యార్థులకు చక్కగా చదువుకునే అవకాశం ఉంది. మరో 200 మంది విద్యార్థులు అదరనంగా అడ్మిషన్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు డి.ఇ.రాంకుమార్, మండల విద్యాధికారి డి.అంజయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఎ.ఇ ప్రవీణ్ రెడ్డి, సిఆర్పి రాజేశ్వర్ పాల్గొన్నారు.

# శ్రీకాంత్ యాదవ్ మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలి

## జిల్లా అదనపు ఎస్పీకి ఫిర్యాదు



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
మహబూబ్ నగర్ జిల్లా అడ్డకల్ మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ యాదవ్ ఈనెల 14న శ్రీ మల్లిఖార్జున వైన్స్ యాజమాన్యం, సిబ్బంది దాడిలో మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. వైన్స్ యాజమాన్యంపై 302 సెక్షన్ ప్రకారం మర్డర్ కేసు నమోదుచేయడం జరిగిందని, కానీ మూడు రోజులు కావస్తున్నా పోలీసులు శ్రీ మల్లిఖార్జున వైన్స్ బండమీధిపల్లికి చెందిన అరుణ్ కుమార్ రెడ్డి, కృష్ణ రెడ్డి, బబ్లు, వెంకటేష్, శివ శంకర్ మరియు వారి అనుచరులు దాడిచేసి చంపిన కూడా ఇంకా అరెస్ట్ చేయలేదని, అందుకుగాను మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కుల సంఘాల నాయకులు, పార్టీల నాయకులు శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ రాములుకు నిందుతులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల యాదవ సంఘం మండల అధ్యక్షులు భీమన్న యాదవ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణు యాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, యాదవ సంఘం యువజన అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, యాదయ్య సాగర్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, బాలకృష్ణ, రాజకుమార్ రాజకుమార్, సురేష్, రాఘవేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేయాలి

## జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లో పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతులు, మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు తనిఖీ చేశారు. జడ్చర్ల మండలం గంగా పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిడ్జిల్ మండలం వసుపుల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జరుగుతున్న ఎలక్ట్రిషన్, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో వాటర్ సంప్ పనులు కూడా మొదలు పెట్టాలని, పనులు వేగవంతం చేసి పాఠశాలలు ప్రారంభంకు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్, ఆయా మండలంల ఎంఈఓలు, ఎంపిడిఓలు, ప్రదానో పాధ్యాయులు ఉన్నారు .

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి బ్యూరో మే17 (జనం సాక్షి)**

పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో అమ్మ ఆదర్శ పాటశాల, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, ధరణి, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, వరి కొనుగోలు, సియంఆర్. ధాన్యం అప్పగింత పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో 537 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 183 పాఠశాలలు మన ఊరు మనబడి కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా 317 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పనులు గుర్తించి




మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన నడుస్తున్నాయని తెలిపారు. పాఠశాలకు అవసరమైన విద్యుత్, తాగు నీరు, మరుగు దొడ్లు, ఇతర మరమ్మతు పనులు గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలకు పునఃప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చేందుకు గాను ఇప్పటికే అవసరమైన మేరకు బట్ట రావడం జరిగిందని, ఇతర మెటీరియల్ తెప్పించి మహిళా సంఘాల ద్వారా కుట్టించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని 42681 విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించడం జరుగుతుందన్నారు. ఇందులో 22393 మంది అమ్మాయిలు, 20288 అబ్బాయిలు ఉన్నట్లు తెలిపారు. ఏకరూప దుస్తులు పాటశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు అందించే విధంగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవడం జరిగిందన్నారు. వరి కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, రైతులు పండించిన ధాన్యం వర్షాలకు తడిచి నష్టపోకుండా ఎప్పటికప్పుడు సేకరించిన ధాన్యాన్ని తరలించేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మిల్లర్ల ద్వారా సియంఆర్ ధాన్యం అప్పగింతపై పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల పటిష్ట భద్రత

- రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి ప్రతినిధి, మే 17 (జనం సాక్షి)**



స్ట్రాంగ్ రూమ్స్ వద్ద కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ బలగాలు మరియు జిల్లా సివిల్ పోలీసులతో మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. శుక్రవారం గీతం యునివర్సిటీ స్ట్రాంగ్ రూమ్స్‌ను రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ..స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్లు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7-అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగించుకొని, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎం లను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించడం జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు వరకు గీతం యునివర్సిటీ స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాలన్నీ సిసి కెమెరా నిఘా నీడలో ఉంటాయని, అనుమతి లేనిది ఎవ్వరిని లోపలికి అనుమతించరన్నారు. లోకల్ డియస్పిలు 24 గంటలు అందుబాటులో వుంటూ అనుక్షణం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్పీ వివరించారు. అనంతరం రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, ట్రైనీ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి ట్రైనీ ఐపీఎస్ కాజల్ సింగ్, పటాన్ చెర్వు డియస్పి రవీందర్ రెడ్డి, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



## తడి పొడి చెత్తను వేరుగా డంప్ చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాయాంకుమిత్తల్ అన్నారు. శుక్రవా రం ఊట్కూరు మండలం కృష్ణాపురం, చిన్నపొర్ల గ్రామపంచాయతీ పరిధిలో నర్సరిని, సెగ్రిగేషన్ షేడ్ తనిఖీ చేశారు.అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను తనిఖీ చేశారు. అలాగే ధన్వాడ మండలం కొండారెడ్డి పల్లె గ్రామపంచాయతీ పరిధి అమ్మ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి పనులు పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ తనిఖీ చేసి అడిగి తెలుసుకున్నారు.

# లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమీదే గెలుపు

### రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో మే17(జనం సాక్షి)**

దేశ వ్యాప్తంగా జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమీ విజయం సాధిస్తుందని, ఎన్డీయే కూటమీకి ఓటమి ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయిబరేలి నుంచి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. యువనేత రాహుల్ గాంధే దేశ ప్రధాని అవుతారని రాయబరిలో ప్రచారం చేస్తున్న తమకు స్థానికులు బ్రహ్మరథం పడుతున్నారని వెల్లడించారు. ఇప్పటికే బ్యాంకుల, విమానాశ్రయాలను, విద్యా వ్యవస్థలను ప్రైవేట్ పరం చేశారని రేపు అధికారంలోకి వస్తే అంతా ప్రైవేటుపరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.అదే విధంగా రైతాంగ వ్యవసాయ రుణాలు ఇవ్వకుండా గాలికి వదిలేశారని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో విప్లవాత్మకంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించగలదని దేశ ప్రజలు విశ్వ సిస్తున్నారని ఆయన తెలిపారు. అంతే కాకుండా ఈదేశ ప్రజల మనోభావాలకు, ఆ కాంక్షలకు అనుకూలంగా కాంగ్రెస్ పాలన కొనసాగు తుందన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి భారీ మెజారిటీతో గెలుపొందుతారని,అదే ఉత్సాహంతో రాహుల్ గాంధీ గెలుపు కోసం రాయిబరేలి వచ్చామని ఆయన తెలిపారు. ఈ ప్రచారంలో నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, గద్వాల జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్యలు పాల్గొన్నారు.



## లక్ష లక్ష్యం ప్రతి కార్మికుడు సాధించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

ఆర్టీసిలో రోజు లక్ష లక్ష్యం సాధించేందుకు ప్రతి కార్మికుడు కృషి చేయాలని నారాయణపేట డిఎం.సుధా అన్నారు. నారాయణ పేట, కోస్గి డిపోలలో శుక్రవారం డిఎం ఆధ్వర్యంలో డిపో సిబ్బందికి మే 14న గ్రాండ్ ఎలక్షన్ ఛాలెంజ్‌లో కార్పొరేషన్ అత్యధిక ఆదాయాన్ని సాధించినందుకు ఎండి ఆదేశానుసారం సిబ్బందికి స్వీట్లు పంచారు.డిపో లక్షే లక్ష్యం లక్ష్యాలను సాధించడంపై విసి, ఎండిలకు శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పాల్గొన్నారు.



# యువతే దేశానికి సంపద

### కేఎస్ పీపీ పట్టాల ప్రదానోత్సవంలో జస్టిస్ ఏకే.మిశ్రా

**పటాన్చెరు మే17(జనం సాక్షి)**

యువతే దేశానికి సంపదని, వారు దేశ సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అన్నారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తన రెండో పట్టాల ప్రదానోత్సవ (గ్రాడ్యుయేషన్‌డే) వేడుకను శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెరా సెమినార్ హాలులో ఘనంగా జరుపుకుంది. సంప్రదాయ ఆకడమిక్ ప్రొసెషన్లో ప్రారంభమైన ఈ వేడుక జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. పబ్లిక్ పాలసీ భవిష్యత్తును రూపొందించడంలో వారి పాత్ర, ప్రాముఖ్యతలను నొక్కి చెప్పారు. గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ తన అధ్యక్షేసన్యానంలో పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కౌటిల్యా డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ ముఖ్య అతిథిని పరిచయం చేశారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్. రావు కేఎస్ పీపీ విద్యార్థి అర్చన గుప్తాకు ప్రతిజ్ఞను అందజేయగా, ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథి నుంచి పట్టాను అందుకున్న వారి పేర్లను కేఎస్ పీపీ డీన్. ప్రకటించారు. కాగా, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ అధికారిక ధ్రువీకరణలపై ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సంతకం తీసుకున్నారు.



# 500 బోనస్ ఇచ్చేంతవరకు ఉద్యమిస్తాం

### రాష్ట్ర మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

**తూప్రాన్ మే 17 (జనం సాక్ష):**

అకాల వర్షానికి తెలిపిన వడ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందేనని దొడ్డు వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చేంతవరకు రైతుల తరఫున ఉద్యమం చేస్తూనే ఉంటామని రాష్ట్ర మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మనోహర్ మండలంలోని దండుపల్లి చౌరస్తా వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అకాల వర్షాలతో తడిసిన ప్రతి గింజను గిట్టుబాటు ధరతో కల్పిస్తూ కొనుగోలు చేయాలని మరియు అదే విధంగా సన్న వడ్లకు దొడ్డు వడ్లకు ప్రతి క్వింటాలకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తూ రైతుల నడ్డి విరిచే ప్రయత్నాన్ని చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు గిట్టుబాటు ధరలను కల్పిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని దానితోపాటు ప్రత్యేక ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి 500 బోనస్‌ను ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ దానిని బోగస్ వాగ్దానంగా మార్చి తప్పించుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రాష్ట్రాన్ని పాడి పంటలతో ఆకుపచ్చ తెలంగాణగా మార్చిన ఘనత కేసిఆర్‌ది అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాంటి ఉద్యమం జరిగిందో మళ్లీ ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించడం జరుగుతుందన్నారు. కేసీఆర్‌కి ఉద్యమాలు పోరాటాలు కొత్తవి కావన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురం రవి, ఆంజనేయులు గౌడ్ వెంకట్ గౌడ్, బిక్షపతి, సతీష్ చారి, రాజిరెడ్డి, నరసింహారెడ్డి, రతన్లాల్ తదితరులు పాల్గొన్నారు.






## ధిక్కార కవితా సంపుటిని ఆవిష్కరించిన మాజీ మంత్రి సింగిరెడ్డి

**వనపర్తి బ్యూరో మే17 (జనం సాక్షి)**

కవి వనపట్ల సుబ్బయ్య,సంగిశెట్టి.శ్రీనివాస్ రచించిన మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తిదాయక కవితా సంపుటిని తన స్వగృహంలో మాజీ మంత్రి సింగిరెడ్డి, నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మహానుభావుల చరిత్ర,వారు అనుసరించిన స్ఫూర్తిదాయక విధానాలు వెలుగులోకి తెస్తూ నేటి ప్రజలకు నైతికవిలువలు అందిస్తున్న వనపట్ల శ్రీనివాస్ అభినందనీయులని అన్నారు. స్వతహాగా తాను పుస్తక పఠనం అలవాటుగా ఉన్నవాని అని పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు పదిమందికి ఆదర్శంగా నిలిచే నిర్ణయాలు తీసుకోవడానికి దోహద పడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సమాజ విశ్లేషకులు టెలిఫోన్ బలరాం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కుమార్, సురేందర్, చిట్యాల రాము గోపాల్ నాయక్ నరసింహ, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్‌ల బందోబస్తును తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పాలమూరు యూనివర్సిటీలో ఈవీఎం లను భద్రపరచిన స్టాంగ్రూమ్ ల బందోబస్తును శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు ఎప్పటికప్పుడు 24/7 మూడంచెల భద్రతా నిఘా పెట్టాలని అలాగే సిసి కెమెరా అబ్జర్వేషన్ సక్రమంగా వుండేలా చూసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షలకు హాజరుకానున్న 10,304 మంది విద్యార్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి డిఆర్ఓ, కెవివి.రవికుమార్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



ఈనెల 24 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) కెవివి రవి కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్ పరీక్షల వివరాలు తెలియజేసారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 6585 మంది, ఇంటర్ రెండవ సంవత్సరం 3719 మంది విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 10,304 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ప్రథమ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయానికి విద్యార్థినీ, విద్యార్థులు అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక నిమిషం ఆలస్యం అయిన పరీక్ష కేంద్రానికి అనుమతి ఉండదని తెలిపారు. గ్రామాల నుంచి విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేసుకోవడానికి వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఉదయం 7:00 గం.లకు అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్అమలు చేయాలని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టిక్కెట్ లలో ఏదైనా సమస్య ఉంటే విద్యార్థులకు సహకరించేందుకు తగు సూచనలు చేయాలని ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో త్రాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, వైద్య అధికారులు సిబ్బందిని నియమించి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్. ప్యాకెట్లు, అందుబాటులో ఉంచాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఉమా మహేశ్వర్, రవీందర్, పోలీసు శాఖ, విద్యుత్, ఆర్టీసీ, వైద్యం, మున్సిపల్ శాఖ తదితర అధికారులు కార్యాలయ సిబ్బంది సందీప్, సాధిక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రం ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మిడ్జిల్ మండలం రాణి పేట గ్రామంలో ఏర్పాటు చేసిన పి.ఏ.సి.ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణా, ట్యాబ్ ఎంట్రీ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పా లిన్‌లతో కవర్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా టోకెన్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, అదే రోజు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేసి, ట్రక్ షీట్ జనరేట్ చేసి మూడు రోజుల్లో రైతులకు చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పరిధి దాటి వైద్యం చేసిన అర్ఎంపి క్లినిక్ సీజ్

- బోర్డుపై ఆయన పేరుకు ముందు డాక్టర్ అని రాసుకున్నందుకు ఆర్ఎంపీకి నోటీసులు
- జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ తిరుపతిరావు

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కృష్ణ ఆదేశాల మేరకు భూత్పూరు మండలంలోని పలు గ్రామాలలో ఆర్ఎంపిలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ తిరుపతి రావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ లు నిర్వహించారు. ఈ తనిఖీలలో సంతోష్ (అమ్మ క్లినిక్)నాలుగు బెడ్స్ నిర్వహిస్తూ పేషంట్లకి సలైన్స్ బాటిల్ ఎక్కించడం పరిశీలించారు. ఈ కారణంగా క్లినిక్ ను సీజ్ చేసినట్లు, అలాగే రెండు క్లినిక్‌లలో వారి పేరు ముందు డాక్టర్ అని రాసుకోవడం వలన వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం ఆర్ఎంపిలు ప్రథమ చికిత్సను అందిస్తూ పేషెంట్లకు సరియైన సలహాలు సూచనలు చేస్తూ హయ్యర్ సెంటర్లకి రెఫర్ చేయాలని, అలా కాకుండా కొందరు వారే డాక్టర్ లాగా ఊహించుకొని సొంతంగా ఎక్కువ డోసు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, సలైన్స్ ఎక్కించడం, బెడ్స్ పెట్టుకోవడం బోర్డులపై డాక్టర్లమని రాసుకోవడం జరుగుతొందని, ఇలా చేయడం వలన కొన్నిసార్లు ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. దీని కారణంగా తెలంగాణ ప్రభుత్వం స్థాయికి మించి వైద్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలలో ఈ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ అయూబ్ ఖాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్, పోలీస్ కానిస్టేబుల్ ఎస్ రవీందర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

# ఇంటి నుంచి అసెంబ్లీ

## పరకాల కాళికాంబ



కూడా అంటారు. అంతేకాదు, భగవంతుడి ప్రస్తావన వచ్చినప్పుడు మనిషి తప్పొప్పుల పట్ల, దైవభీతి పట్ల, మొత్తంగా మానవ ప్రవృత్తి పట్ల కూడా వారి మీమాంస ఎంతో ఉదాత్తంగా ఉంటుంది. తాత్వికత ధ్వనిస్తుంది. అంతేకాదు, ఈ రచనలో ఆమె రెండు మూడు ఎమ్మెల్యే క్వార్టర్ల గురించి, అక్కడి వసతులు సరిగ్గా లేకపోవడం గురించి కూడా చెబుతారు. నీళ్ళ ఇబ్బందుల గురించి కూడా రాస్తారు. ఒక స్త్రీగా మాత్రమే చూడగల విషయాలు ఇలా చాలా ఉన్నాయి. అదే సమయంలో చెన్నారెడ్డి, అంజయ్య, పి.వి.నరసింహరావు వంటి కాంగ్రెస్ నేతలు, వారి ప్రవర్తనలు, రాజకీయాల పట్ల తన అభిప్రాయాలు కూడా సున్నితంగా ఉంటాయి.

నిజానికి ప్రతి వ్యక్తీ వ్యక్తమైతే ముఖ్యంగా స్త్రీలు లేదా ఒక తల్లి తన కథ గనుక తాను చెబితే కల్పిత సాహిత్యం కళ తప్పిపోతుంది. చరిత్రగా మనం చదివిన గాథ ఎంత అర్ధ సత్యమో కూడా అవగతమవుతుంది. కాళికాంబ గారి జీవితం చదివితే ఈ మాటలు చెప్పబుద్ధి అవుతోంది. చివరగా, భర్త మరణానంతరం ఎన్నికల్లో నిలబడి వారు గెలుస్తారు. ఆ తర్వాత కూడా ఎన్నికల్లో నిలబడాల్సి వచ్చినప్పుడు ఆమె రాజకీయాల కన్నా కుటుంబానికి ప్రాధాన్యమిస్తారు. పిల్లల కోసం రాజకీయాలకు దూరంగా ఉండాలన్న నిర్ణయం తీసుకుంటారు. హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారికి ఆ నిర్ణయం చెబుతారు కూడా. కానీ 'మీరు తప్పకుండా నిలబడాలి' అని వారంటారు. అక్కడితో పుస్తకం ముగుస్తుంది. ఇప్పుడు అర్థమవుతోంది, ప్రభాకర్ గారు తాను ప్రచురించడాన్ని ఆలస్యం చేయడం 'పాపం' అని ఎందుకు అన్నారో! బహుశా తల్లి రాసిన వెంటనే గనుక ఆ పుస్తకం తెచ్చి ఉంటే ఆమె జ్ఞాపక శక్తి బాగున్నప్పుడే చూసుకొని మురిసిపోయేవారేమో! ఆ ఉత్సాహంతో రెండవ భాగం కూడా రాసి ఉండేవారేమో! అందులో మరింత విశాల జీవితం వ్యక్తం చేయగలిగి ఉండేవారు!

చివరగా ఒక మాట. ఈ పుస్తకానికి 'నా జీవితం కొన్ని జ్ఞాపకాలు, ఘట్టాలు' అన్న శీర్షిక కాళికాంబ గారు రఫ్‌గా పెట్టి ఉంటారు. ప్రచురణకర్తలు దాన్నే పుస్తకం పేరుగా కాకుండా మరొక మంచి శీర్షిక పెట్టి ఉంటే, అట్ట వెనుక పుస్తకం గురించి కూడా కొన్ని మాటలు ప్రచురించి ఉంటే బాగుండేది. పుస్తకం పాఠకులను ఇంకా బాగా ఆకర్షించేది. ఇప్పుడు 'పరకాల కాళికాంబ' పేరు చూసి, ఆ ఇంటిపేరును గుర్తుపట్టిన వారే చదివేలా ఉంది. మలి ముద్రణలో ఆలోచిస్తారని ఈ సూచన. అందుకోసమే ఇంత వివరమైన పరిచయం. కృతజ్ఞతలు.

# మహిళా రైతుల హక్కుల వేదిక




కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ చట్టాలు మహిళా రైతుల ప్రయోజనాలకు హాని కలిగిస్తాయి. ప్రభుత్వం వాటిని రద్దు చేయాలి, రాష్ట్రపతి తిరస్కరించాలి.

ఎపిఎంసి చట్టం, కాంట్రాక్ట్ వ్యవసాయ చట్టం, నిత్యావసర సరుకుల సవరణ చట్టం అనే ఈ మూడు చట్టాలు భారతదేశ వ్యవసాయ రంగంలో చిన్న, సన్న కారు రైతులు, కౌలు రైతులలో అత్యధిక శాతంగా ఉన్న మహిళా రైతులపై హానికరమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. ఇప్పటికే రైతులుగా గుర్తింపు లేక, భూమి, నీరు, అడవులు వంటి వనరులపై సమాన హక్కులు లేక, సాగుకు అవసరమైన రుణాలు, సబ్సిడీలు, బడ్జెట్‌లు మార్కెట్ సౌకర్యాలు వంటి మద్దతు వ్యవస్థలు అందుబాటులో లేక ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటున్న మహిళా రైతులకు ఈ చట్టాలు మరింత నష్టాన్ని కలిగిస్తాయి. సాగుదారులుగా మహిళా రైతులు నష్టపోవడంతో పాటు మార్కెట్ ధరల అస్థిరత్వం కారణంగా వ్యవసాయ కూలీలుగా అధిక సంఖ్యలో ఉన్న మహిళల వేతనాలపై కూడా పరోక్ష ప్రభావం పడుతుంది. దాంతోపాటు ఈ చట్టాలు అటవీ ప్రాంతాలలో సహజ వనరులు, ఆహార సార్వభౌమత్వం, జీవ వైవిధ్యంపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయి.

వ్యవసాయ సంక్షోభం తీవ్రతరంగా ఉన్న సందర్భంలో ఆ భారాన్ని అందరికంటే ఎక్కువగా మోస్తున్న మహిళా రైతులపై ఈ చట్టాలు తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తాయి. ఇంతకు ముందటి కంటే మరింత ఎక్కువగా ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు అండగా ఉండి ఉపశమనం కలిగించాల్సిన సమయంలో ఈ మూడు చట్టాలను తీసుకొచ్చి తన బాధ్యత నుండి పక్కకు తప్పుకుంటోంది. ఈ చట్టాలు రైతులను సంక్షోభం నుండి బయట పడవేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోగా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. వ్యవసాయ మార్కెట్ యార్డులను నిర్వీర్యం చేసే మొదటి చట్టం రైతులు ఎక్కడికైనా తమ ఉత్పత్తులను తీసుకెళ్ళి అమ్ముకునే స్వేచ్ఛ కల్పిస్తుందని చెబుతున్నారు. కానీ రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు పెద్ద వ్యాపారస్థులతో పోటీ పడి దూరప్రాంతాలకు వెళ్ళి అమ్ముకునే పరిస్థితి లేదు. మహిళా రైతులు మార్కెట్ యార్డుల బయట ఎక్కువగా చిన్న వ్యాపారస్థులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డులు, కనీస మద్దతు ధర ఉన్నప్పుడు, మార్కెట్ బయట కొనుగోలు చేసే చిన్న వ్యాపారస్థులకు కూడా కనీస మద్దతు ధర ఒక కొలమానంగా ఉంటుంది. మార్కెట్ యార్డులు లేనప్పుడు వ్యాపారస్తులే ధరలు నిర్ణయించే పరిస్థితి ఏర్పడి మహిళా రైతులు

రేపటి సంచికలో

# స్త్రీలు స్వయంపోషకులు కావాలి



మాది కృష్ణాజిల్లా గన్నవరం తాలూకాలోని బండారుగూడెం. నేను తొమ్మిదేళ్ళ వయసు వరకు అక్కడే ఉన్నాను. మా అమ్మ, నాన్నగారు గ్రాంట్ స్కూల్‌లో మేనేజర్, టీచర్‌గా పనిచేసేవారు. ఐదవ తరగతి విజయవాడలో చదువుకున్నాను. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతోన్న రోజుల్లో టీచర్లందరూ యుద్ధం కోసం ఫండ్స్ వసూలు చేయాలని టార్గెట్ పెట్టారు.

అక్కడ మునిసిపల్ స్కూల్ టీచర్లందరూ కలిసి దుర్గా కళామందిర్‌లో రామపాదుకా పట్టాభిషేకం నాటకం ప్రదర్శించారు. అందులో నేను భరతు డి పాత్ర వేశాను. అప్పుడు శోభనాచలవారి సినిమాలుండేవి. 1941లో చిత్రపు నారాయణ మూర్తి గారు భక్త ప్రహ్లాదుడు సినిమా తీశారు. అందులో ప్రహ్లాదుడిగా నేను నటనా ప్రవేశం చేశాను. పెద్ద ప్రహ్లాదుడిగా జి.వరలక్ష్మి చేశారు. నేను నాలుగో తరగతి నుండి ఎస్.ఎస్.సి. వరకు రాజమండ్రి గవర్నమెంట్ సెకండరీ ట్రెయినింగ్ స్కూల్‌లోను, డిగ్రీ పి.ఆర్.కాలేజి లోను చదివాను. ఆ తర్వాత పెళ్ళయింది. పిల్లలు కలిగారు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అవసరం కోసం ఉద్యోగం చేయాల్సి వచ్చింది. జాతీయ గ్రామీణాభివృద్ధి విభాగంలో విస్తరణాధికారిగా చేరాను. నాతోపాటుగా గ్రామ సేవికలు ఇద్దరో, నలుగురో ఉండేవారు. మేమంతా కలిసి మహిళా సంఘాలు, వయోజన విద్యా కేంద్రాలు, బాల్వాడి, బాల వికాస కేంద్రాలు ఏర్పాటు చేసేవాళ్ళం. అలా నాలుగు సంవత్సరాలు బంటుమిల్లి పంచాయతీ సమితిలో పనిచేశాను. చిన్న ప్రమోషన్ వచ్చి ల్కెజన్ ఆఫీసర్‌గా విజయవాడకు వచ్చాను. ఆ పోస్టులో జిల్లా అంతా పర్యటన చేయాలి. స్త్రీ సంక్షేమం కోసం వెళ్ళి, చూసి, వారికి సహాయం చేయాలి. అలా కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 20 సంవత్సరాలపాటు పనిచేశాను.

మా డిపార్టుమెంట్ కార్యక్రమాలు చాలా మంచివి. కానీ, అమలుపరిచే ఉద్యోగుల్లో సేవాభావం ఉండాలి. ఉంటేనే స్త్రీలను విద్యావంతులుగా చేయవచ్చు. వారికి అనేక విషయాలు నేర్పి ముందుకు తెచ్చే అవకాశం ఉంది. అంతేకాక, వారు స్వయం పోషకులుగా అయ్యేందుకు కూడా అనేక కార్యక్రమాలుండేవి. అవన్నీ అమలు చేయగలిగితే ఎంతో అభివృద్ధి జరుగుతుంది. నేను చదువుకునే రోజుల నుండే మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాల్లో చురుగ్గా పనిచేసేదాన్ని. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తూ విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు చేసేవాళ్ళం. అప్పట్లో స్కూళ్ళలో డిటెన్షన్ విధానం అమల్లో ఉండేది. ఆ విధానం కింద స్కూల్‌లో కొంతమంది విద్యార్థుల్ని అధికారులు డిటెయిన్ చేసేవాళ్ళు. దానికి వ్యతిరేకంగా పోరాటం చేశాం. నేను చదువుకున్న స్కూల్‌లో అచ్చంగా ఆడపిల్లలతో స్ట్రైక్ చేయించాం. దానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మద్దతునిచ్చారు. మా షరతులు అంగీకరించి అందర్నీ పబ్లిక్ పరీక్షకు పంపడానికి ఒప్పుకున్నారు. విద్యార్థి పోరాటాల్లో చాలా చురుకుగా పాల్గొనేదాన్ని. చిన్నప్పటినుంచి సేవాభావం ఉండడం వలన నాకు తగిన ఉద్యోగం దొరికిందని చాలా సంతోషపడేదాన్ని. ప్రజలతో, అన్ని వర్గాల స్త్రీలతో మమేకమై అన్ని రకాల విషయాలు వారికి చెప్పడం అనేది నాకు చాలా నచ్చేది. ఇది నాకు వచ్చిన చక్కని అవకాశంగా నేను భావించేదాన్ని. ఆ తరుణంలో నా మనసు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో మురికివాడల పేదల మధ్య పనిచేయడం మీదకు మళ్ళింది. అలా హైదరాబాద్ వచ్చేశాను.

నేను వచ్చేటప్పటికి హైదరాబాద్‌లో 850 మురికివాడలుండేవి. ఇప్పుడు చాలా పెరిగిపోయి ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ కార్యక్రమాలు నడుపుతూ వచ్చామో అవే మురికివాడల్లో నడపాలి. డెప్యుటేషన్ మీద వచ్చాను. చివరి పది సంవత్సరాలు ఇక్కడే ఉన్నాను. 89'లో రిట్కెరయ్యాను. ఇక్కడ కూడా అధికారుల మెప్పు పొందాను. ఆఫీస్ వర్క్ బాగా చేసేదాన్ని.

గ్రామాల్లో దళిత స్త్రీలు అధికభాగం వ్యవసాయ కూలీలుగా పనిచేసేవాళ్ళే. కొంతమంది మాత్రమే పొలం కలిగి ఉంటారు. మేం చేసే కార్యక్రమాలు అమలు పరచడం చాలా కష్టమయ్యేది. కొన్ని గ్రామాల్లో కుట్టు సెంటర్లు కూడా పెట్టాం. ఎవరో కొంతమంది వచ్చేవాళ్ళు. వయోజన కేంద్రం పెడితే వచ్చేవారు కాదు. మధ్య తరగతి, ఉన్నత వర్గాల వాళ్ళకు బాగానే జరుగుతుండేవి. ప్రభుత్వ పథకాలు అవసరాలున్న వాళ్ళకు, బాధల్లో ఉన్నవాళ్ళకు చేరడం లేదన్న ఆవేదన ఉండేది. ఈ రోజుల్లో పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది.

1970ల్లో విజయవాడలో విశాలాంధ్ర వాళ్ళ ప్రగతి ప్రతిభ పత్రిక వచ్చేది. దానికన్నా ముందు ఆంధ్రజ్యోతి డ్కెలీలో స్త్రీల సమస్యల మీద రాసేదాన్ని. దళిత సమస్యల మీద కూడా హాస్టళ్ళు ఎంత భయంకరంగా ఉంటున్నాయో అనే వాటిమీద రాసేదాన్ని. తుర్లపాటి కుటుంబరావు, నండూరి రామమోహనరావులు నేను పంపడమే తరువాయి సండే ఇష్యూలో వేసేవాళ్ళు, చాలా ప్రోత్సాహమిచ్చేవారు.

స్త్రీల సంక్షేమం మీద వరుసగా ఏడెనిమిది వ్యాసాలు పంపాను. 'ప్రతిభ' వాళ్ళు వేసుకున్నారు. ఆ రోజుల్లో వ్యాసాలతో మొదలుపెట్టాను. ఇక్కడికి వచ్చాక మా అమ్మాయి దాసరి శిరీష చూసి కథ రూపంలో కానీ, సీరియల్ రూపంలో కానీ సూటిగా చెప్పినప్పుడే పాఠకులకు హత్తుకుంటుంది, అర్థం చేసుకుంటారు అని అంటే కథలు రాయడం మొదలుపెట్టాను. 1984లో 'మాకు రావు సూర్యోదయాలు' నవలిక మూడు వారాలు ప్రభలో వచ్చింది. అప్పటికి ఆంధ్రప్రభ, వార్త, జ్యోతిలలో నేను నాలుగైదు కథలు రాశాను. 'స్ఫూర్తి' పేరుతో ఒక కథ ఈనాడు సన్‌డే ఎడిషన్‌లో అచ్చయింది. 1999లో "మాకు ఉంటాయి ఉషస్సులు" కథల సంపుటి విడుదల చేశాను. తర్వాత పది కథలు రాశాను. రెండు మాత్రం కథా సంకలనాల్లో వచ్చాయి. శ్రీలేఖ సాహితీ సంస్థ హనుమకొండలో ఉంది. అందులో శిఖరాగ్రం, కలకానిది కథలు వేశారు. జ్యోతి అనుబంధంలో కథలు, వ్యాసాలు అచ్చయ్యాయి.

స్త్రీవాదానికి ఆద్యులం మేమే అని కొంతమంది బయలుదేరారు. దాన్ని ఖండిస్తూ ఆంధ్రజ్యోతిలో వ్యాసం కూడా రాశాను. స్త్రీలు తమకు తెలియకుండా ఏ విధంగా బానిసత్వాన్ని వెతుక్కుంటున్నారో ఎప్పుడో చలం రాశారు, రంగనాయకమ్మ రాశారు. గురజాడ కూడా పూర్ణమ్మ కథ ద్వారా తెలిపాడు. స్త్రీలు, పురుషులు అనే భేదం లేకుండా స్త్రీల అధోగతిని చూపిస్తూ ఎప్పుడో రాశారు. కాబట్టి స్త్రీవాదం ఎప్పుడో ప్రారంభమయింది. దాన్ని మనం ముందుకు నడిపిస్తున్నాం, అంతే.

దళిత రచయితలు తమ సమస్యల మీద స్పందించి కథలు, కవిత్వం రాస్తున్నారు. వారిలో చైతన్యం ఉప్పొంగింది. ఏదో ఒక రూపంలో తమ సమస్యను నలుగురి దృష్టిలోకి తేవాలన్న చైతన్యం దళితుల్లో వచ్చింది. దళితులందరూ మనం ఒకటే అనుకోవాలి. మాలలు వేరు, మాదిగలు వేరు అనుకోకూడదు. ప్రభుత్వం ఇస్తున్న రిజర్వేషన్ కేవలం మాలలే పొందుతున్నారనే అసంతృప్తి మాదిగ కులస్తుల్లో

రేపటి సంచికలో



# డ్రగ్స్ పట్టివేత

### నిందితుల అరెస్ట్

**కుత్బుల్లాపూర్ మే 17 (జనం సాక్షి) :**

డ్రగ్స్ (ఎండిఎంఏ), గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరె స్టు చేసిన సంఘటన శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు, జగద్గిరిగుట్ట పోలీసులు, తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన రోహిత్ కొంతకాలం బెంగళూరులోని విమానాశ్రయంలో పనిచేసి మానేశాడు. అప్పటినుండి హైదరాబాదులో డ్రగ్స్ విక్రయాలు చేస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో జగద్గిరిగుట్టకు చెందిన తిలక్ సింగ్(22), గోపనపల్లికి చెందిన జూపల్లి అఖిల్ శివ(22)లకు డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో రోహిత్ తప్పించుకోగా తిలక్ సింగ్, అఖిల్ శివలు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# తరుగు పేరుతో రైతుల కష్టం దోచుకుంటుండ్రు

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) :**

రైతుల పంట కొనుగోళ్లలో తాళ్ళు తరుగు పేరుతో ఐదు కిలోల చొప్పున అధికంగా తూకం వేస్తూ, రైతుల శ్రమను దోచుకుతుంటున్నారు అని గురువారం జెడ్పీ సమావేశంలో నిలదీసిన తనకు, తూతూ మంత్రంగా సమాధానం ఇచ్చిన అధికారులు.. ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ వద్ద కొనుగోలు సెంటర్ ను శుక్రవారం పరిశీలించి, అక్కడి నుండే అధిక తూకంపై జిల్లా పౌర సరఫరాల డిఎంను ఫోన్ లో సంప్రదించగా, ముఠాలు తయారయ్యి ఆ విధంగా చేస్తున్నారు అనే సమాధానం వింటే, తాను పేర్కొన్నట్లుగా వ్యవస్థీకృత అవినీతి కాంగ్రెస్ హయంలో పురలు విప్పి కారాల నృత్యం చేస్తున్నది అని తేటతెల్లం అవుతుంది అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి విమర్శించారు. అధికారులు అధికార పార్టీ ఇంత నిర్లక్ష్యంగా ఉంటే, ఇక రైతులను దోపిడీని సహించే ప్రసక్తే లేదు,ఈ అంశంపై ఏ స్థాయి వరకు అయినా పోరాటం చేసేందుకు సిద్ధం అని ఆయన తెలిపారు.

# నేడు నార్సింగి మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం



**రాజేంద్రనగర్, మే (జనం సాక్షి) :**

గత 5 ఏళ్ళు గా భారాస ప్రభుత్వం తో కౌన్సిలర్లు కలివిడిగా ఉండి పరిపాలన సాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కౌన్సిలర్లు ఏకమై చైర్ పర్సన్ పీఠం అనుభవించాలని ప్రయత్నాలు చివరి దశకు చేరాయి.నార్సింగి మున్సిపాలిటీలో చైర్పర్సన్ రేఖ యాదగిరి వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్‌లపై శనివారంతో అవిశ్వాస తీర్మానం కథ సుఖాంతం అవుతుంది. గత నెలలో 12 మందితో కూడిన కౌన్సిలర్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు నోటీసులు అందజేయడంతో శని వారం ఆవిశ్వాస తీర్మానం నెగుతుందా, వీగుతుంగా అనే ఉత్కంఠ నెల కొంది. ఇప్పటికే 12 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఒకటై తీర్మానం పెట్టగా అందులో 9 మంది గోవా బాట పట్టారు. శనివారం జరగనున్న అవిశ్వాస తీర్మానానికి నేరుగా గోవా నుంచి నార్సింగి మున్సిపాలిటీకి చేరనున్నారు.



# కాంగ్రెస్ పార్టీకే మరోసారి మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం

### ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుమూల పరమేశ్వర్ రెడ్డి.

**కాప్రా, మే 17 (జనంసాక్షి) :**

మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ మరోసారి చేసుకోబోతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందు మూల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు పరమేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో ఇష్టగోష్టిలో పాల్గొన్నారు, సోమవారం జరిగిన ఎన్నికల సరళిని కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందన్నారు, కేంద్రంలో ఐఎన్‌డిఐఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్, పీ మల్లరెడ్డి, పవన్, బాబూ, శ్రీకాంత్ గౌడ్, జి సత్యనారాయణ, టి శ్రీహరి, రాకేష్, పూర్ణ యాదవ్, సాయి, సురేందర్ రెడ్డి, నరేందర్, సంతోష్ చారి, హరి, అలీ, సిద్దిఖ్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షం నుండి శేరిలింగంపల్లి ప్రజలకు ఇబ్బందులను తప్పించండి





### గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్

**శేరిలింగంపల్లి, మే 17 (జనంసాక్షి) :** గురువారం సాయంత్రం నగరంలో అనేకచోట్ల భారీ వర్షం కురిసిందని, ఇందులో భాగంగా అనేక లోతట్టు ప్రాంతాలు వర్షాభావానికి లోనై నీట మునగడం జరిగిందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ తో కలిసి లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక బయోడైవర్సిటీ జంక్షన్, క్యూ మార్ట్, డిఎల్ఎఫ్ వంటి ప్రధాన ప్రాంతాలను సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారీ వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయని, ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాల ప్రజలు తమ ఇల్లు నీట మునిగి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న మాట వాస్తవమేనన్నారు. డిఆర్ఎఫ్, మాన్సూన్, ఇతర ప్రత్యేక బృందాలు భారీ వర్షంలో సైతం రంగంలోకి దిగి ప్రజలకు, ప్రయాణికులకు, ఉద్యోగులకు తమ సేవలను అందిస్తూ రావా నా సౌకర్యాన్ని మెరుగుపరుస్తూనే, మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలను వీలైనంతవరకి ఇబ్బందుల నుంచి సంరక్షించే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఎదుర్కొంటున్న సమస్యలను గమనంలో పెట్టుకొని ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, వర్షం లేని సమయంలో తమ ప్రాంతాలకు నీటి తాకిడి లేకుండా తగిన ఏర్పాట్లను చేసుకోవాల్సిన అవసరాన్ని ఎత్తి చూపారు.

వర్షం పడిన ప్రతిసారి జిహెచ్ ఎంసి యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని నిందించడం మానేసి గత అనుభవాల దృష్ట్యా భద్రతా ఏర్పాట్లను సరి చేసుకోవాల్సిన బాధ్యత నగర ప్రజల పైన ఉందని కమిషనర్ పునరుద్ఘాటించారు. వీలైనంత త్వరగా నగరంలో సాధారణ పరిస్థితిలను తీసుకురావడానికి తాము ప్రయత్నిస్తున్నా మని, ఐదు రోజులు వర్షాలు ఉన్నాయనే వాతావరణ సమాచారం వల్ల తాము కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుడిసి వేణుగోపాల్ రెడ్డి, ఈ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- వజ్రష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డిలకు కోర్రేముల "డబుల్ ఇండ్ల" లబ్ధిదారుల వినతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) :**

కోర్రేములలోని డబల్ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారుల వినతి. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, వజ్రష్ యాదవ్ దృష్టికి , కోర్రేములలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సమస్యలను శుక్రవారం లబ్ధిదారులు తీసుకెళ్లారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నివసించే లబ్ధిదారులకు కోర్రేములలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ కేటాయించడంతో స్థానిక ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, కోర్రేముల ప్రాంతం మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో ఉండడంతో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రష్ యాదవ్ ల దృష్టికి, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు, డబల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని, త్వరగా పనులు రోడ్లు, డ్రైనేజ్, మంచినీరు, విద్యుత్ కనీస సౌకర్యాలు పనులు వేగవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వజ్రష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డిలు త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రికి, సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యల వారి దృష్టికి తీసుకెళ్లి, త్వరగా సమస్యలు పరిష్కరిస్తూ, ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం జరిగేలా కృషి చేస్తామని డబల్ బెడ్ రూమ్ ఇండ్ల బాధితుకు వారు హామీ ఇచ్చారని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్తాక్, రాజేష్ బొట్టు, యాకయ్య, రాంబాబు, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల

# వేతనాలు పెంచాలి..

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య వెల్లడి..
- కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్ లెక్కలు తేల్చండి..
- పెనాల్టీలను రద్దు చేయాలి..

**ఇల్లందు, మే 17 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పిఎస్ సి డబ్ల్యూయు ఐఎఫ్ టియు అనుబంధం ఇల్లందు బ్రాంచ్ కమిటీ జనరల్ బాడీ సమావేశం కొండపల్లి రఘు అధ్యక్షతన స్థానిక చంద్ర కృష్ణ మూర్తి భవనంలో జరిగింది. ఈసమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పాల్గొని మాట్లాడుతూ.. గడచిన పది సంవత్సరాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు నయాపైస జీతాలు పెంచలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద కాంట్రాక్టు కార్మికులు వేతనాలు పెంచుతారని నమ్మకంతో ఎదురుచూస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం ఏర్పాటుకు ప్రత్యేకంగా కోల్ బెల్ట్ లో సహాయపడ్డ కార్మికుల జీతాలు పెంచాలన్నారు. ఇప్పటికే యూనియన్ ప్రతినిధి బృందంతో పాటు నేను కూడా సింగరేణిని పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి జీతాల పెంపుపై నిర్ణయం తీసుకోమని కోరమని అన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సీఎం పిఎఫ్ లెక్కలు మూడు సంవత్సరాల నుండి లెక్కలు చూపడం లేదన్నారు. ఈ లెక్కల కోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు
సింగరేణిలో పెనాల్టీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం 15 మందితో బ్రాంచి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షులుగా కే వెంకట నాయక్ ఉపాధ్యక్షులుగా బాలు చౌహన్ కార్యదర్శిగా కొత్తపల్లి రఘు సహాయ కార్యదర్శిగా జి రాజేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్ మోహన్, కోశాధికారిగా సత్య నారాయణ మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నారని తెలిపారు ఈ జనరల్ బాడీ లో ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న శ్యామల సుమిత్ర సైదా శారద ఇస్తారి చంద్రు నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ స్లిప్పుల పంపిణీ వంద శాతం చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం బ్యూరో, మే 17 (జనంసాక్షి):**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ వంద శాతం చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డీవోలు, తహశీల్దార్లతో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ కు, తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో వుందో తెలియాల్సిన అవసరం ఉందని, ఈ దృష్ట్యా ఓటర్ స్లిప్పుల పంపిణీ, నమోదైన ప్రతి ఓటరుకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ సంబంధిత బిఎల్ఓ ద్వారా చేపట్టాలని, ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు పంపిణీ పురోగతిపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని, ఏవేని చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే, వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి విడత శిక్షణ ఈ నెల 20న, రెండో విడత శిక్షణ ఈనెల 26న చేపట్టబడునని ఆయన అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ లో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రి తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి, అక్కడే బస చేయాలన్నారు. రిసిప్షన్ కేంద్రం నల్గొండ లోని నాగార్జున కళాశాలలో ఉంటుందని, ఈ నెల 27న పోలింగ్ పిమ్మట నేరుగా రిసిప్షన్ కేంద్రానికి పోలీస్ ఎస్కార్ట్‌తో వెళ్లాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 15 రూట్లు, ప్రతి రూటుకు రూట్ ఆఫీసర్ ని నియమించామన్నారు. తహశీల్దార్లు సెక్టార్ అధికారులుగా, నయాబ్ తహశీల్దార్లు ఫ్లయింగ్ స్క్వాడ్ గా, ఆర్ఐ లు ప్రత్యేక వీడియో టీమ్ లుగా నియమించినట్లు, శుక్రవారం నుండే తమ విధుల నిర్వహణ చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రత్యేక వీడియో టీమ్ కు వీడియోగ్రాఫర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఓటింగ్ విధానం, చేయదగినవి, చేయకూడని పనులపై ఫ్లెక్సీ రూపొందించి, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతించవద్దని ఆయన అన్నారు. ఇండిలిబుల్ ఇంక్ ఎడమచేతి మధ్య వ్రేలుకు పెట్టాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 20 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, డిఆర్డీఓ ఎం. రాజేశ్వరి, ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, అనురాధ బాయి, రాంబాబు, సత్యనారాయణ, ఓఎస్డీ నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

## పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యత గ్రామపంచాయతీలదే

## రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల పనుల ఆకస్మిక తనిఖీ

### జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు



సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేసి జూన్ 5 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని తెలిపారు.పాఠశాలలో జరుగుతున్న పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. పనులను నాణ్యమైన మెటీరియల్ కొనుగోలు చేసి పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో ముఖ్యంగా త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, విద్యుత్, పాఠశాల గదిలోని బ్లాక్ బోర్డుల పనులను త్వరగా పూర్తిచేసి అందజేయాలన్నారు. పాఠశాల్లో పారిశుద్ధ్య పనులు గ్రామపంచాయతీ సిబ్బంది చూడాలని, వారిదే బాధ్యతని పేర్కొన్నారు.రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు.ప్రహరీ ఒకచోట కూలిపోవడం గమనించి, వెంటనే పనులు పూర్తి చేయాలని టిఎస్ఈడబ్ల్యూ ఐడిసి ఏఈ రమేష్ ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు టీఎస్ఈడబ్ల్యూ ఐడిసి శాఖ ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు 533 పాఠశాలలు గుర్తించగా, 506 పాఠశాలలో గ్రౌండ్ చేయడం జరిగిందని ,ఇప్పటివరకు 165 పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఏఈ రమేష్ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ అనిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అందరు శ్రమించి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి : రేగా కాంతారావు..

- కష్టపడి పని చేసి పార్టీ ఉనికిని కాపాడండి..
- ప్రశ్నించే గళం బిఆర్ఎస్ పార్టీ.. రేగ
- నల్గొండ మరో నయీమ్ తీన్మార్ మల్లన్న

**మణుగూరు, మే 17 (జనంసాక్షి):**
ఒక్కటే ఓటు .. అది మన ఎమ్మెల్సి అభ్యర్థి రాకేష్ రెడ్డికే వేయాలనీ బీఆర్ఎస్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మణుగూరు మండలంలోని కిన్నెర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్టీ ఉనికిని కాపాడాలని అన్నారు. రాబోయే సర్పంచి ఎన్నికలలో సన్నద్ధమవుతూ బూత్ స్థాయిలో ఉన్న నాయకులు చురుకుగా పని చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా నాయకులు అండగా ఉండాలన్నారు. మీకు అందుబాటులో మణుగూరు లోనే ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు పార్టీ ఆఫీస్ లో నే ఉంటా.... ఎప్పుడైనా సంప్రదించవచ్చు అన్నారు.నోటి దురుసు మాటలు మాట్లాడ వద్దు... తెలిస్తే సస్పెండ్ చేస్తా... ఆందోళన వద్దు... పార్టీ మనుగడ కోసం పని చేయాలన్నారు. న్యాయబద్ధంగా పోరాటం చేసే క్రమంలో కార్యకర్తలకు ఏదైనా కేసు అయితే లీగల్ సెల్లో రూ 10 కోట్ల రూపాయల చెక్కును పార్టీ ఫండ్ గా ఏర్పాటు చేసింది. మిమ్ములను ఎప్పుడు కాపాడుకుంటుంది. ఎవరు భయపడు వద్దని అన్నారు. పినపాక నియోజకవర్గం లో సర్పంచ్ యూత్ మండల ప్రసిడెంట్ లు కీలకంగా వ్యవహరించాలనీ తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి గెలుపు కోసం ముమ్మర ప్రచారం చేయాలన్నారు. మండల స్థాయిలో బూతులలో గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పనిచేయాలన్నారు. మండల వారీగా ఓటర్ లిస్ట అందజేయడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగస్తులను, మెడికల్ విభాగంలో పనిచేసేవారిని ప్రైవేటు కంపెనీలలో పనిచేసే గ్రాడ్యుయేట్స్ ప్రతి ఒక్కరిని ప్రణాళిక బద్దంగా ప్రతి మండలంలో వారిని కలవాలని చెప్పారు.

**రేగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం:**
మణుగూరు మండలం గనీబోయిన గుంపు గ్రామానికి చెందిన మట్టా వెంకటేశ్వర్లు కుమారుడు కొద్ది రోజుల క్రితం ఇంకుడు గుంతలో మరణించగా.. వారి కుటుంబానికి రేగ విష్ణు, ట్రస్టు ద్వారా రూ.50,000 విలువగల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం టిఆర్ఎస్ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం..

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తాం - ఇది అసెంబ్లీ ఎన్నికల ముందు మాట..

## వానకాలం నుంచి ధాన్యానికి బోనస్ ఇస్తాం - ఇది లోక్ సభ ఎన్నికల ప్రచారంలోని మాట..

## కేవలం సన్నధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి తాజామాట.. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ..

ఇల్లందు మే 17 (జనంసాక్షి):
భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా రాష్ట్రంలోని రైతులను గోసపుచ్చుకుంటున్న సర్కార్ కు వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఈరోజు ఇల్లందు నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్ ఇల్లందు పట్టణం నందు స్థానిక జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ ఇల్లందు నియోజకవర్గ ఐదు మండలాల అధ్యక్షులు మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లు బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులతోకలిసి ఈరోజు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ ఫౌండర్ మాజీ జిల్లా అధ్యక్షులు చైర్మన్ దిండిగాల రాజేందర్, ఇల్లందు నియోజకవర్గ ఐదు మండలాల అధ్యక్షులు మాట్లాడుతూ..రైతుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా నిలిచేందుకు బిఆర్ఎస్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని వారు అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే క్వింటాలకు 500 రూపాయల ధాన్యానికి చెల్లిస్తామని దొంగ హామీలు ప్రకటించిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అవసరం తీరగానే నాలుక మడత వేసి లోక సభ ఎన్నికలు ముగిసి ముగియగానే బోనస్ పై నాలుక మర్లేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బిఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పుడు ప్రభుత్వం సన్నబడ్లకే బోనస్ అంటూ చేసిన తాజా ప్రకటనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్టు తెలియజేశారు.పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మర్నాడే వరికి క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇప్పుడు సన్నబట్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ తెలంగాణ రైతాంగాన్ని వంచించారని, మోసం చేశారని దగా చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని ఈ విషయం తెలిసి కూడా సన్నవడ్లకే బోనస్ ఇస్తామని ఎట్లా ప్రకటిస్తారని ప్రశ్నించారు. డబ్బాలో ఓట్లు పడగానే కాంగ్రెస్ పార్టీకి రైతులతో అవసరం తీరిందని అందుకే నాలుక మర్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నదని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నుండి కూడా ఏనాడు రైతన్న లాభపడింది లేదని ఆనాటి కాంగ్రెస్ పార్టీ పాలనను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కరువు అని కాంగ్రెస్ పార్టీ అంటేనే కరెంటు కోత అని నేడు ప్రత్యక్ష ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే అనే మాటను ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కు తుక్కు చేసే వాళ్ళని అన్నారు. రైతుబంధు , రైతు భరోసా ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని దుయ్యపట్టారు. ఇచ్చిన హామీల్లో మరో దానికి ఎగనామం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదా...? ఆ పార్టీ మాటలు నమ్మిన రైతుల ఆశలు అడియాశలే కానున్నాయా అంటే అవుననే సమాధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రకటనతో స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు... కాంగ్రెస్ ఇచ్చిన బోనస్ హామీ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమవుతుందన్న కారణంతోనే తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుందనే హామీ ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అవుతుందన్న కారణంతోనే తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. నాటి కరోనా కష్ట కాలంలోని కూడా ఆనాడు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ రైతన్నకు వెన్నుదండగా ఉంటూ 7000 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో ఏనాడు కూడా రైతన్నలు కష్టపడింది లేదని రైతు పక్షపాతి టిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్కినేని సురేందర్, సిలివేరి సత్యనారాయణ,బయ్యారం మండల అధ్యక్షుడు,తాత గణేష్,గంగుల సత్యనారాయణ టేకులపల్లి మండల అధ్యక్షుడు, బొమ్మెర వరప్రసాద్,ఇల్లందు మండల వైస్ ఎంపీపీ దాసం ప్రమోద్, గార్ల మండల అధ్యక్షుడు, గంగావత్ లక్ష్మణ్ నాయక్, కామేపల్లి మండల నాయకులు, అంతోటి అచ్చయ్య,మూడు కృష్ణ ప్రసాద్, మల్లంపాటి శ్రీనివాస్,ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు,ఇల్లందు మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మం పాటి రేణుక,6వార్డు కౌన్సిలర్ తోట లలిత శారద, సుభాష్ నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు, ఘాజి,పట్టణ అధ్యక్షురాలు,నెమలి ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కోకు సరిత, గంద్రాతి చంద్రావతి,ఇల్లందు పట్టణ నాయకులు,లాల్ సింగ్,పివి కృష్ణారావు, అబ్దుల్ జబ్బర్,అబ్దుల్ నబి,గిన్నారపు రాజేష్,సాతాల హరికృష్ణ,హరి ప్రసాద్, నారపాక వసంత్, రాచపల్లి శీను,ఆధూరి రవి,సర్దార్,చాంద్ పాషా, పాలడుగు రాజశేఖర్, నెమలి నిఖిల్, లలిత్ పాసి,గడ్డి శీను,ఈదుల ముత్తయ్య,కుక్క రాము,తుంగపల్లి మహేష్, వివిధ మండల నాయకులు తాండ్ర నాగరాజు, చిన్నారి, రాజేష్,ఆధూరి ప్రసాద్,పుచ్చకాయల బాబు,బరావత్ శివ, ఇస్తారి, మూడు బాలు, బోడ ప్రసాద్, మూడు హనుమాన్, రాజేశ్వరి సురేష్, పూనం కమల, పరికపెల్లి రవి, కొంటూ రవికాంత్, పింకీ లోద్, ఎస్.కె అఫ్జల్, గందూరి వీరస్వామి,ఇమ్రాన్, ఏనుగుల ఐలయ్య, వజ భద్రయ్య,బానోత్ లక్ష్మణ్,బానోత్ శీను, కీర్తి, ఉదయ్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# 19న సత్తెనపల్లి భవన్ ప్రారంభోత్సవం

- ప్రారంభకులు కేరళ మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కెకె శైలజా టీచర్
- ముఖ్య అతిథి సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- రెడ్ షర్ట్ వాలంటీర్లతో కవాతు - ప్రదర్శన
- ఖమ్మం హవేలీ అభివృద్ధిలో సీపీఐ (ఎం) కీలకపాత్ర
- సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జనంసాక్షి :**
ఖమ్మం ఖానాపురం హవేలీ ప్రాంత అభివృద్ధిలో సీపీఐ (ఎం) కీలక భూమిక పోషించిందని ఆపార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ లో విలీనానికి ముందు దాదాపు 20 ఏళ్ల పాటు హవేలీ సర్పంచ్, ఎంపీటీసి పాలనా బాధ్యతలను నిర్వహించిన సీపీఐ (ఎం) హయాంలో ఆ ప్రాంతం ప్రగతి పథంలో నడిచిందన్నారు. అటువంటి సీపీఐ (ఎం) హవేలీ కమిటీ ఆధ్వర్యంలో ఆ ప్రాంతానికి చెందిన పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో స్థానిక ఇందిరానగర్ సెంటర్లో నిర్మించిన సీపీఐ (ఎం) ఖానాపురం హవేలీ కమిటీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో నాగేశ్వరరావు మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఈ భవనాన్ని కేరళ రాష్ట్ర శాసనసభ్యులు , ఆ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి, సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు కేకే శైలజ టీచర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు హాజరవుతారని వివరించారు. ఆఫీస్ పక్కనే ఉన్న వినియోగదారుల ఫోరం స్థలంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**సీపీఐ (ఎం) హయాంలో కార్పొరేషన్ కు దీటుగా హవేలీ అభివృద్ధి**
సీపీఐ (ఎం) హయాంలో కార్పొరేషన్ కు దీటుగా ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందని తెలిపారు. పార్టీ ప్రస్తుత జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలుగా ఉన్న బుగ్గవీటి సరళ ఆనాడు సర్పంచ్ గా ఈ ప్రాంత అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. సీపీఐ (ఎం) పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంత పేదలకు ఇళ్ల స్థలాలు సమకూరాయని తెలిపారు. ఫ్లోరైడ్ రహిత మంచినీటి సరఫరా ప్రారంభమైందన్నారు. రస్తోగినగర్, వేణుగోపాల్ నగర్ లో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగిందన్నారు. వైయస్సార్ నగర్ స్థలాలు కూడా నాడు సీపీఐ (ఎం) చేసిన పోరాట ఫలితంగానే సిద్ధించాయని పేర్కొన్నారు. హవేలీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల కాలనీలు కూడా తమ పోరాట ఫలితంగానే ఏర్పడ్డాయని, ఈ పోరులో భాగంగా 250 మందికి పైగా సీపీఐ (ఎం) కార్యకర్తలు అరెస్టై జైలు పాలయ్యారని తెలిపారు. ఖమ్మం నగరానికి తలమానికంగా ఉన్న అపార్ట్మెంట్ నిర్మాణాలు కూడా హవేలీ ప్రాంతం నుంచే ప్రారంభమయ్యాయని అన్నారు. సిసి రోడ్లు, లింకు రోడ్ లు ఇలా అనేకం హవేలీ ప్రాంతంలో సీపీఐ (ఎం) కృషి ఫలితంగా ఏర్పడ్డాయని అన్నారు. ఖమ్మం నగరానికి తలమానికంగా హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే దాంట్లో సిపిఎం పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు.

**అకడమిక్ గ్రంథాలయం... వైద్య శిబిరం**
సీపీఐ (ఎం) హవేలీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకే కాకుండా కార్యాలయంలో అకాడమిక్ గ్రంథాలయంతో పాటు ప్రతినెలా ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు మెడికల్ క్యాంపులు నడుస్తున్నాయని, ఏడో క్యాంపు హవేలీ కార్యాలయంలో ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా రూ.3000 విలువచేసే మందులను రూ.100కు అందిస్తామని తెలిపారు. సత్తెనపల్లి భవన్ నిర్మాణానికి కృషిచేసిన సీపీఐ (ఎం) జిల్లా నాయకులు బుగ్గ వీటి సరళ, డి. తిరుపతిరావు, మిగిలిన నాయకులను నున్నా ప్రత్యేకంగా అభినందించారు.

**సన్నరకం వడ్లకే రూ.500 బోనస్ సరికాదు..**
సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం సరికాదన్నారు. దాదాపు 80 శాతం ధాన్యం దొడ్డు రకాలే ఉంటాయని అన్నారు. ఏ రకమైన ధాన్యమైనా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఆదాయం పేరుతో రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. సామాన్య ప్రజలపై భారం వేసే చర్యలు సరికాదన్నారు. సంపద సృష్టించి ప్రజలకు ఇస్తామన్న ఉప ముఖ్యమంత్రి భట్టి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి తప్ప ప్రజలపై భారం వేసే దిశగా ఆలోచన చేయడం సరికాదని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గ వీటి సరళ, వై. విక్రమ్, హవేలీ కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

# విపణి



## స్టాక్ మార్కెట్లలో కొనసాగిన లాభాలు

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలతో ఈ ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీ లు ఆ తర్వాత కీలక రంగాల్లో మదుపర్ల కొనుగోళ్ల అండతో కోలుకున్నాయి.నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 250 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 22,450 మార్క్ పైన స్థిరపడింది.క్రితం సెషన్‌లో 600 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్.. ఈ ఉదయం 73,711.31 వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. తొలి సెషన్‌లో ఒడుదొడుకులను ఎదుర్కొన్న సూచీ.. ఆ వెంటనే పుంజుకుని ఇంట్రాడేలో 74వేల మార్క్‌ను దాటి ట్రేడ్ అయ్యింది. చివరకు 253.31 పాయింట్ల లాభంతో 73,917.03 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 22,345-22,502 పాయింట్ల మధ్య ఊగిసలాడి మార్కెట్ ముగిసేసరికి 62.25 పాయింట్ల లాభంతో 22,466.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 16 పైసలు పెరిగి 83.34గా ఉంది.నిఫ్టీలో మహీంద్రా అండ్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, గ్రాసిమ్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ పెట్రోలియం షేర్లు రాణించగా.. టీసీఎస్, సిప్లా, ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఆటో షేర్లు నష్టపోయాయి.

## నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు.. నిఫ్టీ ఏ 22,365

ముంబయి: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:26 గంటల సమయంలో సెన్సెక్స్ 176 పాయింట్లు నష్టపోయి 73,487 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 38 పాయింట్లు కుంగి 22,365 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.50 వద్ద ప్రారంభ మైంది.సెన్సెక్స్-30 సూచీలో ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, టాటా స్టీల్, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రమే లాభాల్లో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, మారుతీ, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు అత్యధికంగా నష్టపోతున్న జాబితాలో ఉన్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం రికార్డు గరిష్ఠాలను తాకాయి. లాభాల స్వీకరణతో చివరకు నష్టాల్లో ముగిశాయి. చైనా సహా ఇతర దేశాల్లో కీలక స్థూల ఆర్థిక గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఆసియా-పసిఫిక్ సూచీలు నేడు అప్రమత్తంగా ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.776 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.2,128 కోట్ల వాటాలను కొనుగోలు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 83.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## భారత్‌కు పెరిగిన విదేశీ పెట్టుబడులు : ఐరాస

ఐక్యరాజ్యసమితి:
భారత్ గణనీయమైన ఆర్థికవృద్ధిని చూస్తోందని ఐక్యరాజ్య సమితికి చెందిన నిపుణుడు పేర్కొన్నారు. చైనాకు విదేశీ పెట్టుబడులు చాలా తక్కువగా నమోదవుతున్నాయని.. దీంతో అనేక పాశ్చాత్య దేశాల సంస్థల పెట్టుబడులకు భారత్ ప్రత్యామ్నాయ గమ్యస్థానంగా మారిందన్నారు. 2024 దేశ వృద్ధిరేటు అంచనాలను సవరించిన నేపథ్యంలో ఐరాస నిపుణుడు ఈవిధంగా మాట్లాడారు.పాశ్చాత్య దేశాలతోపాటు విదేశాల నుంచి చైనాకు పెట్టుబడులు చాలావరకు తగ్గాయి. ఈ క్రమంలో విదేశీ పెట్టుబడుల ప్రవాహంతో భారత్ ఎంతో లబ్ధి చెందుతోంది. పశ్చిమదేశాల కంపెనీలకు వనరులు లేదా ప్రత్యామ్నాయ పెట్టుబడుల గమ్యస్థానంగా మారింది. ఇది భారత్‌కు లబ్ధి చేకూరుస్తోంది" అని ఐరాస ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగానికి చెందిన హమీద్ రషీద్ పేర్కొన్నారు. 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అంచనాలు 2024'కు సంబంధించి తాజా సవరణలను వెల్లడించిన ఆయన.. దేశ ఆర్థికవృద్ధి రేటు 7 శాతానికి చేరువలో నమోదవుతుందని అంచనా వేశారు.

**వరల్డ్ 'సూపర్-రిచ్'లో 15 మంది..**
**జాబితాలో అదానీ**

'భారత్ వృద్ధి రేటు 2024లో 6.9శాతం, 2025లో




6.6 శాతంగా నమోదు చేసుకుంటుందని అంచనా. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు వినియోగ సామర్థ్యం స్థిరంగా కొనసాగుతుండటం ఇందుకు దోహదం చేస్తుంది. ఔషధ, రసాయనాల ఎగుమతులు మరింత బలంగా విస్తరిస్తాయి. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. ఇతర దేశాల మాదిరిగా ఆర్థికస్థితి కృత్రిమంగా కనిపించడం లేదు. స్థిరవృద్ధికి అన్నివైపులా మద్దతు లభిస్తోంది. నిజానికి గతేడాది నుంచే ఊపందుకున్న ఈ వృద్ధి.. క్రమంగా కొనసాగుతోంది" అని హమీద్ రషీద్ వివరించారు. ముడిచమురు ధర విషయంతోపాటు దిగుమతుల కోసం రష్యాతో చేసుకున్న ఏర్పాట్లు కూడా భారత్‌కు ఎంతో దోహదం చేస్తున్నాయని ఐరాస ప్రతినిధి పేర్కొన్నారు. భారత్‌తోపాటు బ్రెజిల్‌లోనూ బలమైన వృద్ధి రేటు చూశామన్నారు. చైనా వృద్ధి రేటును ఈ జనవరిలో 4.7శాతంగా అంచనా వేయగా.. తాజాగా అది స్వల్పంగా పెరిగి 4.8శాతంగా ఉండనుందన్నారు. పలు రంగాల్లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. అక్కడి ప్రాపర్టీ రంగం డ్రాగన్‌కు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తోందన్నారు.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹66,750 (22 క్యారెట్లు)
₹72,820 (24 క్యారెట్లు)

చెన్నై
₹66,900 (22 క్యారెట్లు)
₹72,980 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹90,700

## వృద్ధిరేటు అంచనాలను గణనీయంగా పెంచిన ఐరాస

ఐరాస: భారత ఆర్థిక వృద్ధి రేటు అంచనాలను ఐక్యరాజ్య సమితి సవరించింది. దాదాపు 7 శాతానికి పెంచింది. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు వినిమయం పెరగడమే అందుకు కారణమని తెలిపింది.2024లో భారత్ 6.9 శాతం, 2025లో 6.6 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. బహిర్గత డిమాండ్ తక్కువగా ఉంటుందని.. దీనివల్ల సరకుల ఎగుమతిలో వృద్ధి దెబ్బతింటుందని తెలిపింది. అదే సమయంలో ఔషధ, రసాయన ఎగుమతులు బలంగా పుంజుకుంటాయని పేర్కొంది. జనవరిలో 2024 భారత వృద్ధిరేటును ఐరాస 6.2 శాతంగా పేర్కొంది. దాన్ని ఇప్పుడు ఏకంగా 0.7 శాతం పెంచడం విశేషం. 2025 అంచనాలను మాత్రం సవరించలేదు.

**స్టాక్ మార్కెట్.. పెట్టుబడులు.. కాస్త అప్రమత్తంగా**

భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2023 నాటి 5.6 శాతం నుంచి 2024లో 4.5 శాతానికి




దిగొస్తుందని ఐరాస నివేదిక అంచనా వేసింది. దక్షిణాసియా ప్రాంతవ్యాప్తంగా ఇదే ధోరణి ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణం గరిష్ఠంగా ఇరాన్‌లో 33.6 శాతం, మాల్దీవుల్లో అత్యల్పంగా 2.2 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. బంగ్లాదేశ్, భారత్‌లో ఆహారపదార్థాల ధరలు కొంత తగ్గినప్పటికీ.. ఇంకా అధిక స్థాయుల్లోనే ఉన్నాయని తెలిపింది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2024లో 2.7 శాతం, 2025లో 2.8 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. 2024 అంచనాలను 0.3 శాతం పెంచడం విశేషం. అమెరికా సహా బ్రెజిల్, భారత్, రష్యా వంటి వర్ధమాన దేశాల్లో బలమైన వృద్ధే అంచనాలను పెంచడానికి దోహదం చేసిందని తెలిపింది. అధిక ద్రవ్యోల్బణంతో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలు తక్కువ వృద్ధిరేటుకు పరిమితం కానున్నాయని వెల్లడించింది.



## టెండర్లలో 1.5 శాతం ఆయనకు ఇవ్వాల్సిందే: ఈడీ

మనీలాండరింగ్ కేసులో ఇటీవల అరెస్టైన ఝార?ండ్ మాజీ మంత్రి ఆలంగీర్ ఆలమ్ ప్రభుత్వ టెండర్లలో భారీగా సొమ్ములు వసూలు చేసేవాడని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యాయస్థానానికి వెల్లడించింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన ఏ టెండర్‌లోనైనా ఆయనకు 1.5 శాతం వాటా కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందేనని.. అప్పుడే అవి ఓకే అవుతాయని తెలిపింది.ఆలంగీర్ సన్నిహితుడు సంజీవ్ కుమార్ లాల్ పని మనిషి జహంగీర్ ఆలమ్ అనే వ్యక్తి ఫ్లాట్ నుంచి రూ.32.2 కోట్ల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఈడీ పేర్కొంది. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ సొమ్ములు వసూలు చేసి పంచే బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్లు చూసుకుంటారని వెల్లడించింది. ఇలానే 2022 సెప్టెంబర్‌లో ఓ ఇంజినీర్ నుంచి రూ.3 కోట్లు అందుకున్నట్లు పేర్కొంది.2020లో గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ వీరేంద్ర రామ్‌పై కేసు నమోదు చేసింది. "తన శాఖలో పనులు అప్పగించడానికి రామ్ కాంట్రాక్టర్ల వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసేవాడు. ఈ డబ్బు సేకరణకు అసిస్టెంట్ ఇంజినీర్లు సాయం చేసేవారు" అని ఈడీ పీఎంఎల్‌ఏ కోర్టుకు వెల్లడించింది. ఈ మొత్తం వ్యవహారంలో గ్రామీణాభివృద్ధి శాఖలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉద్యోగులున్నారని ఈడీ పేర్కొంది. భారీ మొత్తంలో నగదు తీసుకొని.. ఆ తర్వాత వాటితో మనీలాండరింగ్ చేసినట్లు చెప్పింది.సార్వత్రిక ఎన్నికల వేళ ఝార?ండ్ రాజధాని రాంచీలో గుట్టలుగా రూ.32 కోట్లు బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది. రాష్ట్ర మంత్రి ప్రైవేటు కార్యదర్శి పనిమనిషి ఇంటి నుంచి ఈడీ అధికారులు ఈ మొత్తం స్వాధీనం చేసుకున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఝార?ండ్ గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ వీరేంద్ర కుమార్ రామ్‌ను ఈడీ అరెస్టు చేసింది. రూ.10 వేలు లంచం తీసుకున్నాడన్న ఆరోపణలపై నాడు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈ హవాలా నెట్‌వర్క్ బయటపడింది. కాంట్రాక్టర్లకు టెండర్ల ఆశ జూపి వారి నుంచి భారీ మొత్తం డబ్బులు దండుకున్నట్లు వీరేంద్ర విచారణలో చెప్పినట్లు సమాచారం. ఇందులో తనతో పాటు చాలా మంది పెద్ద స్థాయి అధికారులు కూడా భాగస్వాములైనట్లు చెప్పాడు. మొత్తం టెండర్ విలువలో కొంత శాతం కమీషన్ తీసుకోగా.. అందులో తన వాటా 0.3 శాతమని పేర్కొన్నాడు. అతడు ఇచ్చిన వాంగ్మూలంతో ఈడీ విస్తృత దర్యాప్తు చేపట్టింది.

## ఈ పుస్తకం ప్రతీ విద్యార్థి చదవాలి

**ఇన్ఫీ నారాయణమూర్తి**



భారత్‌లో ప్రతీ విద్యార్థి చదవాల్సిన ఓ పుస్తకాన్ని ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి పంచుకున్నారు.పాల్ జి.హెవిట్ రాసిన 'కాన్సెప్చువల్ ఫిజిక్స్'ను ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. దీన్ని రచయిత అద్భుతంగా రాశారని.. అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయాల్సిన అవసరం ఉందన్నారు.'ప్రస్తుతం నేను కాన్సెప్చువల్ ఫిజిక్స్ అనే పుస్తకాన్ని చదువుతున్నాను. దీన్ని హైస్కూల్ టీచర్ పాల్ హెవిట్ రాశారు. హైస్కూల్ విద్యార్థులను దృష్టిలోఉంచుకొని రచించారు. ఫిజిక్స్ ఎలా బోధించాలో అద్భుతంగా వివరించారు. రచయిత నుంచి అనుమతి లభిస్తే దీన్ని అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయాలి. దీంట్లో అద్భుతమైన ఎక్సర్‌సైజులు ఉన్నాయి. క్లిష్టమైన ఐడియాలను చాలా చక్కగా వివరించారు. శ్రీనగర్ నుంచి కన్యాకుమారి.. మేఘాలయ నుంచి జామ్‌నగర్ వరకు ప్రతి ఒక్కరూ దీన్ని చదవాలి. 'సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మేథమేటిక్స్ సబ్జెక్టుల్లో మంచి అవగాహన ఏర్పడుతుంది" అని ఓ ప్రముఖ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నారాయణమూర్తి వెల్లడించారు.
కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలు కోల్పోతామనే భయాలను నారాయణ మూర్తి కొట్టిపారేశారు. దీన్ని మరీ ఎక్కువ చేసి చూపుతున్నారని అభిప్రాయపడ్డారు. కొత్త అవకాశాల సృష్టి, మనుషుల ఉత్పాదకతను పెంచే సామర్థ్యం ఏఐకి ఉందని తెలిపారు. 1970ల్లోనూ ఇదేతరహా అపోహలు వినిపించాయని గుర్తుచేశారు. 'కేస్ టూల్స్' అనే కంప్యూటర్ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ టూల్స్ వచ్చినప్పుడు అనేక భయాలు వ్యాపించాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలు ఊడిపోతాయనే ప్రచారం జరిగిందని వెల్లడించారు. కానీ, రాను రానూ మరింత క్లిష్టమైన సమస్యలు మనుష లకు ఎదురయ్యాయని.. సాఫ్ట్‌వేర్ డెవలప్ మెంట్ ఇంకా అభివృద్ధి చెందిందని వివరిం చారు. ప్రపంచంలో ఎక్కడ ఏ ఆవిష్కరణ జరిగినా భారత్ దాన్ని వినియోగించుకునే సామర్థ్యాన్ని అందుపుచ్చుకుందని మూర్తి తెలిపారు. జనరేటివ్ ఏఐను అందుకు ఉదాహరణగా చెప్పారు. ఇప్పటి యువత పాత తరాలతో పోలిస్తే చాలా చురుగ్గా ఉన్నారని అన్నారు. ఏఐ వల్ల అటానమస్ డ్రైవింగ్, న్యూక్లియర్ రియాక్టర్ల వంటి ప్రమాదకరమైన ప్రాంతాల్లో మెషీన్ ఆపరేటర్లు, రిమోట్ సర్జరీ వంటి రంగాల్లోని ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం తప్పకపోవచ్చునని తెలిపారు. ఉద్యోగాలు పోతాయనే ఆలోచనల నుంచి బయటకు వచ్చి దాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించగలమనే విషయంపైకి చర్చను మళ్లించాలని మూర్తి సూచించారు.

## వరల్డ్ 'సూపర్-రిచ్'లో 15 మంది.. జాబితాలో అదానీ



ప్రపంచంలో 100 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన 'సూపర్-రిచ్' క్లబ్‌లో 15 మంది చేరారు. ఈ జాబితాలోకి ఇంతమంది చేరడం ఇదే తొలిసారి.వీరిలో భారత్ నుంచి గౌతమ్ అదానీ ముకేశ్ అంబానీ కూడా ఉండడం విశేషం. కృత్రిమ మేధ, విలాసవంత వస్తువులకు గిరాకీ, భౌగోళిక రాజకీయాల్లో మార్పుల కారణంగానే వీరందరి సంపద పెరిగింది.బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం.. 'సూపర్-రిచ్' జాబితాలోని 15 మంది సంపద ఈ ఏడాది 13 శాతం పెరిగి 2.2 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ రాబడులను అధిగమించి వీరి సంపద వృద్ధి చెందింది. ప్రపంచంలోని తొలి 500 మంది సంపన్నుల సంపదలో పావు వంతు ఈ 15 మంది వద్దే ఉండడం గమనార్హం.ఈ జాబితాలో ఉన్నవారి సంపద గతంలోనే 100 బిలియన్ డాలర్లు దాటింది. అయితే, ఒకేసారి వారంతా ఈ మైలురాయికి ఎగువన నిలవడం మాత్రం ఇదే తొలిసారి. లోరియల్ ఎస్ఏ వారసురాలు ఫ్రాంకోయిస్ బెటెన్‌కోర్ట్ మేయర్స్, డెల్ టెక్ వ్యవస్థాపకుడు మైకేల్ డెల్, మెక్సికన్ బిలియనీర్ కార్లోస్ స్లిమ్ వీరంతా గత ఐదు నెలల వ్యవధిలోనే 100 బి.డాలర్ల మైలురాయిని అందుకున్నారు. గతంలో ఈ క్లబ్‌లో ఉన్న గౌతమ్ అదానీ తిరిగి స్థానం సంపాదించుకున్నారు.
హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం ఆయన సంపద భారీగా కుంగిన విషయం తెలిసిందే. దిద్దుబాటు చర్యల కారణంగా అదానీ కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. అదే సమయంలో భారత్‌లో విదేశీ పెట్టుబడులు పెరగడం కూడా కలిసొచ్చింది.

**తొలి మహిళ..**

100 బి.డాలర్ల మైలురాయిని అందుకున్న తొలి మహిళగా ఫ్రాంకోయిస్ బెటెన్‌కోర్ట్ నిలిచారు. విలాసవంత సౌందర్య ఉత్పత్తుల కంపెనీ లోరియల్ షేర్లు రాణించడం అందుకు దోహదం చేసింది. 101 బిలియన్ డాలర్లతో ఆమె 14వ స్థానంలో ఉన్నారు. ఏఐ ఆధారిత పరికరాలకు డిమాండ్ పుంజుకోవటంతో మైకేల్ డెల్ సంపద 113 బి.డాలర్లు దాటింది. ఆయన 11వ స్థానంలో నిలిచారు. లాటిన్ అమెరికాలో అత్యంత ధనవంతుడైన కార్లోస్ స్లిమ్ సంపద 2023లో 28 బిలియన్ డాలర్లు పెరిగింది. 106 బి.డాలర్లతో 13వ స్థానంలో ఉన్నారు.
222 బిలియన్ డాలర్లతో ఎల్‌వీఎంహెచ్ వ్యవస్థాపకుడు బెర్నార్డ్ ఆర్నాల్ట్ ఈ జాబితాలో తొలిస్థానంలో ఉన్నారు. అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్ 208 బి.డాలర్లు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ 187 బి.డాలర్లు తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. మస్క్ సంపద ఈ ఏడాది టెస్లా షేర్ల పతనం కారణంగా 40 బిలియన్ డాలర్లు కుంగడం గమనార్హం.

# జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం




## త్వరలో గ్రూప్ 4 ఉద్యోగాల సర్టిఫికెట్ వెరిఫికేషన్

రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు రెడీగా ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వీటిలో ఏ డాక్యుమెంట్ సమర్పించకపోయినా ఆ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ హాల్‌టిక్కెట్ల విడుదల

12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తర్వాత విద్యార్థులు తమ ఫొటో, సంతకం, పేరు, వివరాలతో పాటు ఏయే సబ్జెక్టులు రాస్తున్నామో వాటిని గమనించాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే తక్షణమే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకాలు లేకపోయినప్పటికీ పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.



# ఐపీఎల్-2024 ట్రోఫీ ఎగరేసుకుపోయేది ఆర్సీబీనే

### ఇర్ఫాన్ పఠాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

ఐపీఎల్-2024ప్లేఆఫ్స్‌లో మూడు బెర్తులు కన్ఫర్మ్ అయ్యాయి. కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్‌తో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాయి. ఇంకొక్క స్పాట్ కోసం ఆర్సీబీ-సీఎస్‌కే ఢీ అంటే ఢీ అంటున్నాయి. ఈ రెండు టీమ్స్ మధ్య శనివారం డూ ఆర్ డై మ్యాచ్ జరగనుంది. ఇందులో చెన్నై గెలిస్తే చాలు.. ప్లేఆఫ్స్ వెళ్తుంది. కానీ బెంగళూరు మాత్రం బిగ్ మార్జిన్‌తో నెగ్గాలి. అప్పుడే క్వాలిఫై అవ్వగలదు. చావోరేవోలా మారిన ఈ పోరాటం గురించి ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. ఏ టీమ్ ప్లేఆఫ్స్‌కు వెళ్తుంది ఎవరు కప్పు నెగ్గుతారు అనేది ఆసక్తికరంగా మారింది. ఈ తరుణంలో టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. కేకేఆర్, రాజస్థాన్ కాదు.. ఈసారి ఆర్సీబీ జట్టు ఐపీఎల్ కప్ ఎగరేసుకుపోవడం ఖాయమని పఠాన్ జోస్యం పలికాడు. ఆ టీమ్ ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అయితే కష్టమని.. మరింత డేంజరస్‌గా మారుతుందన్నాడు. వరుస విజయాలతో జోష్ మీదున్న బెంగళూరును ఆపడం ఎవరి తరం కాదన్నాడు పఠాన్. 'రేపటి ఫైట్‌లో నెగ్గడం రెండు జట్లకు అంత సులువు కాదు. అయితే ఇప్పుడు ఆర్సీబీ మంచి ఊపు మీద ఉంది. అటు చూస్తే చెన్నై కాస్త డల్‌గా ఉంది. పత్తిరానా, ముస్తాఫిజుర్, దీపక్ చాహర్ లేకపోవడంతో ఆ జట్టు బలహీనంగా కనిపిస్తోంది. ఒకవేళ రుతురాజ్ సేనను ఓడించి గానీ బెంగళూరు నెక్స్ట్ స్టేజ్‌కు వస్తే మాత్రం ప్లేఆఫ్స్‌కు వెళ్లిన మిగిలిన మూడు టీమ్స్‌కు ఎంతో ప్రమాదకరం. ఇప్పుడు బెంగళూరు తోపు ఫామ్‌లో ఉంది. ప్లేఆఫ్స్‌కు వస్తే



మాత్రం కప్పు తీసుకొనే వెళ్లేలా కనిపిస్తోంది' అని పఠాన్ చెప్పుకొచ్చాడు. పోరులో సీఎస్‌కే కంటే ఆర్సీబీనే ఫేవరెట్‌గా కనిపిస్తోందని పఠాన్‌అన్నాడు. గాయాల సమస్యలు, నయా కెప్టెన్, ధోని లీడర్‌గా లేకపోవడం టీమ్‌కు కాస్త నెగెటివ్‌గా మారిందన్నాడు. అయితే బిగ్ మ్యాచెస్‌లో ఎలా ఆడాలనే ట్రిక్ చెన్నైకి బాగా తెలుసన్నాడు. రుతురాజ్-ధోని కలసి టీమ్‌ను గట్టెక్కిస్తారని అభిమానులు ఆశిస్తున్నారని పఠాన్ పేర్కొన్నాడు. కాగా, ఒకవేళ వర్షం కారణం రేపటి మ్యాచ్ రద్దయితే బెంగళూరుకు నిరాశే. చెన్నై ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఈ మ్యాచ్ రిజల్ట్‌తో ప్లేఆఫ్స్ రేసు ముగుస్తుంది. ఒకవేళ మ్యాచ్ జరిగితే ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేస్తే కనీసం 18 పరుగుల తేడాతో సీఎస్‌కేను ఓడించాలి. అదే మొదట బౌలింగ్ చేస్తే ఇంకో 11 బంతులు ఉండగానే ఛేజింగ్ పూర్తవ్వాలి. మరి.. పఠాన్ చెప్పినట్లు ఆర్సీబీ కప్పు కొడుతుందని మీరు అనుకుంటే కామెంట్ చేయండి.



## పిల్లలతో కలిసి క్రికెట్ ఆడిన ప్యాట్ కమిన్స్

ఐపీల్ 2024 లో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌కి అడుగు పెట్టింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. గురువారం ఉప్పల్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఇరు జట్లకూ చెరొక పాయింట్ వచ్చింది. దీనితో ఎస్‌ఆర్‌హెచ్ 15 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. అయితే 2020 తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. ప్లేఆఫ్స్‌కు చేరుకోవడంతో టీం రిలాక్స్ మోడ్ లోకి వెళ్ళింది.

అందులో భాగంగా టీం కెప్టెన్ పాట్ కమ్మిన్స్ హైదరాబాద్లో ఒక గవర్నమెంట్ స్కూల్ పిల్లలతో కలిసి క్రికెట్ ఆడాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. గత మూడు సంవత్సరాలు చెప్పుకో దగ్గ పెర్ఫార్మన్స్ రాబట్ట లేకపోయింది. 2021, 2022 సీజన్ లలో 8వ స్థానంలో నిలిచింది. 2023 సీజన్‌లో అయితే ఏకంగా పదో స్థానంలో నిలిచి అభిమానులను నిరాశపరిచింది. ఈ క్రమంలోనే ఐపీఎల్ 2024 కోసం జరిగిన వేలంలో కావ్య కాసు లు కుమ్మరించి గతంలో ఎన్నడూ లేని విధంగా ఆటగాళ్ల కోసం పోటీ పడింది. ప్యాట్ కమిన్స్ కోసం అయితే ఏకంగా 20 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ట్రావిస్ హెడ్‌ను రూ. 6.80 కోట్ల కు దక్కించుకుంది. ఇక ఈ ఆసీస్ ప్లేయర్స్ ఇద్దరు తమ ఆట తీరుతో ఎస్‌ఆర్‌హెచ్ ని ప్లేఆఫ్స్‌కి వెళ్లడంలో కీలక పాత్ర పోషించారు.

# వరల్డ్ కప్ హీరో... సంజూ శాంసనే



టీ20 వరల్డ్ కప్-2024కు టీమిండియా రెడీ అవుతోంది. ఈ టోర్నీలో పాల్గొనేందుకు మరికొన్ని రోజుల్లో భారత జట్టు నుంచి ఒక బృందం వెళ్తనుంది. ఐపీఎల్-2024 ఫైనల్ ముగిసిన ఇంకొందరు ఆటగాళ్లతో కలసి మరో బృందం యూఎస్‌కు బయల్దేరనుంది. ఈసారి రోహిత్ సేన మీద భారీగా అంచనాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో టీమ్ అదరగొడుతుండటం, వన్డే వరల్డ్ కప్-2023 ఫైనల్‌కు వెళ్లడం, మిగిలిన సిరీస్‌ల్లోనూ డామినేషన్ చూపించడంతో పొట్టి కప్పును టీమిండియా ఎగరేసుకుపోవడం ఖాయమని అంటున్నారు. టీమ్ నిండా స్టార్లు ఉన్నా కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఎలా ఆడతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ తరుణంలో లెజెండ్ గౌతం గంభీర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. రోహిత్, కోహ్లీ కాదు.. వరల్డ్ కప్‌లో అతడే భారత జట్టును గెలిపించాలన్నాడు గంభీర్. ఒకవేళ ఆడకపోతే మాత్రం అతడ్ని టీమ్‌లోకి తీసుకొని దండగ అన్నాడు. గౌతీ అన్నది మరెవర్నో కాదు.. యంగ్ బ్యాటర్ సంజూ శాంసన్‌నే. టీమిండియాలో ఉంటాడా అనే సందిగ్ధంలో ఉన్న అతడు ఇప్పుడు ఏకంగా టీ20 ప్రపంచ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. రిషబ్ పంత్‌తో పాటు సెకండ్ వికెట్ కీపర్‌గా సంజూను ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఐపీఎల్-2024లో ఇప్పటిదాకా ఆడిన 13 మ్యాచుల్లో 504 పరుగులతో సత్తా చాటాడు. రాజస్థాన్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా తన పాత్రను సమర్థవంతంగా పోషించాడు. అలాంటి సంజూను ఉద్దేశించి గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అతడు పొట్టి కప్పులో సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నాడు. సంజూవరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నాడు గంభీర్. అయితే తుది జట్టులో అవకాశం వస్తే మాత్రం అతడు టీమిండియాను గెలిపించేందుకు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాల్సిన ఆవశ్యకత ఉందన్నాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కావాల్సినంత ఎక్స్‌పీరియెన్స్ శాంసన్ సాధించాడని.. అతడేమీ కొత్త ఆటగాడు కాదన్నాడు గౌతీ. ఐపీఎల్‌లోనూ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడని.. అందుకే సంజూకు ప్రపంచ కప్ జట్టులో ఆడే ఛాన్స్ వచ్చిందన్నాడు. ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కితే మాత్రం టీమ్‌ను గెలుపు తీరాలకు చేర్చే బాధ్యత అతడే తీసుకోవాలన్నాడు గంభీర్. క్రికెట్ వరల్డ్‌కు తన సత్తా ఏంటో చూపించమంటూ సంజూకు సవాల్ విసిరాడు. టాలెంట్, ఫిట్‌నెస్, పవర్ హిట్టింగ్, కీపింగ్, కెప్టెన్సీ.. ఇలా అన్నింటా అతడు బలంగా ఉన్నాడని మెచ్చుకున్నాడు. మరి.. గంభీర్ అనుకుంటున్నట్లు సంజూ మ్యాచ్ విన్నింగ్ నాక్స్ ఆడతాడని మీరు భావిస్తే కామెంట్ చేయండి.

## అభిషేక్ తల్లి పాదాలకు నమస్కరించిన శుభ్‌మన్



ఐపీఎల్ 2024లో భాగంగా గురువారం 66వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. వర్షం కారణంగా అర్ధరాత్రి వరకు మ్యాచ్ ప్రారంభం కాలేదు. దీంతో మ్యాచ్ రిఫరీ మ్యాచ్‌ను రద్దు చేయడం తో ఇరు జట్లకు ఒక్కొక్క పాయింట్ లభించింది. ఈ స్థితిలో ప్లేఆఫ్‌కు చేరిన మూడో జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది. అదే సమయంలో గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్‌కు దూరమైంది. తన చివరి మ్యాచ్‌లో గుజరాత్ విజయంతో నిష్క్రమిస్తుందని భావించారు. అయితే వర్షం కారణంగా ఇది జరగలేదు. జట్టు నిరాశను ఎదుర్కొన్నప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వీడియో వైరల్‌గా మారడంతో గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. ఈ వీడియోలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ తల్లి పాదాలకు శుభ్‌మన్ నమస్కరిస్తున్నట్లు కనిపించాడు. ఆ వీడియోలో శుభ్‌మన్ గిల్ భారతీయ సంప్రదాయం ప్రకారం అభిషేక్ తల్లి పాదాలను తాకడానికి క్రిందికి వంగి ఉన్నట్లు చూడవచ్చు. అదే సమయంలో, అభిషేక్ తల్లి గిల్ వీపును తట్టి అతనిని ఆశీర్వదించడం ద్వారా తన ప్రేమ, ఆప్యాయతను చూపించారు. ఈ క్రమంలో సంస్కారం అంటే ఇదే అంటూ నెటిజన్లు గిల్‌ను ప్రశంసిస్తున్నారు. హృదయాన్ని హత్తుకునే వీడియోలో అభిషేక్ సోదరితో గిల్ కరచాలనం కూడా చేశాడు. అభిషేక్, గిల్ ఇద్దరూ పంజాబ్ తరపున దేశవాళీ క్రికెట్ ఆడారు. వీరిద్దరూ 2018 అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టులో కూడా ఉన్నారు. ఐపీఎల్ 2024లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 12 మ్యాచ్‌లలో 426 పరుగులు సాధించిన సంగతి తెలిసిందే. ఇందులో సెంచరీ కూడా ఉంది. అదే సమయంలో, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ 12 మ్యాచ్‌ల్లో 401 పరుగులు చేశాడు. ట్రావిస్ హెడ్‌తో కలిసి అభిషేక్ శర్మ జట్టుకు రికార్డు భాగస్వామ్యాలు చేశాడు.

## హార్దిక్ పాండ్యా-రోహిత్ శర్మలపై వేటు తప్పదు



ఐపీఎల్ 2024 సీజన్ లో ఆట కంటే ఇతర గొడవలతో ఎక్కువ వార్తల్లో నిలిచిన జట్టు ఏదైనా ఉందంటే అది ముంబై ఇండియన్స్ అనే చెప్పాలి. ఈ ఐపీఎల్ సీజన్ ప్రారంభానికంటే ముందే సంచలనం సృష్టించింది ముంబై ఇండియన్స్. ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మను కాదని, గుజరాత్ నుంచి తీసుకున్న హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగించడంతో.. ఆ జట్టుకు దురదృష్టం అంటుకున్నట్లు అయ్యింది. ఈ సీజన్ లో ఇంటిదారి పట్టిన తొలి టీమ్ గా ముంబై అపకీర్తిని మూటగట్టుకుంది. కాగా.. ఈ సీజన్‌లో తన చివరి మ్యాచ్ లక్నోతో నేడు(శుక్రవారం) ఆడనుంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ ఐపీఎల్ కెరీర్ పై సంచలన కామెంట్స్ చేశాడు టీమిండియా మాజీ డాషింగ్ ప్లేయర్ వీరేంద్ర సెహ్వాగ్. ముంబై ఇండియన్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లో చివరి మ్యాచ్ ఆడనుంది. లక్నోతో (శుక్రవారం) వాంఖడే వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా ముంబై ఇండియన్స్ పై, హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మలపై సంచలన కామెంట్స్ చేశాడు టీమిండియా మాజీ ప్లేయర్ వీరేంద్ర సెహ్వాగ్. ' ఈ సీజన్ ముగిసిన తర్వాత ప్రతి జట్టు నలుగు ప్లేయర్లను రిటైన్ చేసుకునే అవకాశం ఉంది. అందులో భాగంగా ముంబై ఇండియన్స్ హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మలను విడుదల చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ లను కచ్చితంగా రిటైన్ చేసుకుంటుంది. స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ.. వారు గొప్పగా రాణిస్తేనే టీమ్ విజయం సాధిస్తుంది. ఈ సీజన్ లో రోహిత్ ఓ సెంచరీ సాధించాడు, కానీ ఆ మ్యాచ్ లో మిగతా ప్లేయర్లు రాణించకపోవడంతో ఓడిపోయింది' అంటూ చెప్పుకొచ్చాడు వీరూ భాయ్. ఇక ఈ సీజన్ లో ఇషాన్ కిషన్ కొన్ని మెరుపు ఇన్నింగ్స్ లు ఆడుతున్నప్పటికీ.. పవర్ ప్లేలోనే వికెట్ కోల్పోతున్నాడని విమర్శించాడు సెహ్వాగ్. కాగా.. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ముంబై ఇండియన్స్ లో రాణించారని వాళ్లే జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ లు అని వారిద్దరిని మాత్రమే రిటైన్ చేసుకుంటారని వీరూ భాయ్ పేర్కొన్నాడు. సెహ్వాగ్ వ్యాఖ్యలను టీమిండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ కూడా ఏకీభవించాడు.

# సింగారం ఇసుక క్వారీని రద్దు చేయాలి

- తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చిన గ్రామస్తులు



**కన్నాయిగూడెం, మే 17, (జనం సాక్షి) :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సింగారం గ్రామంలో పగలు రాత్రి తేడా లేకుండా ప్రైవేట్ సైన్యం ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సింగారం గ్రామస్తులు శుక్రవారం రోజున తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతి ఉన్న పట్టా భూముల్లో కాకుండా నడి గోదావరిలో తవ్వకాలు చేస్తున్నారని ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తే తమ పంట భూములు, చేన్లు కోతకు గురైతాయని రైతులు ఆందోళన చేశారు.అనుమతులు ఉన్న చోట కాకుండా నడి గోదావరిలో 10 నుంచి 15 మీటర్ల వరకు తవ్వకాలు చేస్తున్నా కూడా టీఎస్ఎండీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం గ్రామస్తులు అందరూ కలిసి కన్నాయిగూడెం తహసీల్దార్ యం. డీ సలీంకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం రైతులు మాట్లాడుతూ ఓవర్ లోడ్ కారణంగా రోడ్లు పాడైపోతున్నాయని, ద్విచక్ర వాహనాల మీద ఊరిలో తిరగాలంటేనే జనం జంకుతున్నారన్నారు.తమ వినతిపత్రంపై స్థానిక తహసీల్దార్ సానుకూలంగా స్పందించి సింగారం ఇసుక క్వారీపై తక్షణమే తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించినట్లు రైతులు మీడియాకి తెలిపారు.



## ఐటిఐలో దరఖాస్తులకు ఆహ్వానం

**శామీర్ పేట జనం సాక్షి :** శామీర్పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థ(ఐటిఐ) కళాశాలలో 24-25 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ లలిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, కో పా, కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ప్రోగ్రామింగ్, అసిస్టెంట్ ట్రేడ్లు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. పదవతరగతి ఉత్తీర్ణత ఉండి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల మే 17వ తేది నుంచి జూన్ 10 వ తేదీ వరకు www.iti.telangana.gov.in ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



## నిద్రలేమితో రక్తపోటు పెరిగే అవకాశం ఎక్కువ

### మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత

**నస్పూర్, మే 17, (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరికి ఒక రోజులో 6-8 గంటల నిద్ర అవసరమని,నిద్ర తక్కువైతే రక్తపోటు అధికంగా పెరిగే అవకాశం ఉందని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత పేర్కొన్నారు.నస్పూర్ పురపాలికలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా రక్తపోటు, బ్లడ్ ప్రెషర్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ప్రస్తుత కాలంలో మానవుని జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల అసంక్రమణ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తపోటు గురించి తెలుసుకోవాలని,30 సంవత్సరాలు పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు.జిల్లాలో నేటి నుండి 15 రోజులపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉప కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు.ఆరోగ్య కార్యకర్తలకు గ్రామాల లో ప్రజలకు రక్తపోటు పై అవగాహన కలిగించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పిఓ ఎంసిహెచ్ డాక్టర్ నీరజ, పిఓ ఎన్సిడి డాక్టర్ శివ ప్రతాప్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత లింగారెడ్డి, డాక్టర్ కిరణ్, సిహెచ్ఓ సుమన్, పీహెచ్సీ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

### గిరిజన దరఖాస్తు దారులకు

# ముఖం చాటేస్తున్న ఐటిడిఏ పిఓ

- మా బాధలు ఎవరితో చెప్పుకోవాలి : ఆదివాసీ మహిళా సంఘం నేత శమంతకమణి



**ఏటూరునాగారం, మే 17(జనంసాక్షి) :** రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి కోసం, వారి సంరక్షణ కోసం చట్టాలు, జీవో లు, హక్కులను కాపాడడం కోసం ప్రత్యేకంగా గిరిజన అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి, సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అధికారాలను ఇచ్చి, వాటిని అమలు చేయడం కోసం ఐఏఎస్ అధికారులను నియమించడం జరుగు తుంది. అంటే ఐటిడిఏ గిరిజనులకు దేవాలయం వంటిది, కానీ నేడు దేవుని గుడికి వెళ్తే దేవుడి దర్శనమైన దక్కుతుంది కానీ పిఓ దర్శనం దొరకడం కష్టంగా మారింది. ఆదివాసీలు ఎంతో సుదూర ప్రాంతాల నుండి వారికి జరుగుతున్న అన్యాయాలపై, సమస్యలపై, అభివృద్ధి పనుల కోసం ఐటిడిఏ పిఓ కి దరఖాస్తు చేయడానికి, లేదా తమకు జరుగు అన్యాయం పై గోడు వెళ్లబుచ్చుకోవడానికి వస్తుంటారు. తీరా ఐటిడిఏ కి వస్తే ఇక్కడ పిఓ దర్శనం దొరకడం లేదు. ఎంతో దూర ప్రాంతాల నుండి వచ్చు దరఖాస్తుదారులను కలవకుండా వారి సమస్యలు వినకుండా వారితో నేరుగా మాట్లాడకుండా ముఖం చాటేస్తూ తన కింద ఇద్దరు గిరిజనేతర డైలీ వేజ్ ఉద్యోగులను పెట్టుకొని వారికి దరఖాస్తు ఇచ్చి వెళ్లండి అనడం, మేము పిఓ ని కలవడానికి ఎంత ప్రయత్నం చేసినా కలవకపోవడం మా బాధలను వినకపోవడం ఏంటని, ఇక మా బాధలను, సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా పిఓ గిరిజనులను నేరుగా కలిసి వారి సమస్యలను వినాలని తన దగ్గర సీ.సీ.లుగా ఏ అర్హత లేకున్నా నియమించుకున్న గిరిజనేతర డైలీ వేజ్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో గిరిజన ఉద్యోగులను నియమించు కోవాలని, గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పడిన అటనామస్ సంస్థ లో గిరిజనే తర డైలీ వేజ్ ఉద్యోగులను ఏ జీవోల ద్వారా భర్తీ చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మా మహిళా సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళా సంఘం నేతలు సోయం రత్న, సోయం సత్యమ్మ, వాసం భవాని, వాసం జమున, గొంది గౌరమ్మ, యాలం దేవి, సోయం లక్ష్మి, తల్లడి విజయ పీరీల సుమలత, సోలం కమల, ఈసం జమున, బడే లలిత, కోడిపా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలులో దోపిడి

- పైగా రైతులను బెదిరిస్తున్న నిర్వాహకుడు

**చెన్నూర్, మే, 17 (జనంసాక్షి) :** మండలంలోని సోమనపల్లి గ్రామ పంచాయతీలో గల దుబ్బ పల్లె పిఏసిఎస్ వారి ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తూ అడిగితే కిరణ్ రెడ్డి, సోదారి సారయ్య అనే రైతులమైన మాపై బెదిరిస్తూ ఎవరికి చెప్పు కుంటారో చెప్పుకోండి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం పండించిన వరి ధాన్యాన్ని సెంటర్లో ఆరబెట్టి తేమ, తాలు లేకుండా బస్తాకు 42 కిలోల చొప్పున తూకం వేసుకొని ఈనెల 14న లారీలో లోడ్ చేసుకొని వెళ్లి ఇప్పుడు అదనంగా ఎనిమిది క్వింటాళ్లు వేబ్రిడ్జిలో తక్కువ వస్తుందని దాన్ని మీరే భరించాలని అంటున్నాడు. కొనుగోలు చేసే సమయంలో అన్నీ సరిగా చూసుకొని రైతులమైన మాకు కొనుగోలుకు సంబంధించిన రసీదులు ఏమీ ఇవ్వకుండా అందిన కాడికి దండుకోవాలని చూస్తున్న నిర్వాహకుని పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరడం జరుగుతుంది.

# సకాలంలో పాఠశాలల్లో మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్
- ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించిన సీఎస్
- ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు
- స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలన్న సీఎస్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 17 జనంసాక్షి:** ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌళిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు.శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు.జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌తో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్ లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసి కనీస మౌళిక సదుపాయ పనులు గ్రౌండ్ చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు సైతం చేపట్టాలని, మంజూరు చేసి ఇప్పటి వరకు గ్రౌండ్ కాని పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని సీఎస్ సూచించారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూని ఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు బట్టలు చేరాయని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్టలు చేరతాయని సిఎస్ తెలిపారు. జిల్లాలో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన గుర్తించిన స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సి.ఎస్. కలెక్టర్లకు సూచించారు. పాఠశాలలు పున ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ తప్పనిసరిగా యూనిఫారంలు అందించే విధంగా సన్నద్ధమయ్యేలా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరపై కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని, అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా సత్వరమే కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ సమావేశం లో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నరసింహారావు,జడ్పీ సీఈవో నర్మద, డిసిఓ వెంకటేశ్వర్లు, డిహెచ్ఎస్ఓ మరియన్న,డి.ఏ.ఓ అభిమన్యుడు, ఆర్అండ్‌బి ఈ తానేశ్వర్, జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, డి యం సివిల్ సప్లై కృష్ణవేణి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 మే 2024


# పల్లెల్లో స్థానిక సంబురం

**రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోలహాలం ముగిసిందో లేదో పల్లెల్లో స్థానిక సంబరం మొదలైంది. గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో ఇందుకు అనుగుణంగా అధికారులు తమ ప్రక్రియ ప్రారంభించారు. గ్రామపంచాయతీ రిజర్వేషన్లు మారైన బీసీ కులగణన జరిగేనా అన్న చర్చ పల్లెల్లో మొదలైంది.**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిది మే 17 (జనంసాక్షి)

- ఆశల పల్లకిలో ఆశావహులు
- గ్రామపంచాయతీ రిజర్వేషన్లు మారేనా?
- బీసీ గణన జరిగేనా?

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామపంచాయతీ ఉన్నాయి. ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం జిల్లాలో ఎస్సీ మహిళలకు 25 జనరల్ 24,ఎస్టీ మహిళ 16 స్థానాలు,జనరల్ 15 స్థానాలు బీసీ మహిళలకు 29 స్థానాలు, 28 జనరల్ స్థానాలు, ఇతరులకు 58 మహిళ స్థానాలు, 57 జనరల్ స్థానాలు కేటాయించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన క్రమంలో జూన్ చివరి వారంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుండి ఆదేశాలు అందడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. గతంలో ఉన్నతాధికారుల అదేశాల మేరకు జిల్లా నుండి రిజర్వేషన్ల జాబితాను పంపించారు. గత ఎన్నికల్లో అవలంభించిన పద్ధతిలో నివేదిక రూపంలో అందజేశారు. కాగా ఇటు నాయకులు,ఇటు అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ ప్రకటన చేస్తే అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇదివరకే ఆదేశాలివ్వడంతో లోక్ సభ ఎన్నికల ముందు జిల్లాలో కసరత్తు జరిగింది. తాజాగా అదనపు సమాచారాన్ని సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.జూన్ 4 న వెలువడే లోక్ సభ ఎన్నికల ఫలితాల తరువాత కోడ్ ముగియనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా లోక్ సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేసింది. ఇదే జరిగితే వచ్చే మూడు నెలలపాటు జిల్లాల్లో ఊరూరా కోలాహలమే కనిపిం చనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన గ్రామాల్లో కొనసాగుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కష్టపడిన ఆయా పార్టీల నాయకులు ఇప్పుడు తమ లక్ష్యమంతా స్థానిక సంస్థల్లో పోటీ చేయడమే అంటున్నారు. గ్రామస్థాయిలో సర్పంచికి పోటీ చేసే విషయంలో ఇప్పటి నుండి ఆశావాహులు తమ ప్రణలికలను సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో కుల సంఘాలతో సంప్రదింపులు చేపడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వేదికగా తాము పోటీ చేస్తున్నట్లు తమ మద్దతుదారులతో ప్రకటించుకుంటున్నారు. దీనితో గ్రామాల్లో సర్పంచి పదవికి గట్టిపోటీయే కనపడుతోంది. ఆయా పార్టీల మద్దతుతో నిలిస్తే తమకు లాభం చేకూరుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారితో పాటు కొత్త వాళ్ళు సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు...



### కుల గణన జరిగేనా?

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లుకు సంబంధించి కులగనన చేపట్టేందుకు ప్రభుత్వం రూ 150 కోట్లు కేటాయించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లోపు కులగనన పూర్తయ్యేనా అంటూ గ్రామంలో చర్చ కొనసాగుతుంది. దీంతోపాటు గతంలో ఉన్న రిజర్వేషన్లు కొనసాగిస్తారా లేదా తిరిగి రిజర్వేషన్లు ప్రకటిస్తారా అన్న అంశం కూడా విస్తృతంగా నాయకుల మధ్య ప్రజల మధ్య చర్చ కొనసాగు తుంది. ఏది ఏమైనప్పటికీ పార్లమెంటు ఎన్నికల ఫలితాల ఊపులో స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కావడానికి అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్షాల నాయకులు సిద్ధమవుతున్నారు.



# యుద్ధం మిగిలే ఉన్నది

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- భూమి పుత్రుడు పుస్తకం ఆవిష్కరణ

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమం కు శ్రీకర చుట్టాలని, రాష్ట్రంలో యుద్ధం ఇంకా మిగిలి ఉందని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. ఉద్యమ శక్తులను మరోసారి పునరేకికరణ చేసి కార్యక్షత్రానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు. రాజకీయ, సామాజిక అంశాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతి తదితర అంశాలపై తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్ ఎడిటోరియల్ వ్యాసాలతో రూపకల్పన చేసిన లి సన్ ఆఫ్ ద సాయిల్ లి (భూమిపుత్రుడు) పుస్తకాన్ని కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, బీఆర్ఎస్ అధినేత గోసుల శ్రీనివాస్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ ప్రగతిని సాధారణ శైలిలో, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని ప్రశంశించారు. త్వరలో ఉద్యమ రచయితలతో ఒక సమావేశం పెట్టుకుందామని, రచయితలకు అన్ని విధాలుగా తోడుగా ఉంటానని, రచయితలు ప్రజల పక్షాన ఉండాలని కేసీఆర్ ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బావ వ్యాప్తి తో ఉద్యమం ఉదృతమైందని గుర్తు చేస్తూ మరోసారి కవులు కళాకారులు ఏకం కావలసిన అవసరాన్ని గుర్తు చేశారు. కొట్లాడు తెచ్చుకున్న తెలంగాణ ను ఇప్పటికి కాంగ్రెస్ సర్కారు తిరుగమన దిశగా ఆలోచించడాన్ని కెసిఆర్ తప్పు పట్టారు. కర్షకులు కార్మికులు నిరుద్యోగులు వివిధ వర్గాలు కాంగ్రెస్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల తెలంగాణలో ప్రజల కు చిన్న ఇబ్బంది కలగకుండా చేశారని ఈ సందర్భంగా కేసీఆర్ తన పాలన మజిలీలను గుర్తు చేసుకున్నారు. కార్యకమంలో మాజీ మంత్రి వర్యులు హరీశ్‌రావు, బాలమల్లు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం మరచిన తనయులు

- ఆస్తి పంపకాల్లో తేడాతో రెండ్రోజులు
- తల్లి దహన సంస్కారాలు నిలిపివేత
- చివరకు పంచాయితీ తెగడంతో దహనం
- సూర్యాపేట జిల్లాలో కలచివేసిన ఘటన





**సూర్యాపేట, మే 17 (జనంసాక్షి) :** మానవత్వం మంట కలిసిపోతుంది. మానవ సంబంధాలు, విలువలు రోజురోజుకు దిగజారుతూ అంతరించిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఒకప్పుడు ప్రేమానురాగాలు ఉండేవి. రాను రాను డబ్బుపై వ్యామోహం పెరిగి బంధుత్వాలు తగ్గుకుంటూ వస్తున్నాయి. ఆస్తి పాస్తులు ఉంటే చాలు తల్లిదండ్రులు కూడా అవసరం లేదని రుజువు చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఎంతో ప్రేమానురాగాలతో పెంచి పెద్ద చేస్తారు. కానీ చివరికి అలాంటి తల్లిదండ్రులని పట్టించుకోని దీన స్థితి నెలకొంది. బంగారం, డబ్బుల కోసం చివరకు చనిపోయిన తల్లి అంత్యక్రియలు నిర్వహించకుండా రెండు రోజులు రోజులు ఆపిన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని కందులవారి గూడెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

కందులవారిగూడేనికి చెందిన వేము వెంకటరెడ్డి, లక్ష్మమ్మ (80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలోనే లక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి, చిన్న కుమారుడు కూడా చనిపోయారు . దీంతో నేరేడుచర్లలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద గత ఐదేళ్లుగా లక్ష్మమ్మ ఉంటుంది. లక్ష్మమ్మ ఇటీవల కాలు జారి కింద పడింది. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు . ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు సూచించారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్ సపోర్ట్‌తో చిన్నకుమార్తె తన ఇంటికి తీసుకెళ్లింది. బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్ వచ్చి ఆగింది. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడికి చేరుకుని.. పెద్దమనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెం తీసుకెళ్తానని చెప్పడంతో.. మిగతా కూతుళ్లు ఆస్తి పంపకాలు తేలే వరకు అంబులెన్స్ కదిలేది లేదని పట్టుపట్టారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. మృతదేహాన్ని కందులవారిగూడెం తరలించినా కొడుకు కూతుళ్ల పంచాయితీ మాత్రం ఆగలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21 లక్షల వరకు పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలున్నాయి. అయితే లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్నకూతురికి రూ.21 లక్షల్లోంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన రూ.15 లక్షలకు సంబంధించిన పేపర్లను కుమారుడికి అప్పజెప్పారు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా అయిపోయిందిలే అనుకుంటున్నా సమయంలోనే కుమారుడు కొత్త పేచీ పెట్టాడు. తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానన్నాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషులు అంత్యక్రియల ఖర్చుకు రెండు లక్షలు ఇప్పియడంతో ఆ పంచాయితీ కొలిక్కి వచ్చింది. తర్వాత ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

## ప్రాంతీయ భావోద్వేగాలను
# తక్కువ చేయరాదు

- దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీలదే ప్రాబల్యం
- బిఆర్ఎస్‌కు అనుకూలంగా విజయశాంతి వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** రాజకీయాల్లో కొంత కాలంగా సైలెంట్ గా ఉన్న విజయశాంతి హఠాత్తుగా బీఆర్ఎస్‌కు మద్దతుగా తెరపైకి వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను విజయశాంతి ఖండించారు. ప్రాంతీయ భావోద్వేగాలు ప్రజా మనోభావాలను వారి ఆత్మాభిమానం వైపు నడిపిస్తూనే వస్తుండడం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానమననారు. ఈ దక్షిణాది స్వీయ గౌరవ అస్థిత్వ సత్యం కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు, బీజేపీ కనీసం ఆలోచన చెయ్యని అంశం బహుశా కిషన్ రెడ్డి గారి ప్రకటన భావం అని చెప్పుకొచ్చారు. నిజానికి ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని బీజేపీ నేతలే కాదు కాంగ్రెస్ నేతలు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే విజయశాంతి కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకుందని.. బీజేపీ నేతలే అర్థం చేసుకోలేదన్నట్లుగా సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుతం విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. గత ఎన్నికలకు ముందు ఆమె బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆమెను పట్టించుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆమె పేరు పరిగణనలోకి తీసకోలేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పట్టించుకోలేదు. కనీసం ప్రచారానికి కూడా పిలువలేదు. కాంగ్రెస్ తీరుపై ఆమె అసంతృప్తిలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. విజయశాంతి సొంత పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ తర్వాత తన పార్టీని టీఆర్ఎస్ లో విలీనం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ తరపున ఎంపీగా గెలిచారు. పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ లో పోరాడారు. తెలంగాణ ఇస్తే.. టీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత అలా చేయలేదని విజయశాంతి బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ తరపున మెదక్ అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకపోయినప్పటికీ.. కాంగ్రెస్ లోనే కొనసాగారు. 2018 ముందస్తు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ గా ఉన్నారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. బీజేపీలో చేరినా ఎన్నికల వరకూ ఉండలేదు. బీఆర్ఎస్ ను ఓడించే పార్టీ కాంగ్రెస్సేనని అనుకుని మళ్లీ ఆ పార్టీలో చేరారు. ఇన్ని పార్టీలు మారడం వల్ల ఆమెకు రాజకీయాల్లో ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. తాజాగా బీఆర్ఎస్ కు మద్దతుగా మాట్లాడుతుండటం ఆసక్తికరంగా మారింది.

# సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయండి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో



**వరంగల్ ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) :** సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో ఆ శాఖ కమిషనర్, టిఎస్ఎంఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ వి. కర్ణన్, జాయింట్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్ పి. ప్రావీణ్య లతో కలసి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల ప్రగతిని అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా నగరంలోని ఎం జి ఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సికే ఎం ప్రసూతి ఆసుపత్రి, హన్మకొండ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ టిబి ఆసుపత్రులలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న విభాగాలు, ఉపస్థితిలో ఉన్న ఈక్విప్మెంట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోకి మార్పు చేసే విభాగాలు తదితర అంశాలను ఆయా ఆసుపత్రుల పర్యవేక్షకులతో వారు కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులతో కలిసి కొనసాగుతున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు.అనంతరం వారు ఎం జి ఎం ఆసుపత్రి లోని క్యాజువాలిటీ, పిడియాట్రిక్ విభాగాలను, కె ఎం సి లోని పి ఎం ఎస్ ఎస్ వై ఆసుపత్రి క్యాథ్ ల్యాబ్, డయాలిసిస్ విభాగాలను సందర్శించి ఎక్విప్మెంట్, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్‌ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్ రెడ్డి టిఎస్ఎంఐడిసి ఎస్ ఈ దేవేందర్, ఎం జి ఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సికే ఎం ప్రసూతి ఆసుపత్రి, హన్మకొండ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ టిబి ఆసుపత్రుల పర్యవేక్షకులు చంద్రశేఖర్, నిర్మల, విజయలక్ష్మి, శ్రవణ్, గిరిధర్, సికేఎం ప్రిన్సిపల్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపల్ రాం కుమార్ రెడ్డి, ఎల్ అండ్ టి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమరంపై నేతల వ్యూహం

- వర్గపోరు లేకుండా కాంగ్రెస్ కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 1,740 జీపీలు, 72 మండలాలు



**వరంగల్, మే 17 (జనంసాక్షి) :** పార్లమెంట్ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇక అందరి దృష్టి స్థానిక సమరంపై పడింది. జూన్‌లో ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చాక స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల మెటీరియల్, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు, 72 మండలాలు ఉన్నాయి. ఇప్పుడున్న రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. కొత్త చట్టం ప్రకారం రెండు టర్ముల వరకు ఒకటే రిజర్వేషన్లు ఖరారు చేశారు. మొదటి టర్మ్‌కు సంబంధించి ఫిబ్రవరిలో పంచాయతీల పాలన ముగియగా, జూలైలో జిల్లా పరిషత్ల పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుంది. కాబట్టి జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. పంచాయతీ వార్డులు మొదలు జడ్పీ చైర్మన్ స్థానం వరకు ఇప్పుడున్న రిజర్వేషన్లే యథావిధిగా కొనసాగనున్నాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికల టైంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా కొన్ని మండలాలు ప్రకటించింది. వీటి విషయంలో కాంగ్రెస్ సర్కార్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఇవి మినహా ఇతర స్థానాల రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదు. నేరుగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, వారం, పదిరోజు ల్లో ఎన్నికల ప్రచారం, నామినేషన్ల పక్రియ ముగించాలని భావిస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, కొద్ది రోజుల తేడాతో సర్పంచ్ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయంగా ఎలాంటి సమస్యలు ఉండవని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే కాకుండా వలసొచ్చిన నేతలతో వర్గపోరు తలెత్తకుండా ఉంటుందని జిల్లా మంత్రులు అభిప్రాయపడుతున్నారు. కష్టపడ్డ నేతలకే లోకల్‌బాడీ ఎన్నికల్లో ప్రియార్టీ ఇచ్చేందుకు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇప్పటికే బంపర్ఆఫర్ ప్రకటించారు. ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ సాధించి పెట్టిన స్థానిక లీడర్లకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. పైగా వాళ్ల ఎన్నికల ఖర్చు కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంపీ ఎన్నికల్లో జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారంతా ఎంపీ ఎన్నికల్లో కష్టపడ్డారు. నల్గొండ నియోజకవర్గంలోని తిప్పర్తి మండలంలో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఇక్కడి నుంచే ప్రస్తుత జడ్పీటీసీ పాశం రాంరెడ్డి వచ్చేసారి జడ్పీ చైర్మన్ సీటు ఆశిస్తున్నారు. దీనిలో భాగంగానే తిప్పర్తి క్లాక్ టవర్ జంక్షన్అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కూడా మంజూరు చేయించారు. అదే విధంగా కనగల్మండల జంక్షన్ అభివృద్ధికి మరో రూ.5 కోట్లు మంత్రి కోమటిరెడ్డి మంజూరు చేయించారు. ఇలా లోకల్బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేకుండా ఉండేందుకే ఇప్పటి నుంచే అభివృద్ధి పనులపైనే ఫోకస్ పెట్టారు. ఎంపీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ స్థానాలు కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. అదే జోష్తో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ ఐదేళ్ల వరకు ఎన్నికలు ఉండవని భావిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి మున్సిపాలిటీ, సహకార సంఘాల ఎన్నికలు కూడా పూర్తవుతాయి. అంతకంటే ముందే జరిగే గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలను కాంగ్రెస్ పక్కాగా ప్లాన్ చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ఎన్నికల టైంలో బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వీళ్లలో చాలా మంది పాత కాంగ్రెస్ లీడర్లతోపాటు కొత్తగా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులూ ఉన్నారు. వలసనేతలు, కరుడుగట్టిన కాంగ్రెస్ లీడర్ల మధ్య స్థానిక ఎన్నికల్లో విభేదాలు తలెత్తకుండా ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు. పంచాయతీ, జడ్పీ ఎన్నికలకు కలిపి ఒకటే సారి ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే ప్రత్యర్థులకు ఛాన్స్ ఉండదని, పైగా లోకల్‌బాడీలను హస్తగతం చేసుకునేందుకు మార్గం సులువుగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370